సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 214

బుధవారం 19-4-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



ముంబై హ్యాట్రిక్ విజయం

14 పరుగుల తేడాతో ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ - 12లో



యాపిల్ స్టోర్ వచ్చేసింది..

ముంబైలో తొలి స్టోర్ ప్రారంభించిన సీఈవో టిమ్‌కుక్ - 13లో



ఇక ఏ మాఫియా బెదిరించలేదు

యూపీలో ఇకపై ఏ మాఫియా కూడా బెదిరింపులకు పాల్పడి భయాందోళనలు సృష్టించబోదని ఆ రాష్ట్ర సీఎం యోగి అన్నారు. వివరాలు 6లో ▸



సూడాన్‌లో 185 మంది మృతి

సూడాన్‌లో అధికారం కోసం ఆర్మీ, పారా మిలటరీ బలగాల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో 185 మంది ప్రాణాలు కోల్పోయారు. వివరాలు 6లో ▸



కన్నడనాట కులాల కోలాటం


కర్ణాటకలో గెలుపోటములను శాసించే కులాల మనసు చూరగొనేందుకు బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రయత్నిస్తున్నాయి. వివరాలు 6లో ▸

డిపాజిట్లలో రహస్యం ఉందా?

మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కి, రామోజీరావుకి సుప్రీంకోర్టు ప్రశ్న

- డిపాజిటర్ల వివరాలన్నీ బయటపెట్టాలని ఆదేశం
- ఎవరెవరికి ఎంతెంత చెల్లించారో వివరంగా చెప్పండి
- డిపాజిటర్ల వివరాలు కోర్టుకు సమగ్రంగా వెల్లడించండి
- ఏపీ ప్రభుత్వం, ఉండవల్లి అభ్యర్థనతో సుప్రీం ఆదేశాలు
- రిజాయిండర్ దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతి
- విచారణ జూలైకి వాయిదా

> ఒక చోట ప్రొప్రయిటర్ అన్నారు... మరొక చోట హెచ్‌యుఎఫ్ అన్నారు. అలా చెప్పటం చట్ట విరుద్ధం కదా? డిపాజిటర్లకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన చెల్లింపుల్లో ఏమైనా రహస్యం దాగుందా?. లేకుంటే వాటి వివరాలు బహిర్గతం చేయొచ్చు కదా?.. కోర్టుకు అన్ని వివరాలూ అందజేయండి.
> - సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: డిపాజిటర్లకు చేసిన చెల్లింపుల్లో ఏమైనా రహస్యం దాగుందా అని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటిదేమీ లేని పక్షంలో ఆయా వివరాలు పూర్తిగా కోర్టుకు అందజేయాలని ఆదేశించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం నుంచి కొన్ని డాక్యుమెంట్లు తీసుకోవాల్సి ఉందని, రెండు వారాలు గడువు ఇవ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం వాయిదా కోరుతూ లెటర్‌ను సర్క్యులేట్ చేయగా.. దానిపై మార్గదర్శి అభ్యంతరం చెప్పింది. అభ్యంతరాలతో కూడిన లెటర్‌ను సోమవారం రాత్రే మార్గదర్శి ఫైనాన్షియర్స్ సర్క్యులేట్ చేసింది. దీన్ని గుర్తుచేస్తూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా.. వాదనలు వినిపించారు. ఈ దశలో జస్టిస్ జేబీ పార్దీవాలా జోక్యం చేసుకుని.. ''కొన్నిసార్లు

మిగతా 2వ పేజీలో ▶



న్యూస్‌రీల్

ప్రభుత్వ స్కూళ్లలో నైట్ వాచ్‌మన్లు



నాడు–నేడు కింద రూ.వేలాది కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అక్కడి పరికరాలు, ఇతర సదుపాయాల పరిరక్షణ, భద్రత కోసం నైట్ వాచ్‌మన్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాచ్‌మన్లుగా నియమితులైన వారికి నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

వివరాలు 3 ▸

జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు



భారత అగ్రశ్రేణి ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో 713 పాయింట్లు స్కోర్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పింది.

వివరాలు 12 ▸


అతీక్ అహ్మద్ రహస్య లేఖ



గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ మరణించే ముందు ఓ లేఖ రాసి, సీల్డ్ కవర్‌లో భద్రంగా దాచిపెట్టాడు. దానిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రికి అందజేయాలని కోరినట్లు ఆయన తరపు న్యాయవాది వెల్లడించారు.

వివరాలు 6 ▸

సీఎం పర్యటనల వాయిదాపై తప్పుడు కథనాలు



- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్‌రెడ్డి

వివరాలు 14 ▸



ఇదం జగత్



అవినాశ్‌ను అరెస్టు చేయొద్దు

తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

- 25వ తేదీ వరకు సీబీఐ కార్యాలయానికి ఎంపీ హాజరు కావాలి
- దర్యాప్తు అధికారులు లిఖిత పూర్వకంగానే విచారణ చేపట్టాలి
- వీడియో, ఆడియో రికార్డు చేయాలని కోర్టు ఆదేశాలు
- సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబట్టిన అవినాశ్ న్యాయవాది
- కిరాయి హంతకుడి ప్రెస్‌మీట్‌ను ప్రచురిస్తారా?
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలపై ఆ వ్యాఖ్యలేమిటి?
- 'టేక్ అవుట్' ప్రామాణికమని గూగుల్ కూడా సర్టిఫికెట్ ఇవ్వదు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఈ నెల 25వ తేదీ వరకు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అప్పటి వరకు ఆయన రోజూ సీబీఐ కార్యాలయానికి వస్తారని, ఏ విచారణ చేయాలన్నా చేపట్టవచ్చని సూచించింది. అయితే సీబీఐ అడిగే ప్రశ్నలు లిఖిత పూర్వకంగా ఉండాలని... వీడియో, ఆడియో రికార్డు చేయాలని స్పష్టం చేసింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా అరెస్టులు చేయడం సరికాదని, 25వతేదీలోగా సాక్ష్యాలు సేకరించాలని పేర్కొంటూ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి అన్ని అంశాలను పరిశీలించి తుది ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 30లోగా విచారణ పూర్తి చేయాలని సీబీఐకి నిర్దేశించింది. వివేకా హత్య కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. పిటిషనర్ తరఫున

మిగతా 2వ పేజీలో ▶

మీ కోసం వస్తే.. మాపై నిందలా?

మీకైతే దైవాశీస్సులు.. మాకైతే లాబీయింగా?: వైవీ సుబ్బారెడ్డి

- రామోజీ బంధువు విమానంలోనే విజయవాడకు విజయ్‌కుమార్‌స్వామి
- మార్గదర్శి కేసు నుంచి బయట పడేందుకు పిలిచారనుకోవాలా?
- ఆయన గతంలోనూ రామోజీ బంధువుల గృహ ప్రవేశానికి వచ్చారు

3లో



రామోజీ వియ్యంకుడు నవయుగ విశ్వేశ్వరరావు, ఆయన కుమారుడు శశిధర్, విజయకుమార్‌స్వామిల ఫొటోను చూపిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

నేడు మూలపేట పోర్టుకు భూమి పూజ


ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తున్న సీఎం జగన్

3లో



క్షేత్ర స్థాయి సైనికులను కలుసుకోవడం ఆనందదాయకం

సీఎం వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: సచివాలయాల్లోని ప్రతి ఇంటిని అవిశ్రాంతంగా సందర్శించి.. రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి సందేశాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్లిన తమ సైనికుల్లో కొందరిని కలుసుకోవడం పట్ల చాలా ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సచివాలయ కన్వీనర్లు మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం తనను కలిసిన వారి ఫొటోలను జత చేసి సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. అంకితభావంతో పనిచేసే క్షేత్ర స్థాయి సైనికులను కలుసుకోవడం పట్ల ఆనందంగా ఉందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి ఇది గర్వకారణమన్నారు.

సీబీఐ కస్టడీకి భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకా హత్యకేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దాఖలు చేసిన పిటిషన్లను ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. వారిద్దరిని ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని బుధవారం సీబీఐ కస్టడీలోకి తీసుకుని విచారించనుంది.

పలువురు జిల్లా జడ్జీల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పలువురు జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. బదిలీ అయిన వారిలో హైకోర్టు రిజిస్ట్రార్లు కూడా ఉన్నారు. హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) గంధం సునీత తూర్పు గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి (పీడీజే)గా, రిజిస్ట్రార్ (అడ్మిన్) ఆలపాటి గిరిధర్ విశాఖపట్నం పీడీజేగా బదిలీ అయ్యారు. విశాఖపట్నం పీడీజేగా ఉన్న జి.గోపీ ఏపీ వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమితులయ్యారు. విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి కడప జిల్లా పీడీజేగా బదిలీ అయ్యారు. విశాఖపట్నం సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి బి.సత్యవెంకటహిమబిందు విజయవాడ ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జిగా బదిలీ అయ్యారు. బదిలీ అయిన జిల్లా జడ్జీల్లో గొల్లా శ్రీదేవి, డి.తిరుమలరావు, ఎస్.రమేష్, జి.కబర్ధి, సి.సత్యవాణి, కె.సునీత, టి.రాజావెంకటాద్రి, ఆర్.శరత్‌బాబు, జి.రాంగోపాల్, పి.మంగకుమారి, ఆర్వీఎస్ఎస్. మురళీకృష్ణ, ఎం.తిరుమలరావు, ఎ.సత్యానంద్, పి.భాస్కరరావు, కె.శ్రీదేవి, టి.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.మాధురి, సీహెచ్.రాజగోపాల్‌రావు, జి.రజని, కె.రాధారత్నం, ఎస్.ఎం.ఫణికుమార్, డి.శ్రీనివాసులు ఉన్నారు. శ్రీనివాసులు సీనియర్ సివిల్ జడ్జిగా ఉండగా.. జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పించింది. బదిలీ అయిన వారు మే 1వ తేదీ లోపు కొత్త పోస్టుల్లో చేరాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ) వై.లక్ష్మణరావు ఒక నోటిఫికేషన్ జారీచేశారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: రైతుభరోసా సాయం అందని రైతులు ఈ నెలాఖరులోగా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ కోరారు. ఆయన మంగళవారం మంగళగిరి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులందరిని రైతుభరోసాకు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మేలో ఈ సాయం విడుదల చేస్తుందని చెప్పారు. ప్రతి ఆర్బీకేలోను యంత్రాలు అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇప్పటివరకు 6,525 వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఈ నెల 28 నాటికి ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన గ్రామీణ నిరుద్యోగ యువతను డ్రోన్ పైలట్ శిక్షణకు ఎంపిక చేసి ఈ నెల 25 నాటికి నివేదిక పంపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రభుత్వం వందమంది రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.

చిత్తూరు జిల్లాలో చుక్కల భూముల క్రమబద్ధీకరణ

సాక్షి, అమరావతి: సుమోటో వెరిఫికేషన్ నిర్వహించిన అనంతరం చిత్తూరు జిల్లాలో చుక్కల భూముల పేరుతో ఉన్న భూములను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఇప్పటికే పలు జిల్లాల్లో చుక్కల భూములకు విముక్తి కల్పించగా తాజాగా చిత్తూరు జిల్లాకు సంబంధించి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 1908 రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం 22ఏ (1) ఇ కేటగిరీ నుంచి 2,286 ఎకరాలను 22ఏ (1) ఎ కేటగిరీకి మార్చారు. 22ఏ (1) ఇ నుంచి 22ఏ (1) బి కేటగిరీకి 1,045 ఎకరాలను మార్చారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండడంతోపాటు వెరిఫికేషన్ కోసం 1,935 ఎకరాలను ఇంకా 22ఏ (1) ఇ కేటగిరీలోనే ఉంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 72 ఎకరాలను 22ఏ (1) ఇ కేటగిరీ నుంచి పూర్తిగా తొలగించారు.

మాతా,శిశు సంరక్షణకు 'కేర్ కంపానియన్'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తల్లి, పిల్లల మెరుగైన ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా వైద్యశాఖ 'కేర్ కంపానియన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ మంగళవారం విజయవాడలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నూరా హెల్త్, యోస్ ఎయిడ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, యూనిసెఫ్ సహకారం అందిస్తున్నాయి. రాష్ట్రంలోని 260 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమం అమలు చేయడానికి ప్రణాళిక రచించారు. కేర్ కంపానియన్ ప్రణాళికలో భాగంగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల వార్డుల్లో పనిచేసే స్టాఫ్ నర్సులు, కౌన్సెలర్లు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు నైపుణ్యాల పెంపునకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రణాళిక ప్రకారం 4 జోన్లలో 13 విడతల్లో 630 మంది స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తారు.

'ఈ ఏడాది చివరికి లంబసింగి మ్యూజియం పూర్తి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో రూ.35 కోట్లతో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణాన్ని డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియంల నిర్మాణ ప్రగతిపై మంగళవారం ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి సలహాదారు అమిత్ ఖేర్ వివిధ రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఇందులో జవహర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మాచింగ్ గ్రాంటు రూ.15 కోట్ల సీఎస్ఎస్ స్కీం గ్రాంటుతో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ బిల్డింగ్ నిధులు కలిపి రూ.35 కోట్లతో లంబసింగిలో మ్యూజియం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

తెలంగాణ

యూట్యూబ్ చానల్ హ్యాక్

- ఇది యావత్ తెలుగు విద్యార్థులపై కుట్ర
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత

హైదరాబాద్: తన యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేయడం యావత్ తెలుగు విద్యార్థులపై జరిగిన కుట్ర అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత స్పష్టం చేశారు. ఆమె మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. గత ఆదివారం తన యూట్యూబ్ చానల్ హ్యాక్ అయినట్లు గుర్తించానన్నారు. తాను 2 సార్లు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యానని, కానీ విద్యార్థులు, నిరుద్యోగులకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించానని చెప్పారు. వారికి ప్రేరణ కలిగిస్తూ, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వీడియోలు చేసి అప్‌లోడ్ చేస్తున్నానని తెలిపారు. 5 లక్షల మంది వీక్షకులున్నారని తెలిపారు. హ్యాక్ చేయడమే కాకుండా అందులో గేమింగ్ వీడియోలు పెడుతున్నారని, ఏదైనా తప్పుడు సమాచారం పెడితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. BALA LATHA OFFICIAL అనే కొత్త యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలలుగా 662 స్కూళ్లు

- కేంద్ర విద్యాశాఖ ఆమోదం
- కేంద్రం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఏపీ స్కూళ్లు
- వీటిని అత్యున్నతంగా తీర్చిదిద్దేలా నిధులు
- ఐదేళ్లు అమలుకానున్న పీఎంశ్రీ ప్రాజెక్టు

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ పాఠశాలల) పథకం అమలుకు రాష్ట్రంలోని 662 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆ స్కూళ్ల జాబితాకు కేంద్ర విద్యాశాఖ మంగళవారం ఆమోదముద్ర వేసింది. సమానత (ఈక్విటీ), అందుబాటు (యాక్సెస్), నాణ్యత (క్వాలిటీ), ఇన్‌క్లూజన్‌తో సహా అన్నిస్థాయిల్లో విద్యార్థులు సంపూర్ణమైన అభివృద్ధి సాధించేందుకు ఈ స్కూళ్లు తోడ్పాటునందించనున్నాయి. ఈ పథకాన్ని కేంద్రప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్ 7న ఆమోదించింది. దేశవ్యాప్తంగా 14,500 స్కూళ్లను అభివృద్ధి చేసేందుకు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశిస్తూ వాటి ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని అన్ని రాష్ట్రాల పాఠశాలలకు అవకాశమిచ్చింది. కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ చాలెంజ్ పోర్టల్ ద్వారా స్కూళ్లు స్వయంగా వీటికి దరఖాస్తు చేసుకున్నాయి. ఈ దరఖాస్తులను మూడుదశల్లో పరిశీలించి తుది ఎంపికను ఖరారు చేశారు. నిర్దేశిత బెంచ్‌మార్క్ ఆధారంగా పాఠశాలలను కేంద్రం గుర్తించింది. కేంద్ర విద్యాశాఖ నిబంధనల ప్రకారం అర్బన్ స్కూళ్లు 70 శాతానికిపైగా, గ్రామీణ ప్రాంత స్కూళ్లు 60 శాతానికిపైగా స్కోరు సాధించగలిగితేనే పీఎంశ్రీ పథకానికి అర్హమైనవిగా గుర్తించారు. పాఠశాలలను కేంద్ర విద్యాశాఖ బృందాలు భౌతికంగా కూడా సందర్శించి నిర్దేశిత ప్రమాణాలతో ఉన్నాయో లేదో పరిశీలించిన తరువాతే ఎంపిక చేశారు. మన రాష్ట్రం నుంచి అందిన దరఖాస్తుల్లో మొత్తం 662 స్కూళ్లను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. వీటిలో 33 ప్రాథమిక పాఠశాలలుండగా 629 సెకండరీ, సీనియర్ సెకండరీ స్కూళ్లు ఉన్నాయి.

విద్యార్థులకు గుణాత్మక విద్యే లక్ష్యం

ల్యాబ్‌లు వంటి ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన పాఠశాలల్లో చేసే బోధనాభ్యసనాల ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లు అమలులో ఉండే పీఎంశ్రీ స్కూళ్ల పథకాన్ని ప్రారంభించింది. నూతన విద్యావిధానం సిద్ధాంతాలను అనుసరించి పాఠశాల విద్యను బలోపేతం చేయడం ఈ పథకం ప్రధానోద్దేశం. స్మార్ట్ క్లాస్ రూములు, లైబ్రరీలు, క్రీడా సదుపాయాలను ఈ స్కూళ్లలో ఏర్పాటుచేయనున్నారు. పాత పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, పరికరాలతో అప్‌గ్రేడ్ చేయడం ద్వారా మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నది కూడా ఈ పథకం మరో లక్ష్యం. దాదాపు 14,500 పాఠశాలలను ఈ రీతిలో అభివృద్ధి చేయనున్నారు. ఈ పాఠశాలలను దశలవారీగా స్మార్ట్ తరగతులతో తీర్చిదిద్దనున్నారు. ఈ పథకం కింద ప్రయోగశాలలు, స్మార్ట్ క్లాస్‌రూములు, గ్రంథాలయాలు, క్రీడా సదుపాయాలు, ఆర్ట్ రూములు కల్పిస్తారు. వీటిద్వారా నూతన విద్యావిధానంలో నిర్దేశించుకున్న ప్రమాణాలకు అనుగుణంగా పాఠశాల విద్యను బలోపేతం చేయనున్నారు. విద్యార్థులు గుణాత్మక విద్యతో నిర్దేశిత సామర్థ్యాలను పెంపొందించుకోగలుగుతారు. చదువులను భారంగా కాకుండా ఇష్టంగా కొనసాగిస్తారు. కేంద్రం నిధులు అందించే ఈ పాఠశాలలన్నీ నూతన విద్యావిధానాన్ని అనుసరించి కొనసాగుతాయి. మొత్తం నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఇస్తే మిగతా నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది. ఎంపికైన స్కూళ్ల జాబితాను కేంద్రం ఏర్పాటుచేసిన పోర్టల్‌లో ఉంచడం తోపాటు ఆయా రాష్ట్రాల విద్యాశాఖ కార్యాలయాలకు పంపింది.

అవినాశ్‌ను అరెస్టు చేయొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆ వివరాలు ఇవీ...

ఏది ప్రామాణికం..?

'హత్య జరిగిన రోజు నిందితుల కదలికలకు సంబంధించి భాస్కర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో ఒకలా.. ఏ-4 దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలంలో మరోలా.. సీబీఐ గూగుల్ టేకౌట్‌లో ఇంకోలా ఉంది. ఇందులో ఏది ప్రామాణికం? దేనిని పరిగణలోకి తీసుకోవాలి? కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ-4) సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడితే ఈనాడు పత్రిక ప్రచురించింది. గతంలో ఈ కేసు దర్యాప్తు చేసిన సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌ను పలుకుబడితో మార్చేశారంటూ వ్యాఖ్యలు చేశాడు. దీన్ని సీబీఐ సమర్థిస్తుందా? విచారణాధికారిని మార్చింది సుప్రీం కోర్టు. అంటే దస్తగిరి ఉద్దేశం సుప్రీంకోర్టు ద్వారా మార్పించారనా? అత్యున్నత న్యాయస్థానంపై ఇలాంటి వ్యాఖ్యలను స్వాగతిస్తామా? ఈ కేసులో ఇంప్లీడ్ అయిన సునీత న్యాయవాది దస్తగిరి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదు. అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మరో ఇద్దరు తమ వెనుక ఉన్నారని గంగిరెడ్డి పేర్కొన్నట్లు దస్తగిరి చెప్పాడు. అయితే గంగిరెడ్డి మాత్రం తాను ఎవరి పేర్లు చెప్పలేదని వాంగ్మూలంలో పేర్కొన్నాడు. కిరాయి హంతకుడు చెప్పిన ఓ మాటను పట్టుకుని అవినాశ్, భాస్కర్‌రెడ్డిని ఈ కేసులో ఇరికించేందుకు సీబీఐ శతవిధాలా ప్రయత్నిస్తోంది.

గూగుల్ కూడా సర్టిఫికెట్ ఇవ్వదు..

వైఎస్ వివేకా హత్య వెనుక ఉన్న ప్రధాన కారణాలపై సీబీఐ దర్యాప్తు సాగించడం లేదు. గంగిరెడ్డితో వివేకాకు భూమికి సంబంధించిన వివాదం ఉంది. తనకు రావాల్సిన వాటా ఇవ్వడం లేదని గంగిరెడ్డి ఆగ్రహంతో ఉండేవాడు. వివేకా రెండో భార్య, ఆమె కుమారుడి ఉదంతంలో మొదటి భార్య, కుమార్తె సునీత, అల్లుడితో తీవ్ర విభేదాలున్నాయి. సునీల్ యాదవ్(ఏ-2) తల్లిని వివేకా అసభ్యకరంగా వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలున్నాయి. వివేకాకు కొందరు రాజకీయ శత్రువులు కూడా ఉన్నారు. ఈ నాలుగు అంశాలపై సీబీఐ విచారణ జరపలేదు. సీబీఐ దర్యాప్తు అంతా అవినాశ్, భాస్కర్‌రెడ్డిని ఇరికించేందుకే సాగుతూ ఇతర కారణాల జోలికి వెళ్లడం లేదు. గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికం కాదు. ఇది సీబీఐకి కూడా తెలిసినా అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిని ఇరికించే ఉద్దేశంతో దాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారు. గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని గూగుల్ కూడా అధికారికంగా సర్టిఫికెట్ ఇవ్వదు.. ఇప్పటివరకు ఇవ్వలేదు కూడా. అలాంటిది సీబీఐ దాన్ని ఆధారంగా పేర్కొనడం తప్పుబట్టాల్సిన అంశం.



ఆధారాలు లేకుండా అరెస్టులు..

2017లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ ఓటమికి అవినాశ్, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కారణమని వివేకా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు రిమాండ్ పిటిషన్‌లో సీబీఐ పేర్కొంది. దీనికి ఎలాంటి ఆధారం, సాక్ష్యం లేదు. ఎలాంటి ఆధారం లేకుండా ఓ యువ ఎంపీని అరెస్టు చేస్తే ఆయన భవిష్యత్, పరువు ప్రతిష్టలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కడప పార్లమెంట్ స్థానం నుంచి అవినాశ్ రెండుసార్లు ఎంపీగా పోటీ చేశారు. వివేకా జీవించి ఉండగా అవినాశ్ విజయం కోసం ప్రచారం నిర్వహించారు. గెలుపు బాధ్యతంతా ఆయనే తీసుకుని పనిచేశారు. అత్యంత సన్నిహితులైన వివేకా, అవినాశ్ మధ్య సంబంధాలు ఒక్క ఎమ్మెల్సీ ఎన్నిక కారణంగా హత్యలు చేసుకునే స్థాయికి వెళ్లాయనడం సరికాదు. సీబీఐ కంటే ముందు సిట్ మెటీరియల్ అంతా సేకరించింది. దీన్ని సీబీఐకి అందజేసింది. దస్తగిరి బెయిల్ పిటిషన్ విచారణ సమయంలో గానీ, అప్రూవర్‌గా పేర్కొన్న సమయంలో గానీ ఈ మెటీరియల్‌ను మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదు. అసలు హత్యలో కీలక పాత్ర పోషించిన ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిని వదిలేశారు. ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దుకు ఎందుకు పిటిషన్ వేయలేదని న్యాయస్థానం ప్రశ్నించడంతో తర్వాత దాఖలు చేశారు. దీనిపై కూడా వాయిదాలు కోరుతూ జాప్యం చేస్తూ వస్తున్నారు. హత్య చేసిన తర్వాత తాను బీరువా పగుల కొట్టానని, గంగిరెడ్డి ఏవో డాక్యుమెంట్ల కోసం వెతికి తీసుకెళ్లాడని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. ఆ డాక్యుమెంట్లు ఏమిటి? ఎక్కడికి తీసుకెళ్లాడో దర్యాప్తు అధికారులు ఇంతవరకు తెలుసుకోలేదు. అసలు మెటీరియల్‌ను దర్యాప్తు అధికారులు ఎందుకు పరిశీలించడం లేదో తెలియదు. వివేకా మృతి విషయాన్ని ఆయన అల్లుడికి చెప్పింది ఎవరు? వారికి ఈ విషయం ఎలా తెలిసింది? దీని గురించి కూడా విచారణ చేయడం లేదు. ఆధారాలు లేకుండానే భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశారు.

విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు..

తన విచారణను వీడియో, ఆడియో రికార్డు చేస్తున్నారో లేదో చెప్పాలని అవినాశ్ పలుమార్లు సీబీఐని కోరారు. ఓ చిన్న నోట్ ఇచ్చేందుకు కూడా వారు నిరాకరించారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించి ఆ వివరాలు తెలుసుకోవాల్సి వచ్చింది. విలువైన కోర్టు సమయం వృథా అయింది. దర్యాప్తు పారదర్శకంగా లేదు. విచారణ ముగిసిందని భాస్కర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అవినాశ్‌కు ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు వారి వద్ద ఆధారాలు, సాక్ష్యాలు ఏమీ లేవు.. ఒక్క దస్తగిరి వాంగ్మూలం మినహా. సీబీఐ విచారణకు సహకరించేందుకు అవినాశ్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. ఎప్పుడు, ఎక్కడికి పిలిచినా ఆయన వస్తారు. ఇప్పటికే పలుమార్లు 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. దాదాపు 20 గంటలకుపైగా విచారించి 161 సీఆర్‌పీసీ కింద స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. అవినాశ్‌ను అరెస్టు చేయాలని సీబీఐ ఆతృతతో ఉంది. ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలి'.

ఇంకా సాక్ష్యాలు సేకరిస్తున్నాం: సీబీఐ పీపీ

'వివేకా హత్య వెనుక కుటుంబ తగాదాలు, వ్యాపార తగాదాలు లేవు. అవినాశ్‌రెడ్డి విచారణకు సహకరించడం లేదు. ఆయన సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నాలు చేశారు. ఇంకా కొందరిని విచారించాల్సి ఉంది. సమాచారం, డాక్యుమెంట్లు సేకరిస్తున్నాం. గంగిరెడ్డి తీసుకువెళ్లిన డాక్యుమెంట్లను సేకరించలేదు' అని సీబీఐ పీపీ తెలిపారు. కిక్కిరిసిన కోర్టు హాల్‌లో సుదీర్ఘ వాదనల అనంతరం అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

డిపాజిట్లలో రహస్యం ఉందా?

▶ మొదటి పేజీ తరువాయి

వాదించినప్పుడు ప్రొప్రయిటరీ అంటున్నారు. మరికొన్ని వాదనల్లో హెచ్‌యుఎఫ్ (హిందూ అవిభాజ్య కుటుంబం) అని పేర్కొంటున్నారు. ఇది సమస్యాత్మకం కదా? అని ప్రశ్నించారు. తదుపరి విచారణ జరిగేటప్పుడు దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.


హెచ్‌యూఎఫ్- ప్రొప్రయిటర్ రెండూ ఎలా కుదురుతాయి?

హెచ్‌యుఎఫ్ అంటే వ్యక్తుల సమూహం (అసోసియేషన్ ఆఫ్ ఇన్‌డివిడ్యుయల్స్) కదా? మరి ప్రొప్రయిటరీ షిప్‌ను కూడా ఇందులో ఇండివిడ్యుయల్ కెపాసిటీలో చూపుతున్నారా? ఇలా చేయటం చట్ట విరుద్ధం కదా? అని జస్టిస్ పార్థీవాలా ప్రశ్నించారు. గత విచారణలో డిపాజిటర్లందరికీ సొమ్ములు వెనక్కి ఇచ్చేశాం అన్నారు కదా? అని కూడా లూథ్రానుద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. పార్టీ ఇన్ పర్సన్ ఉండవల్లి అరుణ్ కుమార్, న్యాయవాది అల్లంకి రమేశ్‌లు జోక్యం చేసుకుంటూ... డిపాజిటర్లకు సొమ్ములు తిరిగి ఇచ్చేశాం అన్నారు కానీ, వివరాలు ఎక్కడా వెల్లడించలేదని గుర్తుచేశారు. ఇటు ప్రభుత్వానికి కానీ అటు కోర్టుకు గానీ వివరాలు చెప్పలేదన్నారు. ఆయా వివరాలు అందజేయాల్సిందిగా కోరాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఆడిటర్ స్టేట్‌మెంట్ ప్రకారం తాము వివరాలు ఇచ్చామని లూథ్రా తెలిపారు. ఈ దశలో ఉండవల్లి జోక్యం చేసుకుంటూ వారిని వివరాలు అందజేయాల్సిందిగా ధర్మాసనాన్ని కోరారు. దీంతో... వివరాలు వెల్లడించడంలో ఏమైనా సీక్రెట్ (రహస్య) దాగుందా? అని లూథ్రాను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఇందులో రహస్యం ఏమీ లేదని లూథ్రా చెప్పగా... అయితే, కోర్టులో ఫైల్ చేయాలని జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. ఈ దశలో మార్గదర్శి తరఫున మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి జోక్యం చేసుకొని హైకోర్టు ఆర్డర్ ప్రకారం ఎవరైనా వివరాలు కావాలని ముందుకొస్తే అందజేస్తామనిన్నారు. జస్టిస్ సూర్యకాంత్ కల్పించుకుని ''డిపాజిట్లు తిరిగి ఎవరెవరికి ఇచ్చారు? ఎంతెంత ఇచ్చారు? మీరు చెప్పాల్సిన అవసరం ఉంది'' అని లూథ్రా, సింఘ్వీలనుద్దేశించి అన్నారు. ''2007 మార్చి చివరి నాటికి డిపాజిట్ల రూపంలో సేకరించిన రూ.2541 కోట్లు. తిరిగి వెనక్కి ఇచ్చింది రూ.2596 కోట్లు.. తదనంతరం ఖాతాలో బ్యాలెన్స్ రూ.5.43 కోట్లు'' అని ఆడిటర్ స్టేట్‌మెంట్ ఇచ్చిన విషయాన్ని లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. తదుపరి విచారణ సమయానికి ఎవరెవరికి ఎంతెంత చెల్లించారనే వివరాలు సమగ్రంగా కోర్టుకు అందజేయాలని ధర్మాసనం పేర్కొంది.

ఇదీ.. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసు కథ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థకు జనం నుంచి డిపాజిట్లు సేకరించేందుకు అనుమతి లేదు. అయినా సరే... హిందూ అవిభాజ్య కుటుంబానికి చెందిన సంస్థగా పేర్కొంటూ జనం నుంచి డిపాజిట్లు సేకరించి వారికి బాండ్లు జారీ చేశారు. ఆ బాండ్లపై హెచ్‌యూఎఫ్ కర్తగా రామోజీరావు సంతకం చేశారు. కానీ ఆ డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాల్సి వచ్చినపుడు ఆ చెక్కులపై ప్రొప్రయిటర్ హోదాలో రామోజీరావు సంతకాలు చేశారు. ఇదంతా ఎందుకంటే 1934 నాటి రిజర్వు బ్యాంకు చట్టం సెక్షన్ 45(ఎస్) ప్రకారం... వ్యక్తులెవరూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించకుండా నిషేధించారు. దీన్ని తప్పించుకోవటానికి అక్రమంగా హెచ్‌యూఎఫ్ ముసుగులో రామోజీ డిపాజిట్లు సేకరించినట్లు అప్పట్లో నాటి పార్లమెంటు సభ్యుడు ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటానికి దిగారు. అక్రమాలన్నీ నిజమేనని తేలటంతో... రామోజీరావు డిపాజిట్లు సేకరించటం నిలిపేశారు. కేసు విచారణలో ఉండగానే... మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసేశారు. అయితే అక్రమంగా డిపాజిట్లు సేకరించటం నేరం కనక... ఆ నేరాన్ని నిర్ధారించడానికి సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

డిపాజిటర్ల వివరాలు ఎందుకు దాస్తున్నారు?: ఉండవల్లి



ఎవరికి ఫిర్యాదు చేయాలనే అంశంపై మార్గదర్శిలో తగిన యంత్రాంగం లేదని కూడా ఉండవల్లి కోర్టుకు తెలిపారు. రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై పలు కేసులు ఉన్నాయని, గూగుల్‌లో చూస్తే అన్నీ తెలుస్తాయని పేర్కొన్నారు. ''డిపాజిటర్ల వివరాలు ఎందుకు దాస్తున్నారు? బయటకు వెల్లడించొచ్చు కదా!, ఆయా వివరాలపై అఫిడవిట్ దాఖలు చేయొచ్చు కదా!'' అని ఉండవల్లి పేర్కొన్నారు. గత విచారణ సమయంలో డిపాజిటర్ల వివరాలు రిజర్వు బ్యాంకుకు (ఆర్‌బీఐ) చెప్పాలని సుప్రీంకోర్టు సూచించగా.. ఆయా వివరాలు ఆర్‌బీఐకు అందజేశామని ఇక సమస్య ఏముందని లూథ్రా చెప్పగా.... ఆర్‌బీఐ కూడా ఈ కేసులో పార్టీగా ఉందన్న విషయాన్ని ఉండవల్లి గుర్తుచేశారు. దీంతో వివరాలు వెల్లడించడానికి తమకేమీ ఇబ్బంది లేదని లూథ్రా పేర్కొన్నారు. ''రిజాయిండర్ దాఖలు చేయడానికి ఏపీ ప్రభుత్వానికి గడువు ఇస్తున్నాం'' అని జస్టిస్ సూర్యకాంత్ ఆర్డర్ చదువుతుండగా.. డిపాజిటర్ల వివరాలు వెల్లడించాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆదేశించాలని ఉండవల్లి ఇంకోసారి అభ్యర్థించారు. ''డిపాజిటర్లకు చెల్లింపు వివరాలు అందజేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను, రామోజీరావును ఆదేశిస్తున్నాం'' అని జస్టిస్ సూర్యకాంత్ ఉత్తర్వులు చదువుతూ చెప్పారు. తదుపరి విచారణ జూలైలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

29 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

అనకాపల్లి జిల్లాలోనే 17 మండలాల్లో తీవ్ర ప్రభావం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 29 మండలాల్లో మంగళవారం తీవ్రమైన వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 17 మండలాల్లో వడగాడ్పులు వీచాయని చెప్పారు. కాకినాడ జిల్లాలో 2, కృష్ణా 1, నంద్యాల 2, విశాఖ 2, విజయనగరం 2, వైఎస్సార్ జిల్లాలో 3 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచినట్లు పేర్కొన్నారు. మరో 110 మండలాల్లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. వైఎస్సార్ జిల్లా కడప పట్టణంలో 44.7, నంద్యాల జిల్లా ఆత్మకూరు, గోస్పాడులో 44.5, అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం, కర్నూలు జిల్లా మంత్రాలయం, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వాతావరణ శాఖ అంచనాల పకారం బుధవారం 98 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అంబేడ్కర్ తెలిపారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు




ప్రధాన కేంద్రాల్లో మంగళవారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
కర్నూలు	45.6	25.4
రెంటచింతల	44.2	25.5
నంద్యాల	43.5	24.0
రాజమహేంద్రవరం	43.0	24.5
శ్రీకాకుళం	42.0	25.0
మార్కాపురం	42.0	24.0
విశాఖపట్నం	41.6	25.2
కడప	41.4	22.4
ఏలూరు	41.0	27.0
విజయవాడ	41.0	26.0
తిరుపతి	41.0	23.0
అనకాపల్లి	40.8	25.0
విజయనగరం	40.0	30.0
నెల్లూరు	39.0	26.1
తెలంగాణలో..		
ఆదిలాబాద్	42.3	26.5
రామగుండం	42.0	23.6
హైదరాబాద్	39.4	22.4

వైఎస్సార్‌సీపీ ఆఫీసుకు.. రెండెకరాలిస్తే తప్పేంటి?

- 2016లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీఓ-340 ప్రకారమే కేటాయించారు
- కావాలంటే ఆ జీఓను సవాలు చేసుకోండి
- పిటిషనర్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, అమరావతి: కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యాలయ నిర్మాణం నిమిత్తం రెండెకరాల స్థలం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీఓ-360లో తప్పేముందని హైకోర్టు ప్రశ్నించింది. శాసనసభలో 50 శాతం సీట్లు సాధించిన పార్టీకి నాలుగెకరాల వరకు స్థలం కేటాయించేందుకు వీలు కల్పిస్తూ 2016లోనే జీఓ జారీ అయిందని గుర్తుచేసింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీకి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేవలం రెండెకరాలు మాత్రమేనని వ్యాఖ్యానించింది. పైపెచ్చు ఇందులో ప్రభుత్వానికి దురుద్దేశాలు ఆపాదించేందుకు కూడా వీల్లేదని.. ఎందుకంటే భూ కేటాయింపు ప్రధాన జీఓ జారీ అయినప్పుడు ఈ ప్రభుత్వం అధికారంలో లేదని తెలిపింది. ఒకవేళ అభ్యంతరం ఉంటే, 2016లో జారీ అయిన జీఓ-340ను సవాలు చేసుకోవాలని స్పష్టంచేసింది. హైకోర్టు ఘాటు వ్యాఖ్యలతో బిత్తరపోయిన పిటిషనర్ తరఫు న్యాయవాది విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేయాలని కోరారు. ఇందుకు హైకోర్టు అంగీకరించి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

మచిలీపట్నంలో పార్టీ కార్యాలయ నిర్మాణం నిమిత్తం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెండెకరాల స్థలం కేటాయిస్తూ గత ఏడాది మేలో జారీచేసిన జీఓ-360ని సవాలుచేస్తూ మచిలీపట్నానికి చెందిన వ్యాపారి బురకా శ్రీబాలాజీ కరుణశ్రీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై మంగళవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది అంచ పాండురంగారావు వాదనలు వినిపిస్తూ.. బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్ఓ) ప్రకారం రాజకీయ పార్టీలకు భూమి ఇవ్వడానికి వీల్లేదన్నారు. కేవలం పాఠశాలలు, రహదారులు, సత్రాలు, ఆసుపత్రులు తదితరాలకు మాత్రమే ఇవ్వడానికి వీలుందన్నారు.

ఏ ప్రయోజనాలు ఆశించి ఈ వ్యాజ్యం దాఖలు చేశారు?

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. అసలు పిటిషనర్ ఎవరని, ఏ ప్రయోజనాలు ఆశించి ఈ వ్యాజ్యం దాఖలు చేశారని ప్రశ్నించింది. ఈ వ్యాజ్యం దాఖలు వెనుక ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాల్లేవని, కేవలం ప్రజా ప్రయోజనాలు ఆశించే ఈ వ్యాజ్యం దాఖలు చేశామని పాండురంగారావు చెప్పారు. రాజకీయ పార్టీలకు భూ కేటాయింపులను ఏ ప్రాతిపదికన చేస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. 2016లో జీఓ-340 జారీ అయిందంటూ పాండురంగారావు దానిని చూపారు. దానిని పరిశీలించిన ధర్మాసనం, ఈ జీఓలో శాసనసభలో 50 శాతం సీట్లు సాధించిన పార్టీకి నాలుగెకరాల వరకు కేటాయించవచ్చని ఉందని.. ఇక్కడ ప్రభుత్వం కేవలం రెండెకరాలు మాత్రమే కేటాయించిందని తెలిపింది. అంతేకాక.. భూ కేటాయింపులపై ప్రభుత్వానికి దురుద్దేశాలు కూడా ఆపాదించలేరని, ఎందుకంటే జీఓ-340 ఈ ప్రభుత్వ హయాంలో జారీకాలేదని, అప్పుడు అధికారంలో వేరే పార్టీ ఉందని తెలిపింది. వైఎస్సార్‌సీపీకి చేసిన భూ కేటాయింపుపై అభ్యంతరం ఉంటే, జీఓ-340ను సవాలు చేసుకోవాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ వ్యాజ్యంపై ఏం చేయమంటారని ధర్మాసనం ప్రశ్నించగా, విచారణను వాయిదా వేయాలని పాండురంగారావు కోరగా.. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేసింది.

క్లుప్తంగా...

పోలవరంలో రూ.1,626 కోట్ల పనులకు టెండర్లు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు హెడ్‌ వర్క్స్‌లో రూ.1,626.48 కోట్ల పనులకు టెండర్లను పిలిచేందుకు జలవనరుల శాఖ సిద్ధమైంది. సంబంధిత పత్రాలను జ్యుడిషియల్‌ ప్రివ్యూకి మంగళవారం జలవనరుల శాఖ సమర్పించింది. టెండరు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగించే ప్రక్రియలో భాగంగా జ్యుడిషియల్‌ ప్రివ్యూకు పంపినట్లు పేర్కొంది. పనుల టెండర్‌ డాక్యుమెంట్‌ను 18 ఏప్రిల్‌, 2023న జ్యుడిషియల్‌ ప్రివ్యూ అధికారిక వెబ్‌ సైట్‌, జలవనరుల శాఖ వెబ్‌ సైట్‌ www.judicialpreview.ap.gov.in https://irrigationap.cgg.gov.in/ లో ఉంచింది. సలహాలు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26లోగా judge-jpp@ap.gov.inకు మెయిల్‌ చేయాలని కోరింది.

'ఆ రెండూ కరోనా మరణాలు కావు'

సాక్షి, అమరావతి: కరోనాతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు మృతి చెందారన్న ప్రచారాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌ నివాస్‌ ఖండించారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మృతుల్లో ఒకరు దీర్ఘకాలంగా కాలేయ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని, మరొకరికి వేరే అనారోగ్య సమస్యలున్నాయన్నారు. ఈ 2 మరణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించామన్నారు. ఇటీవల కాలంలో కరోనా కారణంగా ఒక్క మరణం రాష్ట్రంలో సంభవించలేదని స్పష్టం చేశారు. కరోనా నిర్ధారణ పరీక్షలు ఎక్కువగా చేస్తున్నందున కేసులు నమోదు కొంత ఎక్కువగా ఉంటోందని చెప్పారు.

అమ్మఒడి.. చాలా మంచి పథకం

టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

పాలకొల్లు సెంట్రల్‌: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం చాలా మంచిదేనని టీడీపీ పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని లయన్స్‌ కమ్యూనిటీ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్‌ ప్రైవేటు అన్‌ ఎయిడెడ్‌ స్కూల్స్‌ మేనేజ్‌మెంట్స్‌ అసోసియేషన్‌ (అపుస్మా) జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ అమ్మఒడి పథకం సొమ్మును జనవరిలో ఇవ్వడం వల్ల వాటిని ప్రజలు పండుగకు ఖర్చు చేసేస్తున్నారని చెప్పారు. దీంతో ప్రభుత్వం జూలైలో ఈ పథకాన్ని అమలు చేసేలా తీసుకున్న నిర్ణయం మంచిదేనని తెలిపారు. ఈ పథకం కింద అందిస్తున్న సొమ్మును నేరుగా విద్యార్థుల ఖాతా నుంచి పాఠశాలలకు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే అటు విద్యాసంస్థలకు కూడా కొంతవరకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

అధికారం వచ్చాక ఆరునెలలు ప్రతీకారమే

- కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారిని వదలం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మొదటి ఆరునెలలు.. తమ పార్టీ కార్యకర్తలను, నాయకులను వేధించిన వారిపై ప్రతీకారం తీర్చుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. వైఎస్సార్‌ జిల్లా కడపలో మంగళవారం జరిగిన కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాల టీడీపీ జోన్‌–5 ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎక్కడెక్కడ తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టారు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు.. ఎవరెవరు ఇబ్బంది పెట్టారో వారిపేర్లు రాసుకుని ఉండాలని సూచించారు. అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇబ్బంది పెట్టిన అధికారులను కూడా వదిలేది లేదని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను గుర్తుపెట్టుకుని ప్రాధాన్యమిస్తామని, లేకపోతే మమ్మల్ని నిలదీయండి అని పేర్కొన్నారు. తమ పార్టీని దెబ్బతీయడం సీఎం జగన్‌ తరం కాదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నైట్‌ వాచ్‌మన్లు

నియామకానికి ప్రభుత్వం గ్రీన్‌ సిగ్నల్‌.. నెలకు రూ.6 వేల గౌరవవేతనం

విధివిధానాలు ఖరారుచేసిన పాఠశాల విద్యాశాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాడు–నేడు కింద వేలాది కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం .. పాఠశాలల భద్రత, అక్కడి పరికరాలు, ఇతర సదుపాయాల పరిరక్షణ కోసం నైట్‌ వాచ్‌మన్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. వీరి నియామకానికి అనుసరించాల్సిన విధివిధానాలపై పాఠశాల విద్యాశాఖ మంగళవారం మార్గదర్శకాలను జారీచేసింది. వాచ్‌మన్లుగా నియమితులైన వారికి నెలకు రూ.6 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వనున్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం 'మనబడి నాడు–నేడు' కార్యక్రమాన్ని 2020–21 నుంచి మిషన్‌ మోడ్‌లో చేపట్టిన సంగతి తెలిసిందే. దశల వారీగా ఆయా పాఠశాలల్లో రన్నింగ్‌ వాటర్‌తో కూడిన టాయిలెట్లు, తాగునీటి సరఫరా, పెద్ద, చిన్న మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్‌ లైట్లతో విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్‌, గ్రీన్‌ చాక్‌బోర్డులు, పాఠశాల మొత్తం పెయింటింగ్‌, ఇంగ్లిష్‌ ల్యాబ్‌, ప్రహరీ, కిచెన్‌ షెడ్‌లు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేయిస్తోంది. ఫేజ్‌–1 కింద 15,715 పాఠశాలల్లో ఈ పనులు పూర్తవగా ఫేజ్‌–2 కింద 22,228 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన పాఠశాలలను ఫేజ్‌–3లో అభివృద్ధి చేస్తారు. ఇదే కాకుండా మరుగుదొడ్ల నిర్వహణ నిధిని ఏర్పాటు చేసి వాటి నిర్వహణ కోసం అన్ని పాఠశాలలకు పారిశుధ్య కార్మికులుగా ఆయాలను నియమించారు. మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు రసాయనాలు, సాధనాలను కూడా ప్రభుత్వం అందించింది. నాడు–నేడు ఫేజ్‌–2 కింద పాఠశాలల్లో ఈ మౌలిక సదుపాయాలతో పాటు ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెల్‌ (ఐఎఫ్‌పీ)లు, స్మార్ట్‌ టీవీలు ఏర్పాటుచేస్తున్నారు. నాడు–నేడు ఫేజ్‌–1 కింద పనులు పూర్తయిన స్కూళ్లలో కూడా వీటిని సమకూరుస్తున్నారు. పాఠశాలల్లో నేర్చుకున్న పాఠాలను ఇంటి వద్ద కూడా అభ్యాసం చేసేందుకు వీలుగా ఐఎఫ్‌పీలలోని కంటెంట్‌తో కూడిన ట్యాబులను రాష్ట్రంలోని అన్ని స్కూళ్ల 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. వీటికోసం ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ పరికరాలను, మౌలిక సదుపాయాల వస్తువులను రక్షించడం, భద్రంగా ఉండేలా చూడడం ఇప్పుడు ఎంతో ప్రాధాన్యంగా మారింది. వీటితోపాటు పాఠశాలల ఆవరణలోకి సంఘవిద్రోహశక్తులు ప్రవేశించకుండా నిరోధించడానికి ప్రభుత్వం నైట్‌ వాచ్‌మన్‌లను నియమించాలని ఆదేశాలిచ్చింది. మొత్తం స్కూళ్లలో ప్రస్తుతం గుర్తించిన 5,388 నాన్‌ రెసిడెన్షియల్‌ (నివాసేతర) ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క వాచ్‌మన్‌ను నియమించనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన పథకం, స్కూల్‌ శానిటేషన్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నిధిమీనా మెమో విడుదల చేశారు.

నైట్‌ వాచ్‌మన్‌ విధులు

- పాఠశాల మూసివేయడానికి ముందు సాయంత్రం పాఠశాలకు హాజరు కావాలి.
- పని దినాల్లో మరుసటిరోజు పాఠశాల తెరిచే వరకు విధుల్లో ఉండాలి. ఇతర రోజుల్లో కూడా విధుల్లో ఉండాలి. సంబంధిత ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో పనిచేయాలి.
- రాత్రి కాపలాదారు విధుల్లో ప్రధానమైనది పాఠశాల ఆస్తి అయిన భవనం/ప్రాంగణం, ఇతర వస్తువులు, పరికరాలకు రక్షకుడిగా పని చేయాలి.
- పాఠశాల ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా చూడాలి.
- ఏవైనా అసాధారణ కార్యకలాపాలు జరిగినప్పుడు, అగ్నిప్రమాదం వంటివి ఏర్పడినప్పుడు, ఏదైనా అనుమానం వచ్చినప్పుడు సంబంధిత హెడ్‌ మాస్టర్‌కు, సమీప పోలీస్‌ స్టేషన్‌కు, అగ్నిమాపక విభాగానికి నివేదించాలి.
- సాయంత్రం పాఠశాల గార్డెన్‌కు నీరు పోయాలి. ఎప్పటికప్పుడు ఆర్వో ప్లాంట్‌ను శుభ్రం చేయాలి.
- పాఠశాలకు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకురావడం, వాటిని హెచ్‌ఎంకు అందించడం చేయాలి.
- స్కూలుకు సంబంధించి హెచ్‌ఎం చెప్పే ఇతర పనులను చేయాలి.
- నైట్‌ వాచ్‌మన్‌ పనిని హెడ్‌మాస్టర్‌, పేరెంట్స్‌ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.
- 2023 మే 1వ తేదీనుంచి పాఠశాలల్లో వాచ్‌మన్లను నియమించేలా చర్యలు తీసుకోవాలి.
- నైట్‌ వాచ్‌మన్‌ రిజిస్ట్రేషన్‌ సంబంధిత హెడ్‌ మాస్టర్‌ ఐఎంఎంఎస్‌ యాప్‌ ద్వారా చేపట్టాలి.
- వాచ్‌మన్లను నియమించిన అనంతరం ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలి.

మార్గదర్శకాలు..

- పేరెంట్‌ కమిటీల ద్వారా పాఠశాలల్లో నైట్‌ వాచ్‌మన్‌ను నియమించాలి.
- ఇప్పటికే నియమితులైన ఆయా/కుక్‌ కమ్‌ హెల్పర్‌ భర్తకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.
- గ్రామం/వార్డులో మాజీ సైనికులకు రెండో ప్రాధాన్యత ఇవ్వాలి.
- వీరెవరూ అందుబాటులో లేకపోతే ఇతర వ్యక్తిని నియమించవచ్చు.
- నైట్‌ వాచ్‌మన్‌ గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక నివాసి అయి ఉండాలి.
- ఆ వార్డులో అందుబాటులో లేకుంటే, సంబంధిత పట్టణ ప్రాంతాల నివాసిని ఎంపికచేయాలి.
- వయసు 60 ఏళ్లలోపు ఉండాలి.
- ఇప్పుడు గుర్తించిన 5,388 పాఠశాలలు కాకుండా ఇతర పాఠశాలల్లో నియమించకూడదు.
- ఎంపికైన వారికి గౌరవ వేతనంగా నెలకు రూ.6 వేల చొప్పున టాయిలెట్‌ మెయింటెనెన్స్‌ ఫండ్‌ నుంచి చెల్లించాలి.

వలసలు అరికట్టేలా 'ఉపాధి' పనులు

పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌



మాట్లాడుతున్న బుడితి రాజశేఖర్‌

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ, పేదరికం తగ్గింపు, మహిళా సాధికారత అంశాల ప్రాతిపదికన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని పంచాయతీరాజ్‌ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌ సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్‌ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ కార్యాలయంలో 26 జిల్లాల డ్వామా పీడీల సమావేశం జరిగింది. ఇటీవలే ఆ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సూర్యకుమారి హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేదలకు నిరంతరం పనుల కల్పనతో పాటు ప్రత్యేకంగా చెంచులకు 150 రోజుల పాటు పని కల్పించడంపై దృష్టి పెట్టాలని రాజశేఖర్‌ చెప్పారు. కమిషనర్‌ సూర్యకుమారి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఈ పనులకు సంబంధించి ఏడు రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల సంఘంతో చేపట్టిన అమృత్‌ సరోవర్‌ విజయగాథను వివరించారు. సెర్ప్‌ సీఈవో ఏఎండీ ఇంతియాజ్‌, ఈజీఎస్‌ డైరెక్టర్‌ చిన తాతయ్య, శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి, ఇ.జి.ఎస్‌.జాయింట్‌ కమిషనర్లు ఎం.శివప్రసాద్‌, విజయ్‌ లాజరస్‌, సోషల్‌ ఆడిట్‌ డైరెక్టర్‌ జగదీశ్‌ పాల్గొన్నారు.

నేడు మూలపేట పోర్టుకు భూమి పూజ

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ నెరవేర్చారు. శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మార్చి, సమగ్ర అభివృద్ధికి బాటలు వేసే విధంగా సంతబొమ్మాళి మండలంలో రూ.4,362 కోట్ల వ్యయంతో మూలపేట పోర్టు పనులకు బుధవారం సీఎం వైఎస్‌ జగన్‌ భూమి పూజ చేయనున్నారు. 23.5 మిలియన్‌ టన్నుల వార్షిక సామర్థ్యంతో 4 బెర్తులను నిర్మించనున్నారు. జనరల్‌ కార్గోకు, బొగ్గుకు, కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగించేలా 30 నెలల్లో ఈ పోర్టును పూర్తిచేయాలని నిర్ణయించారు. విష్ణుచక్రం, మూలపేట గ్రామాలకు చెందిన 594 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాసానికి ప్రభుత్వం రూ.109 కోట్లు కేటాయించింది. అంతేగాక వీరికోసం నౌపడలో 55 ఎకరాల్లో ఆధునిక వసతులతో ఆర్‌ అండ్‌ ఆర్‌ కాలనీని సైతం నిర్మిస్తోంది. మూలపేట పోర్టు అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌, జార్ఖండ్‌, మధ్యప్రదేశ్‌, ఒడిశా రాష్ట్రాల నుంచి ఎగుమతులు, దిగుమతులకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ పోర్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 25,000 మందికి ఉపాధి లభించనుంది.

మరికొన్ని ప్రాజెక్టులకు కూడా శ్రీకారం

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం తీరంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్‌ హార్బర్‌కు, గొట్టా బ్యారేజ్‌ నుంచి హిర మండలం రిజర్వాయర్‌కు రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టుకు, రూ.852 కోట్ల వ్యయంతో మహేంద్ర తనయ ఆఫ్‌షోర్‌ రిజర్వాయర్‌ ప్రాజెక్ట్‌ పనులకు కూడా బుధవారం సీఎం వైఎస్‌ జగన్‌ శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే రామాయపట్నం పోర్టు పనులు ప్రారంభం కాగా, కాకినాడ సెజ్‌ పోర్టులో శరవేగంగా పనులు సాగుతున్నాయి. వచ్చే నెలలో మచిలీపట్నం (బందరు) పోర్టుకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. పదేళ్లలో ఒక పోర్టు కడితేనే గొప్ప అనుకునే పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన కేవలం నాలుగేళ్లలోపే నాలుగు పోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం విశేషం. సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ సెజ్‌, మూలపేట పోర్టుల నిర్మాణం చేపట్టింది. వీటి ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి, తక్కువ రవాణా ఖర్చుకే ఎగుమతులు జరగనున్నాయి.

సిక్కోలు మత్స్యకారులకు బాసటగా..

2018 నవంబర్‌ 27న పాకిస్తాన్‌ భద్రతా దళాలకు పట్టుబడి 13 నెలలు కరాచీలో జైలు జీవితం గడిపిన 20 మంది మత్స్యకారులను గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం విదేశాంగ శాఖతో పలుసార్లు మంతనాలు జరిపి 2020, జనవరి 6న వారిని విడుదల చేయించడంలో సఫలీకృతమైంది. అలాగే కరోనాతో లాక్‌డౌన్‌ విధించినప్పుడు గుజరాత్‌లో చిక్కుకున్న 3,064 మంది శ్రీకాకుళం జిల్లా మత్స్యకారులను రూ.3 కోట్ల ఖర్చుతో 46 బస్సుల ద్వారా ప్రభుత్వం స్వస్థలాలకు చేర్చింది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదనే సంకల్పంతో రాష్ట్రంలో 4 కొత్త పోర్టులు, 10 ఫిషింగ్‌ హార్బర్‌లు, 3 ఫిష్‌ ల్యాండింగ్‌ సెంటర్ల ఏర్పాటుకు వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఫిష్‌ ల్యాండింగ్‌ సెంటర్ల పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ప్రతి 50 కి.మీ.కి ఒక పోర్టు లేదా ఫిషింగ్‌ హార్బర్‌ ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఉన్న 6 పోర్టులతో పాటు త్వరలో నిర్మాణం కానున్న 4 పోర్టులతో ఆగ్నేయాసియాకు ముఖద్వారంగా ఆంధ్రప్రదేశ్‌ విలసిల్లనుంది.

మారనున్న ఉత్తరాంధ్ర ముఖచిత్రం

ఉత్తరాంధ్రలోనే కాకుండా రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. వచ్చే నెలలో భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయనున్నారు. భోగాపురం –విశాఖపట్నం మధ్య ఆరు లైన్ల రహదారి పూర్తయింది. మంచినీళ్లపేట ఫిషింగ్‌ హార్బర్‌ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అదేవిధంగా వచ్చే నెలలోనే విశాఖపట్నంలో ఇంటర్నేషనల్‌ డేటా సెంటర్‌ ఏర్పాటు కానుంది. పలాసలో కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌, కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్‌ కళాశాల, పాడేరులో వైఎస్సార్‌ గిరిజన వైద్య కళాశాల, అనకాపల్లి, విజయనగరం వైద్య కళాశాలల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పార్వతీపురం వైద్య కళాశాల పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఉద్దానం కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ఏకంగా రూ.700 కోట్లతో వంశధార నీటితో ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో ఇళ్లకు నీరందించే పనులు 95 శాతం పూర్తయ్యాయి. దీన్ని త్వరలో జాతికి అంకితం చేయనున్నారు. అలాగే దీన్ని పాతపట్నం నియోజకవర్గానికి కూడా విస్తరిస్తూ మరో రూ.265 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తారు. సాలూరులో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి జూన్‌లో ప్రభుత్వం శంకుస్థాపన చేయనుంది. శ్రీకాకుళం జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాల పరిధిలో విస్తారంగా లభిస్తున్న మత్స్య సంపద, టెక్కలి ప్రాంతంలో ప్రపంచ ఖ్యాతి గాంచిన నీలి గ్రానైట్‌కు అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్‌ సదుపాయం కల్పించనుంది. కీలక పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకులు, థర్మల్‌ కోల్‌, కోకింగ్‌ కోల్‌, ఎరువులు, ముడి జీడి గింజలు, సున్నపురాయి, వంటనూనెల దిగుమతికి మూలపేట పోర్టు కేంద్రం కానుంది. అదేవిధంగా ఉక్కు తయారీ కంపెనీలకు కావాల్సిన బొగ్గు, ముడి ఇనుము ఎగుమతి, దిగుమతులకు, మత్స్య ఎగుమతులకు, మినరల్‌ శాండ్‌, ముడి ఇనుము, జీడిపప్పు, సోయా మీల్‌, గ్రానైట్‌, ఫెర్రో ఉత్పత్తులు, జూట్‌, ఐరన్‌ అండ్‌ స్టీల్‌ ఉత్పత్తుల ఎగుమతికి ఇక్కడి నుంచి అవకాశముంటుంది. పోర్టు అనుసంధానిత లాజిస్టిక్స్‌ ఏర్పాటు ద్వారా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే సౌలభ్యం కూడా లభిస్తుంది. సుమారు రూ.35 కోట్లతో తీరప్రాంత–పోర్టు పరిసర ప్రాంతాల అభివృద్ధి, పారిశ్రామికీకరణ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన అతి పెద్ద సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ముందుకెళుతోంది.

మూలపేట పోర్టు విశేషాలు

- పోర్టు సామర్థ్యం ఏడాదికి 23.5 మిలియన్‌ టన్నులు
- బెర్తుల సంఖ్య 4
- ఎన్‌హెచ్‌ 16ను అనుసంధానం చేస్తూ 13.8 కి.మీ నాలుగు లైన్ల రహదారి
- నౌపడ జంక్షన్‌ నుంచి పోర్టు దాకా 10.6 కి.మీ రైల్వే లైన్‌ నిర్మాణం
- గొట్టా బ్యారేజ్‌ నుంచి 50 కి.మీ. పైప్‌లైన్‌తో 0.5 ఎంఎల్‌డీ నీటి సరఫరా
- పోర్టుకు అనుబంధంగా 5,000 ఎకరాల విస్తీర్ణంలో కార్గో హ్యాండ్లింగ్‌, పోర్టు ఆధారిత పరిశ్రమలు

బాబు అండ్‌ కోవి ఆర్గనైజ్డ్‌ కథనాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'సజ్జల' మండిపాటు



సాక్షి, అమరావతి: 'వైఎస్‌ వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ ఓ పక్కన జరుగుతుండగానే, మరోవైపు ఓ వర్గం మీడియాలో ప్రచురిస్తున్న కథనాలు, శీర్షికలను బట్టి ఒక విషయం స్పష్టంగా అర్థమవుతోంది. టీడీపీ పొలిటికల్‌ వ్యూహంలో భాగంగా వివేకా హత్యకేసును వాడుకోవాలని.. వచ్చే ఎన్నికలకు కూడా ఇదే అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని పావులు కదుపుతున్నట్లు కనిపిస్తోంది. ఏదో ఒకటి చేసి ఉన్నపళంగా జగన్‌ ప్రభుత్వాన్ని కూలదోయడం, అర్జెంట్‌గా చంద్రబాబును అధికార కుర్చీలో కూర్చోబెట్టాలనేది ఎల్లోమీడియా ఆరాటం'.. అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నిందితుడి మాటలు మీకు పతాక శీర్షికలా?

వివేకా హంతకుల్లో ఒకరైన దస్తగిరి నిన్న మీడియాతో మాట్లాడిన మాటల్ని ఎల్లోమీడియా పతాక శీర్షికల్లో పెట్టి ఏవిధంగా కథనాలు రాశారో చూశాం. ఒక హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న వ్యక్తి తాను ఎంత రాక్షసంగా ఈ నేరాన్ని చేశాడో కళ్లకు కట్టినట్లు చెప్పడం.. దాన్ని ఎల్లోమీడియా రాయడం ఆశ్చర్యంగా ఉంది. ఇది జర్నలిజం కిందికి వస్తుందో లేదో ఆయా పత్రికల యాజమాన్యాలే జవాబివ్వాలి. ఇదంతా బాబు పొలిటికల్‌ ఆజెండాకు సంబంధించి అటు టీడీపీ, ఇటు ఎల్లోమీడియా కలిసి మాట్లాడిస్తున్నారేమో అనిపిస్తోంది. అసలు నేరస్తుడు సవాల్‌ విసరడమేంటి? నేరానికి పాల్పడి హత్యకేసులో ఉన్న వ్యక్తి బయట ఎలా తిరుగుతున్నాడు? పైగా అతను ప్రైవేటు సెటిల్‌మెంట్లు చేసుకోవడాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? అసలు, వాచ్‌మెన్‌ రంగన్న ప్రత్యక్షసాక్షిగా ఉండి.. నలుగురు ఈ హత్యకు పాల్పడ్డారని, వాళ్ల పేర్లతో సహా చెప్పిన తర్వాత సీబీఐకి ఇక అప్రూవర్‌తో పనేంటి?

జగన్‌ను ఎదుర్కోలేకే..

చంద్రబాబుగానీ ఎల్లోమీడియాగానీ ఈ కేసుకు సంబంధించి ప్రచారం చేసుకోవడంలో ప్రజలకు సంబంధించిన అంశాలేమీ లేవు. కేవలం జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక, 2014–19 మధ్య ప్రజలకు వాళ్లేం చేశారో చెప్పుకునే ధైర్యంలేక.. జగన్‌ను దెబ్బ కొట్టాలంటే వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చాలని వీరంతా కంకణం కట్టుకున్నారు. అలాగే, వివేకా హత్యకేసుకు సంబంధించి అదే కుటుంబాన్ని టార్గెట్‌ చేసి నిందితులు ఇక్కడే ఉన్నారంటూ ఒక వ్యూహాత్మక కుట్రకు పాల్పడటం సీబీఐ విచారణ తీరుకు పరాకాష్ట. నిజానికి, సీబీఐ దర్యాప్తేమీ పెద్దగా జరపడంలేదు. దానికి కావాల్సిన మనుషులకు నోటీసులిచ్చి విచారణకు పిలవడం.. అరెస్టులంటూ హడావిడి చేయడం మాత్రమే చేస్తోంది. గతంలో సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్‌ తీరుపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించి దర్యాప్తు బృందాన్ని మార్చేసింది. మరి కొత్తగా నియామకమైన బృందం ఏ ఒక్క కొత్త ఆధారాన్నైనా గుర్తించగలిగిందా? కేవలం రాంసింగ్‌ చేయాలనుకున్న పనినే ఈ బృందం పూర్తిచేయడానికి వచ్చినట్లుంది. ఈనెల 30లోగా కేసు ఛార్జిషీట్‌ వేయమని సుప్రీంకోర్టు చెప్పింది. కాబట్టి, ఆలోగా అవినాష్‌రెడ్డిని, భాస్కర్‌రెడ్డిని అరెస్టుచేయాలనే లక్ష్యంగా సీబీఐ అడుగులు వేయడం బాధాకరం. అసలు భాస్కర్‌రెడ్డిని ఎందుకు అరెస్టుచేయాల్సి వచ్చింది? అంతకుముందు నిందితుడు కాని ఆయన కేవలం నోటీసు ఇవ్వగానే నిందితుడైనట్లు అరెస్టుచేస్తారా? అలాగే, అంతకుముందు లేని అవినాష్‌రెడ్డి ఇప్పుడు సహ నిందితుడవుతాడా? వివేకాని తప్పిస్తే తనకు ఎంపీ పదవి వస్తుందని అవినాష్‌ చేస్తాడా? సీనియర్‌ ఇన్వెస్టిగేటివ్‌ ఏజెన్సీ అయిన సీబీఐ ఇంత అడ్డగోలుగా వాదించడంలో ఏమైనా అర్థముందా? అధికారమే ఉంటే, ఈ ఎల్లోమీడియా విచారణతో పాటు శిక్షల్ని కూడా ఖరారు చేసేవేమో.

ఇవేమీ సీబీఐకి కనిపించలేదా?

మరోవైపు.. బెంగళూరు ఆస్తి సెటిల్‌మెంట్‌ జరగనప్పుడు.. మరి, హత్య జరిగాక వివేకా ఇంట్లో ఏవో డాక్యుమెంట్లు తీసుకెళ్లారని అంటున్నారు. ఆ డాక్యుమెంట్లు ఎక్కడున్నాయనేది సీబీఐ దర్యాప్తు చేసిందా?

- వివేకాకు ఉన్న మరో వైవాహిక సంబంధం నేపథ్యంలో వారి అబ్బాయికి ఏవో ఆస్తులు రాసిచ్చారని.. ఆయన చెక్‌ పవర్‌ను ఎందుకు రద్దుచేయించారు..
- ఇవన్నీ సీబీఐకి కనిపించలేదా? వీటన్నింటిపైనా ఆనాడు చంద్రబాబు ఎందుకు సిట్‌తో విచారణ చేయించలేదు?
- అలాగే, వివేకా అల్లుడు రాజశేఖర్‌రెడ్డితో పాటు ఆయన తమ్ముడు శివప్రకాశ్‌రెడ్డి ఫోన్‌చేస్తేనే కదా అవినాష్‌ సంఘటనా స్థలానికి వెళ్లాడు. మరి, ఇదే శివప్రకాశ్‌రెడ్డి అతని బంధువు ఆదినారాయణరెడ్డికి గుండెపోటు అని ఎందుకు చెప్పాడు?
- ఘటనాస్థలంలో వివేకా రాసిన లెటర్‌ సంగతి అవినాష్‌కు వారిద్దరు ఎందుకు చెప్పకుండా పీఏ కృష్ణారెడ్డి చేత మాయం చేయించారు?
- వీటన్నింటిపై సీబీఐ రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డిలను విచారించిందా?
- సీబీఐ అధికార దుర్వినియోగానికి పాల్పడి ఒక అబద్ధాల కథను అల్లిందని మేం ఆరోపిస్తున్నాం.
- ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు చీఫ్‌ జస్టిస్‌ పైన కూడా మాట్లాడుతున్నారంటే బాబు కపట రాజకీయాల్ని అందరూ గమనించాలి.
- ప్రత్యేకంగా ఈ కేసును పొలిటికల్‌ అజెండాగా పెట్టుకుని బాబు అండ్‌ కో చేసే విషప్రచారాన్ని మేం సమర్థవంతంగా తిప్పికొడతాం. కుట్రల్ని ఛేదిస్తాం.

మీకోసం వస్తే.. మాపై నిందలా?

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లడమే లక్ష్యంగా వ్యవహరిస్తూ కొన్ని పత్రికలు అడ్డగోలు రాతలు రాస్తున్నాయని టీటీడీ ఛైర్మన్‌, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. మైసూర్‌ నుంచి విజయ్‌కుమార్‌స్వామి రామోజీ బంధువు విమానంలోనే విజయవాడ వచ్చారని వెల్లడించారు. రామోజీ బంధువుకు చెందిన ప్రత్యేక విమానంలో, వారి కార్యక్రమం కోసమే విజయవాడ వచ్చారని తెలిపారు. ఆయన మీకోసం వస్తే మాపై నిందలు వేస్తారా? అని నిలదీశారు. 'విజయ్‌కుమార్‌స్వామిని ఆహ్వానించింది మీరే. మీ మార్గదర్శి కేసు నుంచి బయట పడేందుకు ఆయన్ను తెచ్చుకున్నారా?' అని వైవీ ప్రశ్నించారు. మీరు చేస్తే దైవాశీస్సులు.. మేం చేస్తే లాబీయింగా? అని నిలదీశారు. దేవుడు, స్వామీజీల విషయంలో నీచ రాజకీయాలు తగదని హితవు పలికారు. వైవీ సుబ్బారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

ఈ పిచ్చి రాతలేమిటి?

విజయకుమార్‌స్వామిని మహిమాన్వితుడిగా ప్రముఖులంతా విశ్వసిస్తారు. అందువల్లే ఆయనతో సీఎం జగన్‌కి ఆశీర్వాదం ఇప్పించా. విజయకుమార్‌ స్వామిని లాబీయిస్టుగా అభివర్ణిస్తూ ఎల్లోమీడియా దుర్మార్గమైన కథనాలను ప్రచురిస్తోంది. 'వారి కోసం స్వామి వచ్చిన విషయాన్ని దాచిపెట్టి మాపై నిందలేమిటి? ఈ ద్వంద్వ ప్రమాణాలేమిటి..? ఈ పిచ్చి రాతలేమిటి?' అని వైవీ మండిపడ్డారు.

ప్రత్యేక విమానం రామోజీ బంధువుదే..

'విజయకుమార్‌ స్వామి వచ్చిన ప్రత్యేక విమానం రామోజీరావు బంధువు (వియ్యంకుడు) నవయుగ విశ్వేశ్వరరావుదే కదా! విశ్వేశ్వరరావు కుమారుడు శశిధర్‌, విజయకుమార్‌ స్వామి అందులో ఉన్నది నిజం కాదా?. మార్గదర్శి కేసుల నుంచి బయటపడేందుకే స్వామీజీని పిలిపించారా? 2017 –18లో హైదరాబాద్‌లో రామోజీ బంధువుల గృహ ప్రవేశానికి కూడా విజయకుమార్‌స్వామి వచ్చారు. అప్పుడు కూడా నవయుగ విశ్వేశ్వరరావు, శశిధర్‌తో కలసి వచ్చారు కదా? మరి అప్పుడు ఎందుకు వచ్చారనుకోవాలి? మీరు చేసేవన్నీ దైవ కార్యాలనుకోవాలా? ఇంత నిస్సిగ్గుగా కథనాలు రాస్తారా? నాకు చాలామంది స్వామీజీలు తెలుసు. 2007 నుంచి విజయ్‌కుమార్‌ స్వామితో పరిచయం ఉంది. ఆయనంటే ప్రత్యేక గౌరవం ఉంది' అని వైవీ పేర్కొన్నారు.

వ్యక్తులే టార్గెట్‌గా వివేకా కేసు దర్యాప్తు..


'వైఎస్‌ వివేకా హత్య కేసులో పక్షపాత ధోరణితో కొందరు వ్యక్తులే టార్గెట్‌గా సీబీఐ విచారణ జరుగుతున్నట్లు కొన్ని ఆధారాలు, పరిస్థితులు కళ్ల ముందు కనిపిస్తున్నాయి. ముందు నుంచీ అవినాశ్‌రెడ్డి వాదనలను సీబీఐ పట్టించుకోకపోవడంతోపాటు ఎల్లో మీడియా కథనాల ప్రకారం సీబీఐ దర్యాప్తు సాగుతోందనే అభిప్రాయం నెలకొంది. ఇది కళ్లెదుటే కనిపిస్తున్న వాస్తవం. నిజా నిజాలు నిగ్గుతేలాలి. న్యాయవ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది' అని వైవీ తెలిపారు.



'నవయుగ' విశ్వేశ్వరరావు, శశిధర్‌తో విజయకుమార్‌ స్వామి (ఫైల్‌)

అరాచక పాలనకు అంతిమ ఘడియలు

- సామాన్యుల జీవనస్థితిగతులు దిగజారిపోయాయి
- జాబు రావాలంటే.. బాబు రావాలని యువతకు చెప్పండి
- జోన్‌–5 ప్రాంతీయ సదస్సులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, కడప: సామాన్యుల జీవన ప్రమాణాలు దిగజారిపోయాయి.. ధరల నియంత్రణ లేదు.. విచ్చలవిడిగా అవినీతి పెరిగిపోయింది.. అన్ని వర్గాలను పీడిస్తున్న అరాచకపాలనకు అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయి.. అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చెప్పారు. వైఎస్సార్‌ జిల్లా కడపలో మంగళవారం జరిగిన కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాల టీడీపీ జోన్‌–5 ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. కేసులు పెట్టి నిర్బంధిస్తే, పదిమందిని చంపితే భయపడతారని వైఎస్సార్‌సీపీ నాయకులు అనుకుంటున్నారని విమర్శించారు. ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చే పార్టీ టీడీపీ అని చెప్పారు. కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడితే ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, రౌడీయిజం చేస్తామంటే తోక కత్తిరిస్తామని హెచ్చరించారు. రాయలసీమకు నీరు వస్తోందంటే నాడు పట్టిసీమ ప్రాజెక్టు ఏర్పాటు చేయడమే కారణమన్నారు. తాము అధికారంలో కొనసాగి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి నల్లమల కొండలకు టన్నెల్‌ వేసి బనకచర్ల ద్వారా రాయలసీమ ప్రాజెక్టులతో సస్యశ్యామలం చేసేవారమని చెప్పారు. హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులకు తన హయాంలో నిధులు బాగా వెచ్చించామన్నారు. అప్పట్లో రాయలసీమను హార్టికల్చర్‌ హబ్‌గా తీర్చిదిద్దే చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

5.5 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం

యువతకు ఉద్యోగాలు రావాలని రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి 5.5 లక్షల ఉద్యోగాలిచ్చామని చెప్పారు. హంద్రీ–నీవా పూర్తిచేసి గొల్లపల్లె రిజర్వాయర్‌ ద్వారా కియా పరిశ్రమకు నీరు ఇచ్చామన్నారు. జాబు రావాలంటే.. బాబు రావాలని యువతకు చెప్పాలని సూచించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర పరిధిలో మూడు ఎమ్మెల్సీ స్థానాలను గెల్చుకున్న స్ఫూర్తితో అందరూ ఎన్నికల్లో పనిచేస్తే 'వై నాట్‌ పులివెందుల' అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజార్టీతో గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం చంద్రబాబు కడప పెద్దదర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

వెయ్యి శూన్యపు పలుకుల కన్నా శాంతిని తేగలిగే ఒక్క మాట మెరుగైనది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 19 ఏప్రిల్ 2023

సంక్షుభిత దేశంలో సంఘర్షణ

'మదగజాలు పోట్లాడుకుంటే, మామూలు గడ్డి వాటి కాళ్ళ కింద పడి నలిగిపోతుంద'ని ఆఫ్రికన్ సామెత. ఉత్తర ఆఫ్రికా దేశం సూడాన్‌లో పరిస్థితి ఇప్పుడదే. పైచేయి కోసం సైన్యానికీ, పారా మిలటరీ దళాలకూ మధ్య... ఆ రెంటికీ సారథ్యం వహిస్తున్న ఇద్దరు సైనిక జనరల్స్ మధ్య... నాలుగు రోజులుగా చెలరేగుతున్న హింసాకాండలో కనీసం 200 మంది ప్రాణాలు కోల్పోయారు. 2 వేల మంది గాయపడ్డారు. వీధుల్లో పడివున్నవారి వద్దకు వైద్యులు వెళ్ళే పరిస్థితి లేనందువల్ల అసలు లెక్క ఇంకెన్ని రెట్లు ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇళ్ళు, ఆస్పత్రులు, విద్యుత్కేంద్రాలు, విమానాశ్రయాలు – ఏవీ యుద్ధట్యాంకుల కాల్పులకు మినహాయింపు కాదు. లక్షల మంది ఇంటి గడప దాటి బయ టకు రాలేని పరిస్థితి. ఒకవైపు కరెంట్ లేక కష్టపడుతుంటే, మరోవైపు ఇళ్ళపై పడి దోచేస్తున్న దుస్థితి. అమెరికా, బ్రిటన్, చైనా, రష్యా, సౌదీ అరేబియా సహా పలు దేశాలు రంగంలోకి దిగి, 'బేషరతుగా శత్రుత్వాన్ని విడనాడాల'ని కోరాల్సి వచ్చింది. ఐరాస ప్రధాన కార్యదర్శి సైతం హింసకు స్వస్తి పలకండంటూ ఇరువర్గాల సైనికనేతలతో మాట్లాడారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సహజ వనరుల సంపన్న దేశమైతేనేం, 1956లో బ్రిటన్ నుంచి స్వాతంత్య్రం పొందినప్పటి నుంచి సూడాన్‌లో నిత్యం ఏదో ఒక కుంపటి. ప్రజాపాలన ఏర్పడేందుకు ఎప్పుడూ ఏదో ఒక అడ్డంకి. అనేకానేక ఆకస్మిక తిరుగుబాట్లు, పౌర కలహాల చరిత్ర. 1989 నాటి విద్రోహంతో దేశాధ్యక్షుడైన నియంత బషీర్ దీర్ఘకాలిక ప్రభుత్వం 2019 ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసనతో పడిపోయింది. ఆ మూడు దశాబ్దాల హింసాత్మక, నిరంకుశ, అవినీతి పాలన స్థానంలో స్వేచ్ఛాయుత, ప్రజాప్రభుత్వం వస్తుందన్న ఆశ ఫలించలేదు. రెండేళ్ళకే, మధ్యంతర పౌరప్రభుత్వం నడుస్తుండగానే ఎన్నికలు జరగాల్సినవేళ 2021లో జనరల్ బుర్హాన్ నేతృత్వంలో తిరుగుబాటు జరిగింది.

ఆనాటి నుంచి సదరు సైనిక జనరలే అసలుసిసలు పాలకుడిగా, సైన్యమే సూడాన్‌ను నడిపిస్తోంది. అలా సైన్యాధికారమే సాగేందుకు మహమ్మద్ హమ్దన్ దగలో అలియాస్ హెమెడ్టీ నేతృత్వంలోని పారా మిలటరీ బలగమైన 'సత్వర మద్దతు దళాల' (ఆర్‌ఎస్‌ఎఫ్) కూడా సూడాన్ ఆర్మీతో కలసి పనిచేస్తూ వచ్చింది. అయితే... కొంతకాలంగా సూడాన్ సైన్యానికీ, 'ఆర్‌ఎస్‌ఎఫ్'కూ మధ్య పొసగడం లేదు. రెండేళ్ళ క్రితం చేతిలో చేయి వేసుకు నిలబడి, మధ్యంతర పౌరప్రభుత్వాన్ని పడదోసి, పాలనా పగ్గాలు చేపట్టిన సైనిక జనరల్స్ బుర్హాన్‌కూ, ఆయన డిప్యూటీ దగలోకూ మధ్య ఇప్పుడు అపనమ్మకం పెరిగింది. వారి ఆధిపత్య పోరు ఫలితమే సూడాన్‌లో తాజా సంక్షోభం.

నియంత బషీర్ పదవీచ్యుతి అనంతర రాజకీయ అధికార బదలీలో భాగంగా అసలైతే ఈ 2023 చివరికి ఎన్నికలు జరపాలి. పౌర పాలనకు బాటలు వేస్తామంటూ సైనిక నేత జనరల్ బుర్హాన్ సైతం బాస చేశారు. అయితే, అధికారమంటే ఎవరికి తీపి కాదు! అందుకే, ఇటు సేనా నాయకుడు, అటు 'ఆర్‌ఎస్‌ఎఫ్' సారథి... ఎవరూ అధికారాన్ని వదులుకోదలుచుకోలేదు. పైచేయికై పరస్పరం ఢీ కొన్నారు. ఆర్‌ఎస్‌ఎఫ్ పారామిలటరీలను కూడా సూడాన్ ఆర్మీలోకి చేర్చుకొని, రెండేళ్ళలో పౌర సర్కార్ ఏర్పాటుచేయడంపై ఏకాభిప్రాయం కుదరకపోవడం హింసకు కారణం. ఆర్మీలో ఆర్‌ఎస్‌ఎఫ్‌ను చేర్చుకుంటే తన పట్టు పోతుందని దగాలో భయం. పౌర ప్రభుత్వాన్ని మరో పదేళ్ళు జాగు చేయాలని ఆయన భావన. ఇది కడుపులో పెట్టుకొని, సైన్యం అనుమతి లేకనే వివిధ ప్రాంతాల్లో ఆర్‌ఎస్‌ఎఫ్ తన వాళ్ళను మోహరించడం మొదలెట్టింది. ఇది ఏప్రిల్ 15 నుంచి హింసాత్మకమైంది.

నిజానికి, ఇవన్నీ ఉన్నట్టుండి జరిగినవి కానే కావు. సూడాన్ దేశ ఆర్థిక సంపదపై, అందులోనూ ప్రత్యేకించి బంగారు గనులపై నియంత్రణ కోసం ఆర్‌ఎస్‌ఎఫ్ కొంతకాలంగా ప్రయత్నిస్తోంది. అలా ఇరువర్గాల మధ్య పెరిగిన కుతకుతలు ఇక్కడికి దారి తీశాయి. దీర్ఘకాలం దేశాధ్యక్షుడైన నియంత బషీరే కాదు... 2000ల నాటికి జంజవీద్ అనే తీవ్రవాద సంస్థ సారథిగా మొదలై ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎఫ్ అధినేత అయిన దగాలో, ప్రస్తుత సైనిక నేత బుర్హాన్... అంతా ఒకే తాను గుడ్డలు. అందరూ మానవ హక్కులను కాలరాసినవారే. ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపినవారే. ఎవరు గద్దెపై ఉన్నా సూడాన్‌లో ఎన్నికల ప్రజాస్వామ్యం వైపు అడుగులేయడం కల్ల. వేలకొద్దీ సైన్యం చేతుల్లో ఉన్న ఇద్దరు అహంభావుల వ్యక్తిగత అధికార దాహానికి ఇన్ని లక్షల మంది ఇక్కట్ల పాలవడమే దురదృష్టం. అంతర్యుద్ధాన్ని నివారించడానికే మధ్యంతర సర్కారును కాదని సైన్యం పగ్గాలు పట్టిందని 2021లో అన్న బుర్హాన్ ఇప్పుడచ్చంగా దేశాన్ని అటువైపే నెట్టేస్తున్నారు.

సూడాన్‌లో సుస్థిరత, సురక్షణ, ప్రజాస్వామ్యం భారత్‌కూ కీలకమే. సంక్షుభిత సూడాన్‌లో దాదాపు 4 వేల మంది భారతీయులున్నారు. వారిలో 1200 మంది దశాబ్దాల క్రితమే అక్కడ స్థిరపడ్డారు. తాజా ఘర్షణల్లో కేరళకు చెందిన ఒకరు మరణించగా, కర్ణాటకలోని హక్కీ-పిక్కీ తెగకు చెందినవారు పదుల సంఖ్యలో చిక్కుకుపోయారన్న మాట ఆందోళన రేపుతోంది. ఘర్షణలు మరింత పెరిగితే సూడాన్ సహా ఆ పరిసర ప్రాంతాలన్నీ అస్థిరతలోకి జారిపోతాయి. ఆకలి కేకలు, ఆర్థిక సంక్షోభం, ఆకాశమార్గం పట్టిన ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న దేశానికి ఇరుగు పొరుగుతోనూ సంబంధాలు దెబ్బతింటాయి. దేశం ప్రజాస్వామ్య పాలన దిశగా అడుగులు వేయడానికీ ఉపకరించదు. వెరసి, సూడాన్ చరిత్రలో ప్రతి రాజకీయ పరివర్తనకూ సైన్యమే కేంద్రమవుతూ వచ్చింది గనక ఈసారి ఏ మార్పు జరుగుతుందో వేచిచూడాలి.

కృత్రిమ మేధకు పగ్గాలు వేయాలా?

విశ్లేషణ



జస్‌ప్రీత్ బింద్రా

సుమారు 19,000 మంది టెక్ దిగ్గజాలు కృత్రిమ మేధ 'జనరేటివ్ ఏఐ'పై ఆందోళన వెలిబుచ్చుతూ బహిరంగ లేఖ రాశారు. జీపీటీ4 లాంటి టెక్నాలజీలను కనీసం ఆరు నెలల పాటు నిలిపేయాలని కోరారు. మనం చాలా టెక్నాలజీల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాం. మానవ క్లోనింగ్, జన్యుమార్పిడి, అణు టెక్నాలజీలు వీటిల్లో కొన్ని మాత్రమే. కానీ ఈ నిలిపివేత వల్ల ప్రపంచం మొత్తానికి దాదాపుగా ఉచితంగా, అది కూడా పర్యావరణ కాలుష్యం లేకుండా అందివ్వగల కేంద్రక సంలీన ప్రక్రియను సాకారం చేసే జీపీటీ7, జీపీటీ8 వంటి అత్యాధునిక జనరేటివ్ ఏఐ మోడళ్లు రావడం ఆలస్యం కాదా? అత్యద్భుత మేధతో మాత్రమే పరిష్కారం కాగల పెద్ద పెద్ద సమస్యల మాటేమిటి? అందుకే దీనిమీద గట్టి చర్చ జరగాలి.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఫిలాసఫర్ నిక్ బోస్ట్రోమ్ 'సూపర్ ఇంటెలిజెన్స్' పేరుతో ఓ పుస్తకం రాశారు. అదొక బెస్ట్ సెల్లర్. అననుకూల వాతావరణంలో మనుగడ కష్టమై బెదిరిపోయిన పిచ్చుకల గుంపు కథ ఇందులో ఉంది. సమస్యలను అధిగమించేందుకు ఆ పిచ్చుకల గుంపు ఓ గుడ్లగూబను దత్తత తీసుకోవాలని నిర్ణయిస్తుంది. ఆ గుడ్లగూబ తమ గూళ్లు కట్టి పెడుతుందనీ, వేటాడేందుకు వచ్చిన జంతువులను భయపెట్టి తరిమేస్తుందనీ, ఆహారాన్ని వెతుక్కునేందుకు సాయపడుతుందనీ ఆ పిచ్చుకలు భావిస్తాయి. ఇదేదో భలే ఉందే అనుకున్న పిచ్చుకల గుంపు గుడ్లగూబ లేదా దాని గుడ్డు వెతకాలని నిర్ణయించుకుంటాయి. అయితే గుంపులో స్క్రాన్‌ఫింకెల్ అనే పిచ్చుక ఈ ఆలోచనతో అంగీకరించదు. గుంపులో గుడ్లగూబ ఉంటే సమస్యలు తప్పవనీ, అందుకే ముందు ఆ గుడ్లగూబను నియంత్రించడమెలా, మచ్చిక చేసుకోవడం ఎలా అన్నది ఆలోచించాలనీ ప్రతిపాదిస్తుంది. మిగిలిన పిచ్చుకలు ఈ అభ్యంతరాలను పట్టించుకోవు. గుడ్లగూబను వెతికి తెచ్చుకోవడమే పెద్ద విషయమనీ, మచ్చిక, నియంత్రణలను ఆ తరువాత చూసుకోవచ్చుననీ అంటాయి.

సానుకూల ఫలితాలే ఉంటాయా?

అచ్చం ఇలాంటి కథే వాస్తవంలోనూ నడుస్తోంది. కానీ ఇందులో ఇప్పటివరకూ కనీసం 19,000 స్క్రాన్‌ఫింకెల్స్ అభ్యంతరాలు వ్యక్తం చేశాయి... ఈ మధ్యకాలంలో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిన ఛాట్ జీపీటీపై! టెక్నాలజీ రంగ దిగ్గజాలు ఎలాన్ మస్క్, స్టీవ్ వోజ్నియాక్, స్టూవర్ట్ రస్సెల్ వంటి మరెందరో కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఈ జీపీటీ4పై, స్థూలంగా 'జనరేటివ్ ఏఐ'పై తమ ఆందోళన వెలిబుచ్చారు. అక్కడితో ఆగలేదు. ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'పవర్‌ఫుల్ ఏ.ఐ. సిస్టమ్స్' పేరుతో ఓ బహిరంగ లేఖ కూడా రాశారు. అన్నీ సానుకూల ఫలితాలుంటాయనీ, ఎదురయ్యే ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశముంటుందన్న నమ్మకం కుదిరిన తరువాత మాత్రమే జీపీటీ4 లాంటి టెక్నాలజీలను మరింత అభివృద్ధి చేయాలనీ వారు ఈ లేఖలో స్పష్టం చేశారు. జీపీటీ4ను అభివృద్ధి చేస్తున్న సంస్థ 'ఓపెన్ ఏఐ' స్వయంగా ''ఏదో ఒకదశలో దీనిపై స్వతంత్ర సమీక్ష ఒకటి జరపడం చాలా ముఖ్యమవుతుంది. జీపీటీ4 లాంటి వ్యవస్థలకు మరింత శిక్షణ ఇచ్చే ముందు ఇది జరగాలి. అలాగే ఇలాంటి వ్యవస్థల కోసం ఉపయోగించే గరిష్ఠ కంప్యూటింగ్ శక్తిని కూడా మదింపు చేయాలి'' అని చెప్పడాన్ని వీరు తమ లేఖలో ఉదహరించారు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందన్నది టెక్ దిగ్గజాల అంచనా. ఈ విషయమై కృత్రిమ మేధపై పని చేస్తున్న అన్ని కంపెనీలకు ఒక విజ్ఞప్తి కూడా చేశారు. జీపీటీ4 కంటే ఎక్కువ శక్తిమంతమైన అన్ని కృత్రిమ మేధ వ్యవస్థలకు శిక్షణ ఇవ్వడాన్ని కనీసం ఆరునెలలు ఆపాలనీ, అది వెంటనే జరగాలనీ కోరారు.



అలా సాధ్యం కాని పక్షంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కూడా సూచించారు. (అయితే 'ట్విట్టర్' సీఈఓ ఎలాన్ మస్క్ కూడా ఒక ఏఐ వేదిక ప్రారంభించనున్నట్టూ, దానికి ట్రూత్ జీపీటీ అని పేరు పెడుతున్నట్టూ వెల్లడించడం గమనార్హం).

బోస్ట్రోమ్ పిచ్చుకల కథకూ, దీనికీ కొంచెం తేడా ఉందంటారు 'న్యూయార్క్ టైమ్స్' కాలమిస్ట్ రాస్ డౌదాట్. పిచ్చుకలకు కనీసం గుడ్లగూబ ఎలా ఉంటుంది, ఏ రకమైన హాని చేయగలదన్న విషయమైనా తెలుసుననీ, జీపీటీ4 వంటి కృత్రిమ మేధ విషయంలో మనకు ఆమాత్రం కూడా తెలియదనీ వివరించారు. ఐఫోన్, ఫేస్‌బుక్, టిక్‌టోక్‌లు అందుబాటులోకి వచ్చినప్పుడు కూడా వాటితోనూ కొన్ని దుష్ప్రభావాలు ఉండగలవని ఎవరు ఊహించారు?

ఆచితూచి వ్యవహరించాల్సిన టెక్నాలజీలు

జీపీటీ4 లాంటి జనరేటివ్ ఏఐ టెక్నాలజీ అతితక్కువ సమయంలో అత్యద్భుతమైన ఫలితాలను ఎలా ప్రదర్శిస్తోందో టెక్ కంపెనీలకు సైతం ఇంకా తెలియకపోవడం గమనార్హం. ''కొంచెం జాగ్ర త్తగా ఉండక తప్పదు. దీని (ఏఐ) గురించి మనమూ భయపడుతున్నామని తెలిస్తే ప్రజలు కొంత సంతోషంగా ఫీల్ అవుతారు'' అంటారు 'ఓపెన్ ఏఐ' సీఈవో సామ్ ఆల్ట్‌మ్యాన్. ఇదేదో అమాయకమైన చిన్న పిచ్చుక లాంటి వ్యవహారం కాదు, ప్రమాదకరమైనది అని ఆయన స్పష్టంగా హెచ్చరించారు.

టెక్ దిగ్గజాలు రాసిన బహిరంగ లేఖలో ఒక్క విషయాన్నయితే అంగీకరించాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో మనం చాలా టెక్నాలజీల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాం. కొన్నింటి పురోగతిని నిలిపివేసే ప్రయత్నమూ చేశాం. మానవ క్లోనింగ్, జన్యుమార్పిడి టెక్నాలజీలు వీటిల్లో కొన్ని మాత్రమే. భూమండలాన్ని ధ్వంసం చేసే సామర్థ్యమున్న రసాయన, జీవాయుధాలు, అణ్వస్త్ర టెక్నాలజీలను కూడా అడ్డుకున్నాం. అణ్వస్త్ర టెక్నాలజీనే తీసుకుంటే... శక్తిమంతమైన కృత్రిమ మేధలాగే, అణువును విభజించడంలో లాభాలెన్నో, నష్టాలూ అన్నే. అనంతమైన విద్యుత్తు ఇవ్వగలగడం సానుకూల అంశమైతే, విధ్వంసం దీనికి మరోవైపున కనిపిస్తుంది. ఈ రెండో రూపాన్ని గుర్తించేందుకు హిరోషిమా, నాగసాకి వంటి భయంకరమైన అణుబాంబు దాడుల్ని చూడాల్సి వచ్చింది. ఈ ఘటన తరువాత దేశాలన్నీ ఒక్కతాటిపై వచ్చి ఇంటర్నేషనల్ అటామిక్ ఏజెన్సీ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం వంటి వాటిద్వారా అణ్వస్త్రాలపై నిషేధం, నియంత్రణలు తేగలిగాయి. తద్వారా మరిన్ని హిరోషిమా, నాగ సాకీలు జరక్కుండా ఇప్పటివరకూ నిరోధించగలిగాం.

అణు టెక్నాలజీకి సంబంధించిన ఇంకో పార్శ్వమూ ఉంది. విధ్వంసం, వినాశనాలకు బెదిరి మనం వాడకాన్ని మరీ పరిమితం చేసేశాం. ఫలితంగా వాతావరణ మార్పులకు కారణమైన శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ముప్పు తప్పించుకునేందుకు ఇంకోముప్పును కొని తెచ్చుకున్నట్టు అన్నమాట!

అత్యాధునిక మోడళ్లను ఆపడమా?

కృత్రిమ మేధ టెక్నాలజీపై ఆరు నెలల విరామం వల్ల ఏం ఫలితం ఉండగలదని చాలామంది ప్రశ్నించవచ్చు. ఒక వేళ ఆరునెలల పాటు నిలిపేసినా చైనా లాంటి దేశాలు దీన్ని అనుసరిస్తాయా? తాత్కాలిక నిలిపివేత వల్ల ప్రపంచం మొత్తానికి దాదాపుగా ఉచితంగా, అది కూడా పర్యావరణ కాలుష్యం అనేది లేకుండా అందివ్వగల కేంద్రక సంలీన ప్రక్రియను సాకారం చేసే శక్తి ఉన్న జీపీటీ7, జీపీటీ8 వంటి అత్యాధునిక జనరేటివ్ ఏఐ మోడళ్లు రావడం ఆలస్యం కాదా? వాతావరణ మార్పులు మొదలుకొని అత్యద్భుత మేధతో మాత్రమే పరిష్కారం కాగల పెద్ద పెద్ద సమస్యల మాటేమిటి? ఈ ప్రశ్నలపై చర్చోపచర్చలు దీర్ఘకాలం కొనసాగుతాయి. అందులో సందేహం లేదు. అయితే జనరేటివ్ ఏఐ విషయంలో మనం నైతిక అంశాలపై మొట్టమొదట మాట్లాడుకోవాలి. ఎప్పటికప్పుడు కొత్త కొత్త జనరేటివ్ ఏఐ మోడళ్లను విడుదల చేసినంత వేగంగా, అత్యవసరంగా ఈ అంశంపై చర్చ జరగాలన్నది నా అభిప్రాయం. సాధారణ పరిస్థితుల్లోనైతే అత్యంత శక్తిమంతమైన టెక్నాలజీ మదింపునకు అంతర్జాతీయ సంస్థలు బోలెడంత సమయం తీసుకునే అవకాశముంది. అందుకే ప్రభుత్వాలు కలుగజేసుకోవాలి. ఆరునెలల తాత్కాలిక నిషేధం గొప్ప పరిష్కారం కాకపోవచ్చు. కానీ టెక్ దిగ్గజాలు హెచ్చరిస్తున్నట్టుగా జనరేటివ్ ఏఐ అనే గుడ్లగూబను నియంత్రించడం, మచ్చిక చేసుకోవడం ఎలాగో తెలుసుకున్న తరువాతే మనుషులనే పిచ్చుకల గుంపులోకి దాన్ని తీసుకురావడం మేలు. ఈ విషయమై ప్రపంచం స్థిమితంగా ఆలోచించాల్సిన అవసరం, సమయం వచ్చేసింది!

వ్యాసకర్త రచయిత; 'ఏఐ అండ్ ఎథిక్స్' అంశంపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో స్నాతకోత్తర విద్యను అభ్యసిస్తున్నారు.
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెత్త మనుషులు



ఇండియాలో ఆఖరికి చెత్తను వేరు చేయడం కూడా ప్రతిష్ఠకు సంబంధించిన అంశం. ఇండోర్‌లో ఒక వ్యాపారి గన్ తీసి గాలిలోకి కాల్చాడు– ఎందుకంటే, ఆయన భార్య తడి చెత్త, పొడి చెత్త ఎందుకు వేరు చేయలేదని శానిటరీ వర్కర్ అడిగే 'ధైర్యం' చేసినందుకు! ఆ చెత్త కంటే ఈ కోపం పరమచెత్తగా ఉంది.

– సంగీత నంబి, రచయిత్రి

చట్టమే మొదలు



వివాహ సమానత్వం కోసం ఉన్న డిమాండ్ గురించి: ముందు సమాజం మారితే, దాన్ని చట్టం అనుసరిస్తుందని చెప్పడం పొరపాటు. చట్టమే దాన్ని గుర్తించడానికి నిరాకరిస్తుంటే, మనం ఇక సమాజం నుంచి ఏం ఆశించగలం?

– అఖిల్ సిబాల్, న్యాయవాది

కష్టపడి చూడాలి



పనికి మించింది లేదు. అందుకే ఎంజాయ్ చేయడం మానండి. 'కిసీ కా భాయీ కిసీ కీ జాన్' విడుదలకు నాల్రోజులే ఉంది. కష్టపడకపోతే ఫ్యామిలీ సినిమాను ఫ్యామిలీకి ఎట్లా చూపిస్తారు? అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ అయింది. కొనేసి క్లోజ్ చేయండి!

– సల్మాన్ ఖాన్, నటుడు

తొలి ఉత్సాహం



ముంబయిలోని ఉత్సాహం, సృజన, ఉద్వేగాలు అద్భుతం. ఇండియాలో మా మొదటి యాపిల్ స్టోర్‌ను ప్రారంభించడం ఎంతో ఉద్విగ్నంగా ఉంది.

– టిమ్ కుక్, వ్యాపారవేత్త

ఆధ్యాత్మిక బలం



రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటంలోని ఉద్దేశం ఏమిటంటే, మనిషికి సంబంధించిన భౌతిక దృష్టికోణాన్ని బలహీనపరిచి, అతడిలోని ఆధ్యాత్మికతను బలపరచడం.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లామిక్ పండితుడు

ఇన్‌బాక్స్

'పిల్లల బడి' నిర్మాత

ప్రఖ్యాత విద్యావేత్త తారాబాయి 1892 ఏప్రిల్ 19న ముంబైలో జన్మించారు. గిజుభాయ్ బధేకా సహాయంతో 'మాంటిస్సోరి' సూత్రాల ఆధారంగా 'పాటల ద్వారా బోధన'ని ఆవిష్కరించి విద్యారంగంలో తన ప్రస్థానం ప్రారంభించారు. 1923 నుండి 1932 వరకు భావ్‌నగర్‌లోని దక్షిణామూర్తి విద్యాసంస్థలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1936లో 'న్యూ చైల్డ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్'ను స్థాపించారు. థానే జిల్లా బోర్డిలో 'గ్రామ్ బాల్ శిక్షా' కేంద్రాన్ని స్థాపించారు.

ఆటపాటల ద్వారా విద్యా బోధన, వ్యవసాయంతో మేళవించిన పాఠాలు బోధించి ఆదివాసీ పిల్లలను ఆకర్షించారు. వారికి మరింత దగ్గరవ్వడం కోసం 'మెడో స్కూల్' పేరుతో అడవుల్లో పాఠశాల తెరిచారు. స్థానికంగా దొరికే ఈకలు, కంకణాలు, గుండ్లు, రాళ్లు, గింజలు, మట్టి, ఇసుక, వెదురు లాంటివి మాత్రమే ఉపయోగించి విద్యార్థులకు... రంగు, స్పర్శ, బరువు కొలత, సంఖ్యలు బోధించారు. గిరిజన పిల్లల కోసం ఆమె ప్రారంభించిన 'కురాన్ స్కూల్' ఒక ప్రత్యేకమైన ఆవిష్కరణ.

తారాబాయి 1946 – 1951 మధ్య మహారాష్ట్ర ఎమ్మెల్యేగా సేవలందించారు. విద్యారంగంలో ఆమె చేసిన కృషికి గాను ప్రభుత్వం పద్మ భూషణ్‌తో సత్కరించింది. ముంబైలో 1973లో తన 81వ యేట తారాబాయి కన్ను మూశారు.

– డా॥ ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా
(నేడు తారాబాయి మోడక్ జయంతి)

ఆ ప్రోత్సాహకాలు ఎవరిని ఉద్ధరించినట్లు?

అభిప్రాయం



డి. పాపారావు

2021 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు' (పీఎల్ఐ) పేరిట కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. 2014 సెప్టెంబర్ మాసంలో ఆడంబరంగా ఆవిష్కరించిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమంలో అంతర్భాగంగా, 2021లో ఈ పీఎల్ఐ పథకం ముందుకు వచ్చింది. ఈ పథకంతో పాటుగా... స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, గతిశక్తి కార్యక్రమం, కార్మిక చట్టాల సవరణలు, అలాగే విదేశాల నుంచి దిగుమతి అయ్యే పలు రకాల సరు కులపై సుంకాలు పెంచడం వంటివన్నీ భారత్‌లో సరుకు ఉత్పత్తికీ, పారిశ్రామిక రంగం వృద్ధి చెందడానికీ ఉపయోగపడతాయనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం. 'మేకిన్ ఇండియా,' దానికి అనుబంధంగా ముందుకు వచ్చిన పీఎల్ఐ పథకం కావచ్చు... గతిశక్తి కావచ్చు... మరే చొరవైనా కావచ్చు... దేశీయంగా ప్రజల కొనుగోలు శక్తినీ, డిమాండ్‌ను పెంచలేదు. అలా పెంచాలనే ఆలోచన కూడా ఈ ప్రభుత్వంలో కనబడదు.

పీఎల్ఐ పథకం స్వభావం, దాని ఫలితాలు వంటి అంశాలను సునిశితంగా పరిశీలిస్తే... అసలు దీనివల్ల ఏమైనా మేలు జరిగిందా? జరిగితే ఎవరికి జరిగింది అనే విషయాలు తేటతెల్లమవుతాయి. ఇప్పటివరకు 14 సరుకు ఉత్పత్తి రంగాలకు సంబంధించి ప్రోత్సాహకాలను ఈ పథకం ప్రకటించింది. ఆయా రంగాలలో మరింత ఉత్పత్తినీ, ఎగుమతులనూ, ఉపాధి కల్పననూ ప్రోత్సహించడం పథక ప్రధాన ఉద్దేశ్యం. దీనికోసం ఈ పథకం కింద ఎంపికైన కంపెనీలకు సంబంధించి ఒక నిర్దిష్ట సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. దాని అనంతర 5 ఏళ్ల కాలంలో, సంవత్సరానికి ఆ కంపెనీ సరుకుల అమ్మకాలకు సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయిస్తారు. లక్ష్యాలను చేరుకోగలిగితే... పీఎల్ఐ పథకం కింద ఆ సంస్థకు 4 నుంచి 6 శాతం మేర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. లక్ష్యాలను సాధించిన కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఇప్పటివరకు దరిదాపుగా 2 లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహకాలతో పాటుగా... భౌగోళిక రాజకీయ అంశాలు కూడా ఈ పథకం విజయవంతం కావడానికి కలిసి వస్తాయనేది మన పాలకుల అంచనా. అంటే కోవిడ్, లాక్‌డౌన్ కాలంలోనూ, ఆ తర్వాతి కాలంలోనూ ప్రపంచంలోని అతిపెద్ద సరుకు ఉత్పత్తిదారైన చైనాలో ఉత్పత్తి కుంటుపడి ప్రపంచవ్యాప్తంగా సరుకుల కొరత ఏర్పడింది. దీంతో వాటి ధరలు పెరిగాయి. అలాగే చైనా, అమెరికాల మధ్యన ఏర్పడిన ఆధిపత్య ఘర్షణల క్రమంలో... చైనాను దెబ్బ తియ్యాలంటే దాని సరుకు ఉత్పత్తి పునాదిని పెకిలించి వేయాలనేది కూడా పాశ్చాత్య దేశాల ఆలోచనగా ఉంది. ఈ రెండు అంశాల ప్రాతిపాదికగానే – 'చైనా+1' అనే విధానాన్ని ముందుకు తెచ్చారు. దీని ప్రకారం చైనాను ప్రధాన ఉత్పత్తిదారుగా 'ఉండనిస్తూనే' మెల్లమెల్లగా పరిశ్రమల స్థాపనకు ఇతర దేశాలను కూడా అదనపు కేంద్రాలుగా చేసుకోవాలన్నది ఆలోచన.

నిజానికి ట్రంప్ హయాంలోనే చైనాతో వాణిజ్య ఘర్షణకు తెర లేచింది. అప్పట్లో ఆసియా దేశాల నుంచి అమెరికాకు అయ్యే ఎగుమతుల్లో 65 శాతం వాటా చైనా కలిగి ఉంది. ట్రంప్ విధానాల వల్ల 2019 నాలు గవ త్రైమాసికం నాటికి దాని వాటా 56 శాతానికి పడిపోయింది. అంటే, 2019లో 31 బిలియన్ డాలర్ల మేరకు చైనా వ్యాపారం ఇతర



ఆసియా దేశాలకు తరలిపోయింది. ఈ మొత్తంలో సుమారు 46 శాతం వాటాను వియత్నాం సొంతం చేసుకోగా, భారత్ కేవలం 10 శాతానికే పరిమితమయింది. మన దేశంలో 2014లోనే మోదీ ప్రభుత్వం ఆర్భాటంగా 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయినా చైనా నుంచి తరలివెళ్లిన వ్యాపారంలో మన దేశానికి తగిన వాటాను ఈ పథకం సాధించి పెట్టలేకపోయింది. ఇదంతా కోవిడ్ ముందరి కథ.

అయితే కోవిడ్ అనంతరం బలంగా ముందుకు వచ్చిన 'చైనా+1' నినాద కాలంలో... డిసెంబర్ 2022 వరకూ సుమారు మూడేళ్ల 'జీరో కోవిడ్' విధానంతో చైనాలో సరుకు ఉత్పత్తి చాలా మేరకు స్తంభించిపోయింది. అయినా మన దేశం తాను అప్పటికే ముందుకు తెచ్చిన పీఎల్ఐ పథకం ద్వారా పారిశ్రామికంగా పెద్దగా పెట్టుబడులను ఆకర్షించలేకపోయింది. ఇదే విషయాన్ని ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఉన్న వి. అనంతనాగేశ్వరన్ ఇప్పటికే చెప్పారు. ఆయన ప్రకారం... ఈ పథకం కేవలం రెండు మూడు రంగాల్లో (మొత్తం 14 రంగాలకు గాను) మాత్రమే ఇప్పటివరకు విజయవంతం అయ్యింది. అయితే కొద్దిపాటి రంగాలలో పీఎల్ఐ వలన పెట్టుబడులు పెరిగి నప్పటికీ, అక్కడ ఉపాధి కల్పన మాత్రం ఆశించిన స్థాయిలో జరుగలేదు. ఇక పీఎల్ఐ విజయం సాధించిన మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో కూడా కేవలం ఇప్పటికే మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు, బ్రాండ్ ఇమేజ్ తదితర అనుకూలతలు ఉన్న కంపెనీలే లక్ష్యాలను సాధించాయి. పీఎల్ఐ పథకం క్రింద ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హత పొందిన దేశీయ కంపెనీలు నిర్దేశిత అమ్మకం, ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాయి. కాగా, విదేశీ కంపెనీలు అయిన ఆపిల్, సామ్‌సంగ్‌లు మాత్రం ఈ పథకం నిర్దేశించిన లక్ష్యా లను చేరుకోగలిగాయి. అయితే ఎంట్రీ లెవెల్ ఫోన్‌ల అమ్మకాలు తప్ప ఖరీదైన ఫోన్‌ల అమ్మకాలు పెద్దగా పెరగలేదు. ఇందుకు కారణం సామాన్య, మధ్య తరగతుల... ఆదాయం, కొనుగోలు శక్తులు పతనం కావడమే. అంటే, స్థూలంగా అనేక ఇతర కారణాలతో పాటుగా, దేశీయంగా సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పతనం కూడా పీఎల్ఐ వైఫల్యానికి ఒక కారణమన్నమాట.

ఈ మధ్య రిజర్వ్ బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ అయిన విరాల్ ఆచార్య చెప్పినట్లుగా దేశంలోని చిన్న పారిశ్రామిక సంస్థలను దెబ్బతీసి, 5 అతిపెద్ద కార్పొరేట్లు మాత్రమే భారీగా ఎదిగాయి. బహుశా ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ విధాన ఫలితం. ఇటువంటి స్థితిలో పీఎల్ఐ వంటి పథకాల రూపంలో ఎటువంటి ప్రోత్సాహకాలను ఇచ్చినా... అవన్నీ పాలకుల కరుణా కటాక్షాలు ఉన్న కొద్దిపాటి పారిశ్రామిక సంస్థలకో లేదా అంతర్జాతీయ స్థాయి విస్తృతి, సామర్థ్యం ఉన్న బడా సంస్థలకో దక్కుతాయి. పరిశ్రమలు పెట్టడానికి కావలసిన అనేక సానుకూల అంశాలు మనదేశంలో లేవు. 'ఫైనాన్సియల్ టైమ్స్' కథనం ప్రకారం... మన దేశంలో పారిశ్రామిక ఉత్పత్తికి ఒక ప్రధాన సవాలు ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాల సాధనలో ఎదురవుతున్న ఇబ్బందులు. దీనికి కారణం దేశీయ మానవ వనరుల నైపుణ్యాల స్థాయి తగిన మేర లేకపోవడం. ప్రభుత్వాలు కార్పొరేట్లకు రాయితీలు ఎన్ని ఇచ్చినా... ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రజల స్థితిగతుల్లో ఏ మార్పూ రావడంలేదు. ఉత్పత్తి పెరిగి కనీసం సరుకుల ధరలన్నా తగ్గడం లేదు. కేవలం పారిశ్రామిక సంస్థల లాభాల కిట్టీని మరింత పెంచడానికే ఈ రాయితీలు ఉపయోగపడుతున్నాయి.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు । 98661 79615

తుంగలా ఉండాలి!

మహాభారత యుద్ధానంతరం శ్రీకృష్ణుడు ప్రేరేపించగా శరతల్పగతుడైన భీష్ముని వద్దకు ధర్మరాజు వచ్చి, ధర్మాధర్మముల స్వరూపం తెలుసుకొనే ఉద్దేశంతో పలు ప్రశ్నలు వేస్తాడు. శత్రువు అధిక బలుడైనప్పుడు, అల్ప బలుడైనవాడు ఏ విధంగా తనను తాను రక్షించుకొని ఆపద నుండి బైటపడాలి? అనేది వాటిల్లో ఒక ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు ఒక కథ చెప్పాడు.

''ఒకప్పుడు సముద్రుడి మెదడులో ఒక సందేహం పొడమింది. అది తీర్చుకొనేటందుకు అన్ని నదులనూ ఈ విధంగా అడిగాడు: 'మీరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నప్పుడు వేళ్ళతో సహా పెళ్ళగింపబడిన మహా మహా వృక్షాలు మీతోపాటుగా వస్తుంటాయి. కానీ అలా ఎప్పుడు తుంగ గడ్డి మొక్కలు రావటం నేను చూడలేదు. తుంగ గడ్డి మొక్కలు సన్నగా పొడుగ్గా బల హీనంగా ఉంటాయి. అవి మీ ఒడ్డులనే పెరుగుతాయి. అవి ఎందుకు పెళ్ళగింపబడవు? అవంటే మీకు చిన్న చూపా? లేక మరే విధంగానైనా అవి మీకు ప్రీతి పాత్రమైనవా? వాటిని పెరికి వేయటానికి మీకు శక్తి చాలదా? ఎందువల్ల వాటికి చేటు వాటిల్లదు?'

జ్యోతిర్మయం

అందుకు గంగానది, అన్ని నదుల పక్షాన ఈ విధంగా అన్నది: 'పెద్ద పెద్ద వృక్షాలు అన్నీ ఒకే చోట స్థిరంగా పాతుకుపోయి ఉంటాయి. అందువల్ల అవి మాకు ఎదురొడ్డి నిల్చినప్పుడు మా ప్రవాహ వేగానికి వాటి స్థానాలను అవి విడిచిపెట్టక తప్పదు. తుంగ గడ్డి మొక్కల పరిస్థితి వేరు. మా ప్రవాహ ఉద్ధృతికి అవి తలొగ్గుతాయి. వరద ఉద్ధృతి తగ్గగానే తుంగ గడ్డి మొక్కలు మళ్ళీ పైకి లేచి యథాస్థితికి వస్తాయి. అవి సమయానుకూలంగా ప్రవర్తిస్తాయి. మొండిగా వ్యవహరించవు. అందువల్ల ఆ మొక్కలను మేము పెరికి వేయం.'

ఈ కథ సారాంశం ఏమిటంటే... తన కంటే బలవంతుడైన శత్రువును ఎదుర్కోవాలి అంటే సరైన సమయం, అవకాశం కోసం కాచుకొని ఉండాలి. శత్రువు బలం ఏ పాటిదో, తనకున్న శక్తి ఎంతటిదో అంచనా వేసుకోవాలి. తొందరపాటుతో మూర్ఖంగా శత్రువును ఎదిరించకూడదు.''

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.11.10 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** రేవతి రా.12.03 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.12.25 నుండి 1.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** రా.9.40 నుండి 11.13 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.12.

కాకినాడ సెజ్‌కు ప్రత్యేక రైల్వేలైన్


అన్నవరం రైల్వేప్లాట్‌ఫాం

దక్షిణ మధ్య రైల్వే గ్రీన్‌సిగ్నల్

అన్నవరం–కేజీపీఎల్ మధ్య నిర్మాణం

ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.300 కోట్లు

రూ.30 కోట్లతో అన్నవరం స్టేషన్ కూడా ఆధునీకరణ

నిర్మాణ వ్యయం భరించనున్న కేజీపీఎల్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దాదాపు పదేళ్లపాటు పడకేసిన కాకినాడ ఎస్‌ఈజెడ్‌లో పరిశ్రమలకు మౌలిక సదుపాయాల కల్పన పనులు ఇప్పుడు ఊపందుకున్నాయి. కాకినాడ తీరంలో తొండంగి వద్ద నిర్మాణంలో ఉన్న కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ (కేజీపీఎల్)ను మెయిన్ రైల్వేలైన్‌తో అనుసందానించే ప్రక్రియ ఎట్టకేలకు పట్టాలెక్కుతోంది. ఇందుకోసం కేజీపీఎల్ నుంచి అన్నవరం వరకు 15 కిలోమీటర్లు మేర ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ఇటీవలే దక్షిణ మధ్య రైల్వే కూడా ఇందుకు పచ్చజెండా ఊపింది. ప్రత్యేక రైల్వేలైన్‌తో పాటు దశాబ్దాల కాలంగా సత్యదేవుని భక్తుల కలగా మిగిలిన అన్నవరం రైల్వేస్టేషన్ ఆధునీకరణను కూడా చేపడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.300 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం రైల్వే పనులను కేజీపీఎల్ సొంతంగా చేపడుతోంది.

సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు


గరుడ సీతారామయ్య

నిజానికి.. చంద్రబాబు హయాంలో మౌలిక సదుపాయాల కల్పనను అటకెక్కించేశారు. కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకు అనుగుణంగా కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలిలో బహుళ జాతి కంపెనీలు, ఎగుమతి, దిగుమతి ఆధారిత పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇలా వస్తున్న పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు ఇస్తోంది. మరోవైపు.. కేజీపీఎల్‌కు ప్రత్యేక రైల్వేలైన్ కోసం 90 ఎకరాల భూసేకరణకు రైతులతో చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగా.. విజయవాడ–విశాఖపట్నం మధ్య అన్నవరం రైల్వేస్టేషన్ నుండి కేజీపీఎల్ వరకు 15 కిలోమీటర్ల మేర సరుకు రవాణా కోసం ప్రత్యేక రైల్వేట్రాక్ నిర్మించనున్నారు. ఇక ప్రాజెక్టులో భాగంగా అన్నవరం రైల్వేస్టేషన్, ప్లాట్‌ఫారమ్‌లతో పాటు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నలింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటుచేయనున్నారు. ఇందుకు దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే అన్ని రకాల అనుమతులు వచ్చాయి. వచ్చేనెలలో పనులు మొదలు కానున్నాయి. ఈ రైల్వే ప్రాజెక్టు నిర్మాణంతో కాకినాడ గేట్‌వే పోర్టుకు ప్రతిరోజు 16వేల టన్నుల సామర్థ్యం కలిగిన బొగ్గు, ఎరువులతో పాటు కంటైనర్‌లలో ఆయిల్, ఎల్ఎన్‌జీ రవాణా కానుంది. తొలిదశలో నాలుగు గూడ్స్ రైళ్లను నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ రైల్వేలైన్ కేఎస్‌ఈజెడ్‌లో ఏర్పాటవుతున్న కేజీపీఎల్, బల్క్‌డ్రగ్ పార్కు, అరబిందో పెన్సిలిన్ జీ, దివీస్ తదితర పరిశ్రమలకు ఎంతో ఉపయోగపడుతుంది. వీటిపై కేఎస్‌ఈజెడ్ ప్రాజెక్టు హెడ్ గరుడ సీతారామయ్య స్పందిస్తూ.. రైల్వేస్టేషన్, రైల్వేట్రాక్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి అనుమతులు కూడా లభించాయన్నారు.

2030 లోపు భారత్‌లో 6జీ సేవలు

- కేంద్ర సహాయ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్


కేంద్రమంత్రి దేవ్‌సిన్హ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: దేశంలో 2030 లోపు 6జీ సేవలు అమల్లోకి తీసుకొస్తామని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ తెలిపారు. మంగళవారం తిరుచానూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. బీఎస్ఎన్ఎల్ బలోపేతానికి విదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామన్నారు. కేంద్ర పథకాలకు సీఎం జగన్ తన ఫోటోలు వేసుకుని సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ ధనాన్ని దోచిపెడుతున్నారన్నారు. క్రింది స్థాయిలో ప్రభుత్వ వ్యవస్థలను అన్నింటినీ నిర్వీర్యం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

నిడదవోలులో తెగిన రైల్వే విద్యుత్ లైన్

- విజయవాడ–విశాఖపట్నం మధ్య నిలిచిన పలు రైళ్ల రాకపోకలు
- 2 గంటల తర్వాత పునరుద్ధరణ


నిడదవోలులో రైల్వేలైన్‌కు మరమతులు చేస్తున్న రైల్వే ఎలక్ట్రికల్ సిబ్బంది

నిడదవోలు రూరల్: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు రైల్వేజంక్షన్ సమీపంలో విద్యుత్ లైన్ గార్డింగ్ తెగిపోవడంతో మంగళవారం రెండు గంటలపాటు రైళ్ల రాకపోకలకు అంతరాయమేర్పడింది. వివరాల్లోకి వెళితే.. నిడదవోలు అన్నపూర్ణనగర్ 557/31 రైల్వే విద్యుత్ స్తంభం వద్ద మధ్యాహ్నం 12.06 గంటలకు ట్రాక్‌పై వెళుతున్న 33 కేవీ విద్యుత్ లైన్ గార్డింగ్ తెగి రైల్వే ఓహెచ్ ఈపై పడింది. దీంతో విద్యుత్ సరఫరా స్తంభించింది. ఫలితంగా విజయవాడ–విశాఖపట్నం మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఘటనాస్థలంలో విశాఖపట్నం వైపు వెళుతున్న గూడ్స్ రైలు వెంటనే నిలిచిపోగా మరికొన్ని రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేశారు. రాజమహేంద్రవరం రైల్వే ఎలక్ట్రికల్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. సుమారు 2 గంటల తర్వాత రైళ్లను పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పెరవలి వైపు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు కూడా పూర్తిచేశామని నిడదవోలు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరడంతో ప్రయాణికులు అవస్థ పడ్డారు.

ముసలోళ్ల కడుపులు నింపుతున్నారు


సీఎంను చూడాలని ఉందంటూ కన్నీరు పెట్టుకుంటున్న వృద్ధుడు మోపిదేవి లీలాజలం

కోనేరుసెంటర్(మచిలీపట్నం): 'జగన్ బాబు దేవుడయ్యా... ఇంట్లో పిల్లలు పట్టించుకోకపోయినా ప్రతి నెలా ఒకటో తేదీకల్లా జీతం ఇచ్చినట్లు వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపి మాలాంటి ముసలోళ్ల కడుపులు నింపుతున్నాడు. పిల్లల ఆదరణలేని అనేకమంది వృద్ధ దంపతులను సొంత కొడుకులా ఆదుకుంటున్నాడు. జబ్బు చేసినా పెద్ద వైద్యం చేయించి ఆదరణ లేని మాలాంటి ముసలోళ్లను కాపాడుతున్నాడు...' అంటూ కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామానికి చెందిన వృద్ధుడు మోపిదేవి లీలాజలం కన్నీరు పెట్టుకున్నాడు. పెదపట్నంలో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం సందర్భంగా ఈ సంఘటన చోటుచేసుకుంది. 'జగనన్నే మా భవిష్యత్'లో భాగంగా గ్రామ సర్పంచ్ గడిదేసి అనూష, వైఎస్సార్‌సీపీ నాయకుడు గడిదేసి రాజు తదితరులు పెదపట్నంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో 85 ఏళ్ల వయసు కలిగిన మోపిదేవి లీలాజలం అనే వృద్ధుని ఇంటి వద్దకు వెళ్లగా... ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత తమకు కలిగిన మేలును వివరిస్తూ ఆనందంతో కన్నీరుపెట్టారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వార్డు సచివాలయ కార్యదర్శులు

గుణదల(విజయవాడ తూర్పు): ప్రొబేషన్ అనంతరం తమను ప్రభుత్వం పర్మినెంట్ చేయడం పట్ల విజయవాడలో వార్డు సచివాలయ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ వార్డు సచివాలయం వద్ద మంగళవారం వారు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాలుగో డివిజన్ ఇన్‌చార్జ్ గల్లా పద్మావతి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో సచివాలయ వ్యవస్థ ఎంతో దోహదపడుతోందన్నారు.

40 నకిలీ వెబ్‌సైట్లపై టీటీడీ ఫిర్యాదు

తిరుమల: శ్రీవారి భక్తులను తప్పుదోవ పట్టిస్తూ మోసాలకు పాల్పడుతోన్న పలు నకిలీ వెబ్‌సైట్లపై టీటీడీ కన్నెర్రజేసింది. ఇందులో భాగంగా భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చిన 40 నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం టీటీడీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, www.Tirupatibalaji.ap.gov.in మాత్రమే టీటీడీ అధికారిక వెబ్‌సైట్ అని శ్రీవారి భక్తులకు టీటీడీ స్పష్టం చేసింది. శ్రీవారి దర్శనం, వివిధ రకాల ఆర్జిత సేవా టికెట్లు ఈ వెబ్‌సైట్‌లో మాత్రమే జారీ చేస్తామని పేర్కొంది. నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

20న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జూలై కోటా విడుదల

తిరుమల: శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జూలై కోటాను ఏప్రిల్ 20న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఏప్రిల్ 22 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటికెట్ల కోటాను ఏప్రిల్ 20న ఉదయం 11.30 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదలవుతాయి.

శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా

శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన జూలై నెల ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 20న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. జూలైకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఏప్రిల్ 21న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మే నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఏప్రిల్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న వర్చువల్ సేవల కోటా

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మే నెల కోటాను ఏప్రిల్ 24న ఉదయం 10 గంటలకు, జూన్ కోటాను ఏప్రిల్ 24న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా

మే, జూన్‌లకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమలలో మే నెల గదుల కోటాను ఏప్రిల్ 26న ఉదయం 10 గంటలకు, తిరుపతిలో మే నెల గదుల కోటాను ఏప్రిల్ 27న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటా

- మాజీ మంత్రి ఎస్.రఘువీరారెడ్డి ప్రకటన


మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర: తాను ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటానని మాజీ మంత్రి ఎస్.రఘువీరారెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఒత్తిడికి తలొగ్గి మళ్లీ రాజకీయ జీవితంలోకి వస్తున్నట్లు వెల్లడించారు. నాలుగేళ్లుగా రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకున్నానని, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంతో తన రాజకీయ జీవితాన్ని మళ్లీ ప్రారంభిస్తున్నానని చెప్పారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్ ఆవరణలో మడకశిర, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో రఘువీరా మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తల అభీష్టం మేరకు తాను మళ్లీ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటానని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని కేంద్రం అన్యాయంగా రద్దు చేయించిందని ఆరోపించారు. ఈ ఘటనతో తాను తీవ్ర కలత చెందానని, ఇది కూడా తాను మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి కారణమన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి సరిహద్దు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ డ్రైవర్లకు జాతీయ స్థాయి పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ డ్రైవర్ ఎ.ఎం.బాషా

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ డ్రైవర్లకు జాతీయ స్థాయిలో గౌరవం దక్కింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చుతున్న నలుగురు ఆర్టీసీ డ్రైవర్లకు కేంద్ర రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ 'హీరోస్ ఆన్ రోడ్' అవార్డులు అందించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రమాద రహితంగా బస్సులను నడుపుతున్న 42 మంది డ్రైవర్లను ప్రత్యేకంగా సత్కరించారు. ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు జిల్లా ఆత్మకూరు డిపోకు చెందిన ఎ.ఎం.బాషా (36 ఏళ్ల 6 నెలల సర్వీసు), సింహాచలం డిపోకు చెందిన ఎస్.ఎ.ఎన్.రాజు (33 ఏళ్ల 10 నెలల సర్వీసు) అవార్డులు అందుకున్నారు. కాగా, టీఎస్ఆర్టీసీ కుషాయిగూడ డిపోకు చెందిన కంది రంగారెడ్డి, సూర్యాపేట డిపోకు చెందిన కల్లు సోమిరెడ్డికి కేంద్ర రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు ఎస్.ఎ.ఎన్.రాజు, ఎ.ఎం.బాషాలకు 'హీరోస్ ఆన్ రోడ్' అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

గ్యాంగ్ రేప్ కేసులో యువకుడికి జీవిత ఖైదు

- మరో ఇద్దరికి 20 ఏళ్ల జైలు, జరిమానా
- విజయవాడ మహిళా సెషన్స్ ఐదో అదనపు జిల్లా కోర్టు తీర్పు
- 'దిశ' చొరవతో ఏడాదిలోనే దోషులకు శిక్ష


నిందితులను విజయవాడ మహిళా కోర్టు నుంచి జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రిలో గత ఏడాది ఏప్రిల్ 19, 20వ తేదీల్లో 22 ఏళ్ల మానసిక వికలాంగురాలిపై లైంగిక దాడి కేసులో దారా శ్రీకాంత్ (ఏ–1) అనే యువకుడికి జీవిత ఖైదు.. రూ.7 వేల జరిమానా, చెన్నా బాబూరావు (ఏ–2), జరాంగుల పవన్ కళ్యాణ్ (ఏ–3) అనే యువకులకు 20 ఏళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. 'దిశ' చొరవ కారణంగా సరిగ్గా ఏడాదిలోనే దోషులకు శిక్ష పడటం గమనార్హం. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. అప్పట్లో నిందితులు శ్రీకాంత్, బాబురావులు ఆస్పత్రిలోని పెస్ట్ కంట్రోల్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేసేవారు. మూడో నిందితుడు పవన్‌కల్యాణ్.. బాబురావుకు స్నేహితుడు. విజయవాడ వాంబే కాలనీకి చెందిన బాధిత యువతిని శ్రీకాంత్ ప్రేమించానని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన యువతి 19వ తేదీ రాత్రి శ్రీకాంత్ పని చేసే ఆస్పత్రికి వచ్చింది. ఆ రాత్రి ఆస్పత్రిలోని ఓ గదిలో ఆ యువతిపై శ్రీకాంత్ అత్యాచారానికి పాల్పడ్డాడు. 20వ తేదీ ఆ యువతిని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ విషయం గమనించిన బాబురావు, పవన్‌కల్యాణ్‌లు యువతిపై అత్యాచారం చేశారు. అయితే 19వ తేదీ రాత్రి తన కుమార్తె కనిపించడం లేదని బాధితురాలి తల్లి నున్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆస్పత్రిలోని ఓ గదిలో యువతి ఉందన్న విషయం తెలుసుకుని ఆమె తల్లి, బంధువులు 20వ తేదీ రాత్రి 8 గంటలకు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆ సమయంలో గదిలో యువతితో పాటు పవన్‌కల్యాణ్ ఉన్నాడు. వీరిని చూసి అతను అక్కడ నుంచి పారిపోవడంతో యువతిని ఇంటికి తీసుకెళ్లారు. 22వ తేదీన యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దర్యాప్తు చకచకా..

మెరుగైన దర్యాప్తు కోసం కేసును నున్న పోలీస్ స్టేషన్ నుంచి దిశ పోలీస్ స్టేషన్‌కు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బదిలీ చేశారు. ఏప్రిల్ 22వ తేదీనే కేసు నమోదు చేసి, అదే రోజు నిందితులను కోర్టులో హాజరుపర్చారు. సెప్టెంబర్‌లో కేసు ట్రయిల్ ప్రారంభమైంది. విచారణ అధికారి, దిశ ఏసీపీ వి.వి.నాయుడు, ఎస్ఐ రేవతి, కోర్టు మానిటరింగ్‌సెల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు సేకరించిన ఆధారాలు పక్కాగా ఉండటంతో త్వరగా ట్రయిల్ పూర్తయింది. ఈ కేసులో 25 మంది సాక్షులను కోర్టు విచారించింది. బాధితురాలి తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణువర్ధన్ కోర్టుకు వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతోనే కేసు త్వరగా ట్రయిల్ పూర్తి చేసుకుందని ఏపీపీ విష్ణువర్ధన్ తెలిపారు. దిశ పోలీసులు సమర్థవంతంగా తగిన సాక్ష్యాధారాలను సేకరించడంతో ఏడాదిలోనే తీర్పు వచ్చిందన్నారు. కాగా, అప్పట్లోనే బాధితురాలికి ప్రభుత్వం రూ.10 లక్షల చెక్కును అందజేయడంతో పాటు అన్ని విధాలా అండగా నిలిచింది.

రాజకీయ వ్యభిచారి చంద్రబాబు

933వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన రాజకీయ వ్యభిచారి చంద్రబాబు అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 933వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. అధికారం కోసం రాష్ట్రంలో బహుజనుల ఎదుగుదల అడ్డుకుంటూ తప్పుడు కేసులు వేసి బహుజనుల సంక్షేమాన్ని అడ్డుకుంటున్న బాబు అండ్ కోకు తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. 4 సంవత్సరాల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 35 లక్షల ఇళ్లస్థలాలు పేదలకిచ్చారన్నారు. పలు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసి కరోనా కష్టకాలంలో అండగా నిలిచారని చెప్పారు. అన్ని పార్టీల్లో ఉన్న కులవాదులంతా ఏకమై బాబుకు అండగా నిలిచి పేదలను అణగదొక్కేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్‌ను పిచ్చాస్పత్రిలో చేర్చాల్సిన రోజులు వచ్చాయన్నట్లుగా ఆయన వ్యాఖ్యలున్నాయని, నెలకోసారి ప్రజల్లోకి వచ్చి ఇష్టారీతిగా వ్యాఖ్యానాలు చేయడం ఆయనకు పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

బయోడీజిల్ ట్యాంకులో దిగి ఇద్దరు మృతి


మహేష్ (ఫైల్) శివకుమార్ (ఫైల్)

కాజులూరు: కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలోని బయోడీజిల్ ట్యాంకులో దిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం... గొల్లపాలెంలో ఓ మూతపడిన బయోడీజిల్ బంక్‌లో ట్యాంకును తీసి మూలన పడేశారు. మంగళవారం ఆర్యావటానికి చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25) ట్యాంకులోకి దిగారు. ఊపిరి ఆడక కేకలు వేశారు. స్థానికులు గమనించి అతికష్టంపై యువకులను బయటకు తీశారు. అప్పటికే ఇద్దరు యువకులు మృతి చెందారు. ట్యాంకులో మిగిలి ఉన్న డీజిల్ కోసం యువకులు దిగి ఉంటారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఉద్దేశపూర్వకంగా హత్య చేసి ట్యాంకులో పడవేశారని మృతుని బంధువులు అనుమానిస్తున్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, గొల్లపాలెం ఎస్ఐ ఎస్.తులసీరామ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

మిల్లర్ల నుంచే నాణ్యమైన బియ్యం కొనుగోలు!

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదాలు అందించడానికిగాను మిల్లర్ల నుంచి నేరుగా బియ్యం కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి అతిథి గృహంలో మంగళవారం ఆయన తెలుగు రాష్ట్రాల్లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈవో మాట్లాడుతూ..టీటీడీ అన్నప్రసాదాలకు, ఇతర అవసరాలకు 2013 నుంచి 2019 వరకు తెలుగు రాష్ట్రాల్లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి నాణ్యమైన సోనామసూరి బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2019లో టెండర్ ద్వారా బియ్యం కొనుగోలు చేయాలని టీటీడీ నిర్ణయించిందని చెప్పారు. ఇలా బియ్యం కొనుగోలు చేయడంతో వ్యాపారస్తులు, మిల్లర్ల వద్ద బియ్యాన్ని కొని టీటీడీకి సరఫరా చేస్తున్నారన్నారు. టీటీడీ నేరుగా రైస్‌మిల్లర్ల వద్దే కొనుగోలు చేస్తే మరింత నాణ్యమైన బియ్యం అందుతుందన్నారు. సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు వారం రోజుల్లో బియ్యం సరఫరా రేటు తెలియజేస్తామని చెప్పారు. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు రైతు సాధికార సంస్థ, ఏపీ మార్క్‌ఫెడ్ లతో ఒప్పందం చేసుకున్నట్లు ఈవో తెలిపారు.

బిజినెస్ నెట్‌వర్క్ క్లబ్ ఏర్పాటు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వర్తక, వ్యాపారులు 153 మందితో బిజినెస్ నెట్‌వర్క్ క్లబ్(బీఎన్‌సీ) ఏర్పాటైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని హోటల్ వివంతలో మంగళవారం నిర్వహించిన ఆవిష్కృత కార్యక్రమంలో బీఎన్‌సీ వ్యవస్థాపకుడు అమిత్ జిందాల్ మాట్లాడారు. 153 మంది సభ్యులతో వ్యాపార సంఘంగా ఏర్పాటు కావడం ప్రపంచ రికార్డు అని చెప్పారు. కోవిడ్ తర్వాత చాలా మంది వర్తక, వ్యాపారులు తమ వ్యాపారాన్ని క్రమేపీ కోల్పోతూ ఉండటం గమనించి, దానికి పరిష్కార మార్గంగా వ్యాపారులకు ఎక్కువ మంది కొనుగోలుదారులను అనుసంధానించే విధానమే బీఎన్‌సీ అన్నారు. ఏ వృత్తి, వ్యాపారంలో ఉన్న వారైనా బీఎన్‌సీలో చేరుటకు అర్హులేనని చెప్పారు. ప్రతి సభ్యుడు వెయ్యికిపైగా కొనుగోలుదారులకు తమ ఉత్పత్తిని తెలియచేసుకోవచ్చునన్నారు. త్వరలో ఇతర పట్టణాల్లో కూడా ఆవిష్కృతం కానున్నట్లు తెలిపారు. అనంతరం సభ్యులను సత్కరించారు.

స్నేహపూర్వకంగానే సమస్యల పరిష్కారం

కేఆర్ఎంబీ చైర్మన్ శివనందన్ కుమార్



సత్రశాల(రెంటచింతల)/ విజయపురిసౌత్: కృష్ణాబోర్డు పరిధిలోని జల వివాదాలు, సమస్యలను రెండు తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో స్నేహపూర్వకంగానే పరిష్కరించుకుంటాయని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ శివనందన్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం సత్రశాల వద్ద ఉన్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రధాన విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, క్రస్ట్ గేట్లు, డ్యామ్‌ను పరిశీలించి వివరాలను ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 2006లో ప్రారంభమైందని, ఇప్పటి వరకు ఇక్కడ రెండు యూనిట్ల ద్వారా మొత్తం 473.32 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టు సమీపంలోని 125 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి భూమిని కేటాయించినట్లు ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. కేఆర్ఎంబీ సభ్యుడు అజయ్‌గుప్తా, ఎస్ఈ అశోక్ కుమార్, ఈఈలు శంకర్, కదలి శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.750 కోట్ల పంటలను కాపాడగలిగాం : ఏపీ సీఈ

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడికాలువ నుంచి విడుదల చేసిన నీటి ద్వారా రూ.750 కోట్ల విలువైన పంటలను కాపాడుకోగలిగామని ప్రాజెక్టు ఏపీ సీఈ మురళీనాథ్‌రెడ్డి చెప్పారు. కేఆర్ఎంబీ చైర్మన్ శివనందన్‌కుమార్‌తో కలిసి ఆయన కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. అనంతరం మురళీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కుడి కాలువ నుంచి ఆరు టీఎంసీలు విడుదల చేయడం ద్వారా సుమారు లక్షా 5వేల ఎకరాల్లోని మిరప, వరి పంటలకు మేలు కలిగిందన్నారు. సాగర్ కెనాల్స్ ఎస్ఈ వరలక్ష్మి, ఈఈలు మురళీధర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మృత్యువు నుంచి రక్షించారు !

- రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



చీరాల టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తిని చీరాల టూ టౌన్ పోలీసులు కాపాడారు. చీరాల ఐక్యనగర్‌కు చెందిన దుడ్డు శ్యామ్యూల్ ఆర్టీసీ కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం రాత్రి తన భార్య, పిల్లలతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. మంగళవారం తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నానని అతని స్నేహితుడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో శ్యామ్యూల్ స్నేహితుడు చీరాల టూటౌన్ పోలీసులకు వరాలను తెలిపి కాపాడాలని అభ్యర్థించాడు. వెంటనే స్పందించిన సీఐ సోమశేఖర్ ఆధ్వర్యాన ఎస్ఐ సురేష్, సిబ్బంది బాజిత్, శివప్రసాద్, అహ్మద్‌బాషా, వెంకటేశ్వర్లు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైలు పట్టాల వెంబడి వెదకడం ప్రారంభించారు. కొద్దిసేపటికే శ్యామ్యూల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించి అతని వద్దకు వెళ్లారు. అయితే, అదే సమయంలో వస్తున్న రైలు కింద పడేందుకు సిద్ధంగా ఉన్న శ్యామ్యూల్‌ను పోలీసులు తమ ప్రాణాలకు తెగించి పక్కకు లాగి రక్షించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లి శ్యామ్యూల్‌తోపాటు అతని కుటుంబ సభ్యులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అత్యవసర సమయంలో స్పందించి ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన టూటౌన్ సీఐ సోమశేఖర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, చీరాల డీఎస్పీ శ్రీకాంత్ అభినందించారు.

క్లుప్తంగా...

త్వరలో 'ట్రూత్‌జీపీటీ'...
ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్ ప్రకటన



న్యూయార్క్: ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చాటింగ్ టెక్నాలజీ పెరిగిపోతుండడం పట్ల ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ''కార్లు, రాకెట్ల కంటే ఏఐ మరింత ప్రమాదకరం. దీనివల్ల మానవాళికి ముప్పు తప్పదు. మానవాళిని నిర్వీర్యం చేసే శక్తి ఏఐకి ఉంది'' అని ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దానికి ప్రత్యామ్నాయంగా 'ట్రూత్‌జీపీటీ' పేరిట సొంత చాట్‌బాట్ తెస్తామన్నారు. మానవాళిని ధ్వంసం చేసే టెక్నాలజీ వద్దని, అర్థం చేసుకొనేది కావాలని అన్నారు. కృత్రిమ మేధను నియంత్రించే వ్యవస్థ ఉండాలన్న ప్రతిపాదనను సమర్థించారు.

అమెరికాలో పోలీసుల అదుపులో 17 మంది 'వాంటెడ్' సిక్కులు



వాషింగ్టన్: అమెరికాలో 11 కాల్పుల ఘటనలకు సంబంధించి 17 మంది సిక్కులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆపరేషన్ బ్రోకెన్ స్వోర్డ్ పేరుతో 20కి పైగా ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో మెషీన్ గన్, ఏకే–47లు సహా 42 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా ఉత్తర కాలిఫోర్నియాకు చెందిన మాఫియా సభ్యులని అధికారులు చెప్పారు. వీరు పలు హత్యా ఘటనలకు సంబంధించి భారత్ పంపిన వాంటెడ్ జాబితాలో ఉన్నారన్నారు. హింసాత్మక ఘటనలు, కాల్పులతోపాటు ఐదు హత్యాయత్నం ఘటనలతోనూ వీరికి ప్రమేయం ఉందన్నారు.

డీకే శివకుమార్ ఆస్తులు రూ.1,413.78 కోట్లు


బెంగళూరు: కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు భారీగా పెరిగాయి. తనకు, కుటుంబ సభ్యులకు మొత్తం రూ.1,413.78 కోట్ల ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్నారు. ఆయన 2018 అఫిడవిట్లో ప్రకటించిన రూ.840.08 కోట్లతో పోలిస్తే ఇది 68.29 శాతం పెరుగుదల. 2018లో కనకపుర స్థానం నుంచి ఎమ్మెల్యేగా నెగ్గిన ఆయన ఈసారి కూడా అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. డీకేపై మొత్తం 19 కేసులు ఉన్నాయి.

కన్నడనాట కులాల కోలాటం

ప్రతి ఎన్నికల్లోనూ వాటిది కీలక పాత్ర

కులాల కరుణ కోసం పార్టీల యత్నాలు

మన దేశంలో ఎన్నికలంటేనే కులం చుట్టూ తిరుగుతుంటాయి. అందులోనూ కర్ణాటక రాజకీయాల్లో కులాలు, మతాల పాత్ర మరీ ఎక్కువ. లింగాయత్, వొక్కలిగ, ఓబీసీ, ముస్లిం వర్గాలు నాలుగు స్తంభాలుగా ఎన్నికల ఫలితాలను శాసిస్తూ వస్తున్నాయి. అందుకే మరోసారి వారి మనసు చూరగొనేందుకు బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్) సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి...



కర్ణాటకలో త్రిముఖ పోరు నేపథ్యంలో కులాలవారీగా ఓటర్లను ఆకర్షించడంలో బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. జేడీ(ఎస్) మాత్రం ప్రధానంగా రాష్ట్ర జనాభాల్లో లింగాయత్‌ల తర్వాత అత్యధికంగా 15% ఓటర్లున్న వొక్కలిగ ఓటు బ్యాంకునే నమ్ముకుంది. 59 అసెంబ్లీ స్థానాలున్న పాత మైసూరు ప్రాంతంలో వొక్కలిగలు ఇప్పటికీ మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడను ఎంతగానో ఆరాధిస్తారు. ఆ ఓటు బ్యాంకును చీల్చే లక్ష్యంతో ఎన్నికల ముందు నుంచే కోటా రాజకీయాలకు బీజేపీ తెర తీసింది. దాంతో దాన్ని ఎలాగైనా కాపాడుకునే పనిలో జేడీ(ఎస్) తలమునకలుగా ఉంది.

కోటాతో రాజకీయ ఆట

అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే అధికార బీజేపీ అన్ని సామాజిక వర్గాల ఓట్లూ రాబట్టేలా వ్యూహాలు పన్నడం మొదలు పెట్టింది. 2018 ఎన్నికల్లో 100కు పైగా స్థానాలు సాధించినా మెజారిటీ మాత్రం అందలేదు. పాత మైసూరులోని 59 సీట్లలో ఆరు మాత్రమే దక్కడం అందుకు ప్రధాన కారణం. దాంతో ఈసారి సరిగ్గా ఎన్నికల వేళ ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ సంచలనం నిర్ణయం తీసుకోవడమే గాక వాటిని బలమైన సామాజిక వర్గాలైన లింగాయత్, వొక్కలిగలకు చెరో 2 శాతం చొప్పున పంచింది. ఈ నిర్ణయం పాత మైసూరు ప్రాంతంలో తమ భాగ్యరేఖలను కాస్త మెరుగు పరుస్తుందని ఆశ పడుతోంది. అలాగే ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 17 శాతానికి పెంచడమే గాక అంతర్గత కోటాను అమలు చేయాలని కూడా నిర్ణయించింది. ఈ నిర్ణయాలను లింగాయత్‌లు, దళితుల్లో ఒక వర్గం ఆహ్వానించినా ముస్లింలు భగ్గుమంటున్నారు. బంజారాల్లో కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అంతర్గత రిజర్వేషన్లతో తమకు మరింత అన్యాయం జరుగుతుందన్న భయం వారిలో ఉంది. పాత మైసూరులో బీజేపీ ఏకంగా 41 మంది వొక్కలిగలకు టికెట్లిచ్చింది! వీరు వ్యవసాయం మీద ఆధారపడ్డవారే కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు బాగా జనంలోకి వెళ్లేలా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తరచూ పాత మైసూరులో పర్యటిస్తున్నారు.


ఓబీసీలు ఎటువైపో...!

వీరశైవ లింగాయత్‌లలో బీజేపీ ఓట్లలో 2 నుంచి 3% తమకు వస్తాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. హిందూత్వకు పోటీగా అహిందా (ఓబీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ) నినాదంతో ఓట్లు కొల్లగొట్టే పనిలో పడింది. ఓబీసీల్లో ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఓటుబ్యాంకుగా ఉన్న బిల్వాస్, మొగవీరాస్, విశ్వకర్మ, కొలిస్‌లు కొన్నేళ్లుగా బీజేపీ వైపు తిరిగారు. ఈసారి లింగాయత్, వొక్కలిగలు ఏ ఒక్క పార్టీకీ పూర్తిస్థాయిలో మద్దతునిచ్చే అవకాశాలు లేవన్న అభిప్రాయాల నడుమ ఈ ఓబీసీల ఓటు బ్యాంకే కీలకంగా మారింది. వారి ఓటుబ్యాంకును ఈసారి బీజేపీ నిలబెట్టుకోని పక్షంలో దానికి కాంగ్రెస్ నుంచి గట్టి ముప్పు పొంచి ఉన్నట్టే!

హిందు వర్సెస్ అహిందా

లింగాయత్, బ్రాహ్మణుల ఓట్లతో పాటుగా హిందూత్వ ఓటు బ్యాంకునే బీజేపీ బాగా నమ్ముకుంది. హిందూత్వ, దేశభక్తి, అభివృద్ధి నినాదాలతో ఓట్లు రాబట్టజూస్తోంది. బాహుబలిగా పేరొందిన లింగాయత్ నేత బి.ఎస్.యడియూరప్పనే ముందుంచి ఎన్నికల వ్యవహారాలను నడిపిస్తోంది. 51 మంది లింగాయత్‌లకు టికెట్లిచ్చింది. కానీ బలమైన లింగాయత్ నేతలైన మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సవాది పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం బీజేపీలో తాజాగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను కనీసం 25 సీట్లలో బీజేపీ అవకాశాలకు గండి కొడతానన్న శెట్టర్ హెచ్చరికలను వారు గుర్తు చేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



సూడాన్ ఘర్షణల్లో 185 మంది మృతి



ఖార్టూమ్‌లో బాంబు దాడుల భయంతో వలసపోతున్న స్థానికులు

ఖార్టూమ్: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌తోపాటు పలు నగరాలు మూడో రోజూ తుపాకీ కాల్పులు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లాయి. అధికారం కోసం ఆర్మీ, పారా మిలటరీ బలగాల మధ్య వీధి పోరాటం కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇరుపక్షాలు ట్యాంకులు, ఫిరంగులతో భారీగా కాల్పులకు దిగాయి. రాత్రి వేళల్లో యుద్ధ విమానాలు సంచరిస్తున్నాయి. ఈ ఘర్షణల్లో కనీసం 185 మంది ప్రాణాలు కోల్పోగా మరో 1,800 మంది గాయపడినట్లు ఐక్యరాజ్యసమితి రాయబారి వొల్కెర్ చెప్పారు. పోరాటం కారణంగా ఎవరూ వెళ్లలేని సెంట్రల్ ఖార్టూమ్‌లోని పలు వీధుల్లో మృతదేహాలు పడి ఉన్నాయంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోరుతో సామాన్య జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నిత్యావసరాల సరఫరా నిలిచిపోగా, పలు ఆస్పత్రులు మూతబడ్డాయి. ఐక్యరాజ్య సమితి, అగ్రరాజ్యాలు వైరి వర్గాల మధ్య సయోధ్య కుదిర్చే పనిలో ఉన్నాయి. ఖార్టూమ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన సుమారు 88 మంది విద్యార్థులు, సిబ్బంది ఘర్షణల కారణంగా క్యాంపస్‌లోని లైబ్రరీలో మూడు రోజులుగా ఉండిపోయినట్లు సమాచారం. ఆర్మీ జనరల్ అబ్దెల్ బుర్హాన్, పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్‌ఎస్‌ఎఫ్) జనరల్ మహ్మద్ హందాన్ ఆధిపత్యం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. లొంగిపోవాలంటూ వీరిద్దరూ పరస్పరం హెచ్చరికలు చేసుకోవడం గమనార్హం. బుర్హాన్‌కు ఈజిప్ట్ మద్దతిస్తుండగా, హందాన్‌కు సౌదీ అరేబియా, యూఏఈ అండగా ఉన్నాయి. జీ7 భేటీ కోసం జపాన్‌లో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ మంగళవారం బుర్హాన్, హందాన్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని బ్లింకెన్ వారిని కోరినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి వేదాంత్ పటేల్ చెప్పారు. తమ దౌత్య కార్యాలయ వాహనాలపై కాల్పులు జరిగినట్లు అనంతరం బ్లింకెన్ చెప్పారు. ఈయూ దౌత్యాధికారిపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ అరబ్ లీగ్, ఆఫ్రికన్ యూనియన్‌తో శాంతి చర్చలు జరుపుతున్నారు. మంగళవారం నుంచి 24 గంటల కాల్పుల విరమణకు ఆర్మీ, ఆర్‌ఎస్‌ఎఫ్ అంగీకరించాయి.

చిక్కుకున్న 31 మంది కర్ణాటక గిరిజనులు

సూడాన్‌లో కర్ణాటకలోని హక్కి–పక్కి గిరిజన వర్గానికి చెందిన 31 మంది చిక్కుకుపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ విషయమై విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించింది. సూడాన్‌లో భారత దౌత్యకార్యాలయంతో టచ్‌లో ఉండాలంటూ బాధితులను కోరామని వివరించింది.

'ఉన్నావ్' బాధితురాలిపై నిందితుల దాడి, ఇంటికి నిప్పు

ఉన్నావ్: యూపీలోని ఉన్నావ్ దళిత బాలిక అత్యాచార ఘటనలో నిందితులు మళ్లీ రెచ్చిపోయారు. మరికొందరితో కలిసి బాధితురాలిపై దాడికి తెగబడ్డారు. ఆమె ఉంటున్న గుడిసెకు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో బాధితురాలి ఆరు నెలల కొడుకుతో పాటు, రెండు నెలల వయసున్న సోదరి తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉన్నావ్‌కు చెందిన 11 ఏళ్ల బాలికపై గత ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె గర్భం దాల్చి, కుమారుడికి జన్మనిచ్చింది. ఈ కేసులో జైలుకు వెళ్లిన నిందితులు ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసును వెనక్కి తీసుకునేందుకు బాధితురాలు నిరాకరించిందనే కోపంతోనే దారుణానికి ఒడిగట్టినట్లు భావిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన శిశువుల పరిస్థితి విషమంగా మారడంతో కాన్పూర్ తరలించినట్లు పోలీసులు చెప్పారు. తమ కుమార్తెను అంతం చేసేందుకే నిందితులు ఇంటికి నిప్పుపెట్టారంటూ బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఉండగా, ఈ కేసులో నిందితులతో రాజీకి నిరాకరిస్తున్నాడనే కారణంతో గత నెలలో బాధితురాలి తాత, మామ కలిసి జరిపిన దాడిలో బాధితురాలి తండ్రి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్నాడు.

చైనాలో అగ్నిప్రమాదాలకు 32 మంది బలి

బీజింగ్: చైనా రాజధాని బీజింగ్‌లోని ఓ ఆస్పత్రిలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 21 మంది చనిపోయారు. ఈ ఘటనలో 71 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టామన్నారు.

మరో ఘటనలో 11 మంది...

ఝెజియాంగ్ ప్రావిన్స్ జిన్‌హువా నగరంలోని ఓ తలుపుల తయారీ ఫ్యాక్టరీలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 11 మంది చనిపోయారు. కలప, రసాయనాల కారణంగానే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

సంక్లిష్టమైన అంశమిది

స్వలింగ వివాహాలపై సుప్రీం ధర్మాసనం

- కోర్టులు, చట్టసభలు చట్టబద్ధత కల్పించలేవు
- సమాజం నుంచే ఆమోదం రావాలి: కేంద్రం
- విచారణపై అభ్యంతరం, తోసిపుచ్చిన సీజేఐ



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత అత్యంత సంక్లిష్టమైన అంశమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. వాటికి కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం విచారణ మొదలు పెట్టింది. ''ఈ విషయంలో వ్యక్తిగత వివాహ చట్టాల్లోకి పోదల్చుకోలేదు. కులమతాలతో సంబంధం లేకుండా భిన్న మతాలు, కులాలకు చెందిన వారు పెళ్లి చేసుకునేందుకు చట్టపరమైన వెసులుబాటు కల్పిస్తున్న ప్రత్యేక వివాహ చట్టంపై మాత్రమే విచారణ జరుపుతాం. దానిమీదే వాదనలు విన్పించండి'' అని న్యాయవాదులకు సూచించింది. దీనిపై సుప్రీంకోర్టు విచారణను వ్యతిరేకిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది.

మెహతా వర్సెస్ సీజేఐ

స్వలింగ సంపర్కులకు ఇప్పటికే భాగస్వాముల ఎంపిక, గోప్యత వంటి పలు చట్టపరమైన హక్కులున్నాయని కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గుర్తు చేశారు. ''వివాహ హక్కు ద్వారా వారికి సామాజిక, చట్టపరమైన హోదాను కోర్టు ద్వారా, చట్టసభల ద్వారా కల్పించలేం. సమాజం నుంచే అందుకు ఆమోదం రావాల్సి ఉంటుంది'' అన్నారు. పార్లమెంటు పరిధిలోని ఈ అంశాన్ని విచారణకు స్వీకరించడంపై తమ అభ్యంతరాలను ముందుగా పరిగణనలోకి తీసుకోవాలని పట్టుబట్టగా సీజేఐ నిరాకరించారు. ''ఇక్కడ మేమే ఇన్‌చార్జులం. విచారణ ప్రక్రియ ఎలా ఉండాలో మీరు నిర్దేశించలేరు. ఇలాంటి వాటిని నా కోర్టులో ఎన్నడూ అనుమతించలేదు'' అంటూ కుండబద్దలు కొట్టారు. ముందుగా పిటిషనర్ల వాదన వింటామని స్పష్టం చేశారు. వ్యక్తిగత వివాహ చట్టాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా కూడా తమను ఒత్తిడి చేయలేరన్నారు. అలాగైతే అసలు ఈ అంశంపై విచారణే జరగరాదన్నది కేంద్రం అభిప్రాయమని మెహతా మరోసారి వాదించారు. ''అందుకే మధ్యేమార్గంగా పోతున్నాం. ఒక నిర్దిష్టమైన అంశంపై నిర్ణయం తీసుకునేందుకు మొత్తం ప్రక్రియపై తీర్పు చెప్పాల్సిన పని లేదు'' అని సీజేఐ బదులిచ్చారు. ప్రత్యేక వివాహ చట్టంలో కూడా స్త్రీ, పురుష పదాలున్నాయని మెహతా గుర్తు చేయగా, ఆ భావనే చాలా సంక్లిష్టమైనదని సీజేఐ అభిప్రాయపడ్డారు. అది కేవలం జననాంగాల ఆధారంగా నిర్ధారించేది కాదన్నారు. అది జననాంగాలకే పరిమితమన్న మెహతా వాదనను కొట్టిపారేశారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే ఎన్నో చట్టాలు నిరర్థకంగా మారతాయని మెహతా అన్నారు. అందుకే దీనిపై సమగ్రంగా విచారణ జరపడమా, లేక పూర్తిగా పార్లమెంటుకే వదిలేయడమా అన్నది ధర్మాసనం ముందుగా నిర్ణయించాలని సూచించారు. రాష్ట్రాలకు కూడా దీనిపై వాదన విన్పించే అవకాశమివ్వాలన్నారు. సీనియర్ న్యాయవాదులు రాకేశ్ ద్వివేది, కపిల్ సిబల్ తదితరులు కూడా దీన్ని సమర్థించారు. ''నేను స్వలింగ వివాహాలను సమర్థిస్తా. కానీ ఈ విషయంలో విచారణ చేపట్టబోతున్న పద్ధతిని సమర్థించను. విదేశాల్లో ఈ విషయంలో అవసరమైన అన్ని చట్టాలనూ సంస్కరించారు'' అని సిబల్ అన్నారు. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి పార్లమెంటే సరైన వేదిక అని ధర్మాసనం కూడా అభిప్రాయపడింది. ''ఈ విషయంలో మా పరిమితులేమిటో తెలుసు. అందుకే చట్టాలను వ్యాఖ్యానించే అధికారాన్ని మాత్రమే వినియోగించదలచాం. స్వలింగ సంపర్కం నేరం కాదన్న సుప్రీంకోర్టు తీర్పు, స్వలింగ బంధాలకు సమాజంలో పలు స్థాయిల్లో లభిస్తున్న ఆమోదం వంటివి ఈ విషయంలో మారుతున్న ధోరణికి ప్రతీకలే'' అని పేర్కొంది. వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

బానో దుస్థితి మనకే ఎదురైతే...?

కేంద్రానికి, గుజరాత్ సర్కారుకు సుప్రీం ప్రశ్న

- దోషులకు ఏ ప్రాతిపదికన శిక్ష తగ్గించారు?
- ఏళ్లకేళ్లు పెరోల్ ఎందుకివ్వాల్సి వచ్చింది?
- గుజరాత్ సర్కారుకు తలంటిన ధర్మాసనం
- బుర్ర ఉపయోగించరా అంటూ తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం శిక్ష తగ్గించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ''ఆ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? శిక్ష తగ్గించే ముందు నేర తీవ్రత దృష్ట్యా కాస్త బుర్ర ఉపయోగించి ఉండాల్సింది'' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నేర తీవ్రతను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదంటూ నిలదీసింది. ''ఓ గర్భిణిపై అతి హేయంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె కుటుంబీకులెందరినో దారుణంగా హత్య చేశారు. ఈ రోజు బానో బాధితురాలు. రేపు ఇంకెవరైనా కావచ్చు. మీరు, నేను కూడా కావచ్చు!'' అని కేంద్రాన్ని, గుజరాత్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో దోషుల విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను న్యాయమూర్తులు జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్న ధర్మాసనం మంగళవారం విచారించింది. దోషులకు ఇష్టమొచ్చినట్టు పెరోల్ మంజూరు చేశారంటూ విస్మయం వ్యక్తం చేసింది. ''ఒకరికి ఏకంగా 1,000 రోజుల పెరోల్ ఇచ్చారు. అంటే మూడేళ్లు. మరొకరికి 1,200 రోజులు, ఇంకొకరికి 1,500 రోజులిచ్చారు! అసలు మీరు ఏ విధానాన్ని అనుసరిస్తున్నారు?'' అంటూ గుజరాత్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ''ఇది కేవలం ఓ సాధారణ హత్య కేసు కాదు. హత్యలు, పైపెచ్చు సామూహిక అత్యాచారానికి సంబంధించిన కేసు. ఓ జనహననాన్ని మామూలు హత్యలా చూడలేం'' అంటూ తలంటింది. ఇలాంటి కేసులో దోషులను విడుదల చేయడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశమిస్తున్నదీ చూసుకోవాల్సిన అవసరం చాలా ఉందని పేర్కొంది. శిక్ష తగ్గింపుకు కారణాలు చూపకపోతే తమ అవగాహన ప్రకారం ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాము ఆదేశించినా శిక్ష తగ్గింపు తాలూకు రికార్డులను సమర్పించకపోవడంపై ఆగ్రహం వెలిబుచ్చింది. దీన్ని ధిక్కార నేరంగా పరిగణించాల్సి ఉంటుందని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును హెచ్చరించింది. దోషి ఒక మంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అనే కారణంతో శిక్ష తగ్గిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 2006లో సుప్రీంకోర్టు కొట్టేసిందని జస్టిస్ జోసెఫ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''అందుకే శిక్ష తగ్గింపుకు కారణాలేమిటో తెలుసుకోదలచాం. ఇది నేర తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు వాడాల్సిన సున్నితమైన అధికారం. ఈ విషయంలో సుప్రీంకోర్టు పొందుపరిచిన మార్గదర్శకాలను పాటించి తీరాల్సిందే'' అని ఆయన స్పష్టం చేశారు. ప్రతివాదులంతా మే 1లోగా ప్రతిస్పందనలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను మే 2కు వాయిదా వేసింది.

జీవితాంతం ఎన్సీపీలోనే: అజిత్



ముంబై: ఎన్సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ తాను బీజేపీలో చేరుతున్నానన్న వార్తలను కొట్టిపారేశారు. 'ఎన్సీపీలో ఎలాంటి అలజడులూ లేవు. 53 మంది పార్టీ ఎమ్మెల్యేల్లో 40 మందితో బీజేపీకి దగ్గరవుతున్నానన్న వార్తలు అవి అబద్ధాలు. జీవితాంతం ఎన్సీపీలోనే ఉంటా'' అని మంగళవారం చెప్పారు. శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్ ఎన్సీపీ అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్నారంటూ దుయ్యబట్టారు. బీజేపీతో అజిత్ దోస్తీ ఉత్తమాటలని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ అన్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందగా ఇద్దరు పట్టుబడ్డారు. నైమేడ్ పోలీస్‌స్టేషన్ పరిధి కల్లవాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ భైరంగఢ్ ఏరియా కమిటీ బాధ్యులు మోహన్ కడ్తి, సుమిత్ర కడ్తి తదితరులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. హోరాహోరీ ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టును గుర్తించాల్సి ఉంది.

రష్యాపై మరిన్ని కఠిన ఆంక్షలు

యుద్ధ నేరాలకు శిక్ష తప్పదు • జీ7 దేశాల హెచ్చరికలు

టోక్యో: తైవాన్‌పై చైనా దుందుడుకు చర్యలు, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలపై జీ7 దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ''తీరు మార్చుకుని అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడాలి. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవు''అని ఆ దేశాలను హెచ్చరించాయి. జీ7 దేశాలైన జపాన్, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, ఇటలీ విదేశాంగ మంత్రులు, అత్యున్నత ప్రతినిధుల మూడు రోజుల సదస్సు జపాన్‌లోని కరూయిజవాలో మంగళవారం ముగిసింది. చైనా, రష్యా, ఉత్తర కొరియాల కట్టడికి కలిసికట్టుగా కృషి చేయాలని నిర్ణయించారు. అనంతరం మంత్రులు ఉమ్మడి ప్రకటన జారీ చేశారు. రష్యాను దారికి తీసుకురావడమే లక్ష్యంగా మరిన్ని కఠిన ఆంక్షలు విధించబోతున్నట్లు వెల్లడించారు. ఉక్రెయన్‌లో యుద్ధ నేరాలకు పాల్పడుతున్న రష్యాకు శిక్ష తప్పదన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా రాక్షసకాండను సహించబోమన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగుతుందన్నారు. చైనా, తైవాన్ మధ్య శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటున్నామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు. జీ7 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు మే లో జపాన్‌లోని హిరోషిమాలో జరగనుంది. చైనాపై జీ7 కూటమి కుట్రలు పన్నుతోందని ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ వెన్‌బిన్ ఆరోపించారు.

మరోసారి ఆక్రమిత ఉక్రెయిన్‌లోకి పుతిన్



కీవ్: యుద్ధం మొదలై దాదాపు 13 నెలలు పూర్తవుతున్న వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో పర్యటించి తమ సైన్యం సన్నద్ధతను సమీక్షించారు. మొదట ఖేర్సన్ ప్రావిన్స్‌కు చేరుకున్న పుతిన్ అక్కడి రష్యా సేనల కమాండ్ పోస్ట్‌కు వెళ్లారు. తర్వాత లుహాన్స్క్‌లోని రష్యన్ నేషనల్ గార్డ్ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఖేర్సన్, లుహాన్స్క్‌లో సైనిక ఉన్నతాధికారులతో సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు. రష్యా అధీనంలోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాల్లో పుతిన్ పర్యటించడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. కొన్ని నెలల క్రితమే ఆక్రమించాక ఉక్రెయిన్‌లోని ఖేర్సన్, లుహాన్స్క్, డోనెట్స్క్, జపోరిజియా ప్రావిన్స్‌లను స్థానిక 'రెఫరెండమ్'ల ద్వారా గత సెప్టెంబర్‌లో రష్యా తనలో కలిపేసుకున్న విషయం తెల్సిందే.



మంగళవారం ఢిల్లీలోని బెంగాలీ మార్కెట్‌లో వీధి వెంట సరదాగా చిరుతిండి రుచి చూస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

అతీక్ రహస్య లేఖ

- సీజేఐకి, సీఎం యోగికి అందజేస్తాం
- అతీక్ తరపు న్యాయవాది వెల్లడి



ప్రయాగ్‌రాజ్/న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ తన చావును ముందే ఊహించినట్లున్నాడు. అందుకే రెండు వారాల ముందే ఓ లేఖ రాసి సీల్డ్ కవర్‌లో భద్రంగా దాచిపెట్టాడు. తాను చనిపోతే దాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి(సీజేఐ), యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు అందజేయాలని కోరాడు. ఈ విషయాన్ని అతీక్ న్యాయవాది విజయ్ మిశ్రా మంగళవారం వెల్లడించారు. ''అందులో ఏముందో నాకు తెలియదు. అతీక్ కోరిక మేరకు సీల్డ్ కవర్‌లో సీజేఐకి, సీఎంకు పంపుతా'' అని చెప్పారు.

హత్యపై సుప్రీంకోర్టులో 24న విచారణ

అతీక్ సోదరుల హత్యోదంతంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ''దీన్ని అత్యవసరంగా విచారణకు స్వీకరించండి. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సారథ్యంలో స్వతంత్ర దర్యాప్తు సాగేలా చూడండి. 2017 నుంచి యూపీలో జరిగిన 183 పోలీస్ ఎన్‌కౌంటర్లపై ఎంక్వైరీకి ఆదేశించండి'' అని న్యాయవాది విశాల్ తివారీ మంగళవారం సుప్రీంకోర్టును కోరారు. దీనిపై ఏప్రిల్ 24న విచారణ జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. యోగి పాలనలో ఆరేళ్లలో ఎన్‌కౌంటర్లలో 183 మంది నేరగాళ్లు హతమయ్యారని యూపీ స్పెషల్ డీజీపీ (శాంతిభద్రతలు) ప్రకటించడం తెల్సిందే. మరోవైపు, ప్రయాగ్‌రాజ్‌లో అతీక్ లాయర్‌నని చెప్పుకుంటున్న దయాశంకర్ మిశ్రా నివాసం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బాంబు విసిరారు. ఎవరికీ హాని జరగలేదు.

ఇక ఏ మాఫియా బెదిరించలేదు: యోగి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇకపై ఎలాంటి మాఫియా కూడా బెదిరింపులకు పాల్పడబోదని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అతీక్ సోదరుల హత్య నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంగళవారం లక్నో, హర్దోయీ జిల్లాల్లో టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుపై కేంద్రంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా యోగి మాట్లాడారు. ''గతంలో రాష్ట్రాన్ని మాఫియా, నేరగాళ్లు కష్టాలపాలు జేశారు. ఇప్పుడు వాళ్లే కష్టాలు పడుతున్నారు'' అన్నారు. 'సమాజ్‌వాదీ పార్టీ హయాంలో 2012–2017 మధ్య రాష్ట్రంలో 700 అల్లర్ల ఘటనలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు బీఎస్పీ హయాంలో 364కు పైగా జరిగాయి. మా ప్రభుత్వం వచ్చాక 2017 నుంచి ఒక్క అల్లర్ల ఘటన లేదు. కర్ఫ్యూ లేదు. పరిశ్రమలు, వ్యాపారాలకు అనువైన వాతావరణం నెలకొంది. పెట్టుబడిదారుల భద్రత మా బాధ్యత'' అని చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం | 19 | ఏప్రిల్ | 2023

కనువిందుగా సూర్యప్రభ వాహనసేవ



మండ్య: మండ్య జిల్లాలోని మేలుకోటెలో వెలసిన చరిత్ర ప్రసిద్ధ శ్రీ చెలువ నారాయణస్వామి వారి దేవాలయంలో రామానుజాచార్యుల 1006వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం సూర్యప్రభ వాహనంలో రామానుజాచార్యులవారి విగ్రహాలను ఊరేగించారు. ఇక కళ్యాణీ తీర్థంలో లక్ష్మీదేవి సమేతంగా వెలసిన భూ వరాహ స్వామి సన్నిధిలో బుధవారం వరాహ జయంతిని వైభవంగా నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

జలమండలి గుంతకు బాలుడు బలి



చిన్నారి మృతికి కారణమైన గుంత ఇదే

బనశంకరి: బెంగళూరు జలమండలి నిర్లక్ష్యంతో అమాయక బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన బ్యాడరహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హనుమాన్ దంపతులు మాగడిరోడ్డు గొల్లరహట్టిలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు చేసేవారు. వీరికి రెండున్నర ఏళ్ల వయసు గల కార్తీక్ అనే కుమారుడు ఉన్నాడు. దగ్గరలో బెంగళూరు జలమండలి సిబ్బంది పైపు వేసే పనుల కోసం గుంతలు తవ్వారు. సోమవారం సాయంత్రం ఆడుకుంటున్న చిన్నారి కార్తీక్ అదుపుతప్పి గుంతలో పడిపోయాడు. బాలుడు కనబడకపోవడంతో తండ్రి గాలించగా గుంతలో పడి ఉండడం చూసి బయటకు తీశాడు. అయితే నీట మునిగి అప్పటికే మృతి చెందాడు. కుమారుని మృతితో కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన పై జలమండలి, కాంట్రాక్టర్‌పై హనుమాన్ బ్యాడరహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కారు- ట్రాక్స్ ఢీ, నలుగురు మృత్యువాత



యశవంతపుర: కారు- ట్రాక్స్ తుఫాన్ వాహనం ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదం దక్షిణ కన్నడ జిల్లా ఉప్పినంగడి-సుబ్రమణ్య రాష్ట్ర రహదారి నెట్టణ వంతెన సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. కారు కుక్కె కు, తుఫాన్ ధర్మస్థలం వైపు వెళ్తూ ఎదురుగా ఢీకొన్నాయి. కారు నుజ్జుకాగా అందులోని చిన్నారితో పాటు ఇద్దరు పురుషులు, ఒక మహిళ దుర్మరణం పాలయ్యారు. మృతులు హాసన జిల్లా బేలూరుకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వారు కుక్కె పుణ్యక్షేత్రం దర్శనానికి వెళ్తున్నట్లు తెలిసింది. తుఫాన్ వాహనంలోని కొందరు గాయపడగా ఆస్పత్రికి తరలించారు.

సవది నామినేషన్ దాఖలు

శివాజీనగర: తనకు ఆర్‌ఎస్‌ఎస్‌వారు ఓటు వేస్తారని, ఆర్‌ఎస్‌ఎస్‌లో తన శ్రేయోభిలాషులు ఉన్నారని అథణి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ సవది అన్నారు. మంగళవారం ఆయన దాఖలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేతగా ఉన్న ఆయన టికెట్ రాక కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. నామినేషన్‌కు ముందుగా లక్ష్మణ్ సవది పలు ఆలయాలలో పూజలు చేశారు. 1999 నుంచి అథణి నుంచి ఆయన పోటీ చేస్తుండగా రెండు సార్లు ఓడిపోయి, మూడుసార్లు ఎన్నికయ్యారు.

మెట్రోను ఆపిన ఎండ వేడిమి

బనశంకరి: బెంగళూరులో ఎండ వేడిమి అమ్మో అనిపిస్తోంది. వివేకానంద మెట్రోస్టేషన్ మెట్రో పట్టాలకు ఉన్న రబ్బరు ఉపకరణాలు వేడికి కాలి మంటలు ఏర్పడటంతో 20 నిమిషాల పాటు మెట్రో రైళ్ల సంచారం నిలిచిపోయింది. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు కంగారు పడ్డారు. ఎక్కువ ఎండ వేడితో ఈ ప్రమాదం సంభవించిందని మెట్రో అధికారులు తెలిపారు.

పెళ్లయి 3 నెలలు.. యువకుడు దుర్మరణం

- పావగడ వద్ద ప్రమాదం

పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకా వైఎన్ హూసకోట పోలీస్ స్టేషన్ పరిధి లోని పోతగానహళ్ళి- ఇంద్రకొండ మధ్యలో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో బైక్ ప్రమాదంలో మురళి (22) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. 3 నెలల కిందటే అతనికి పెళ్లయింది. పని మీద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కూరగాయల టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. మురళి కిందకు పడి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మరణించాడు.

ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలు

టాటా ఏస్ పల్టీలు కొట్టగా అందులో ఉన్న కూరగాయల వ్యాపారులు సుమారు పది మందిలో మల్లికమ్మ, గంగమ్మ, ధనమ్మకు తీవ్ర గాయాలు కావడం తో తుమకూరు ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు కొద్దిపాటి గాయాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మురళి మృతితో తల్లిదండ్రులు ఈరణ్ణ, నాగమ్మ, భార్య పద్మావతి తీవ్రంగా విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ అర్జున్ గౌడ తెలిపారు.

రూ.7 కోట్లు హుష్‌కాకి?

- నగరంలో అర్ధరాత్రి తనిఖీల్లో స్వాధీనం
- ఐఏఎస్ ప్రమేయంతో సొమ్ము అదృశ్యం!



మిస్టరీగా మారిన రూ. 7 కోట్ల నగదు మిస్సింగ్



బెంగళూరు సమీపంలో వాహన తనిఖీలు

శివాజీనగర: రాష్ట్రంలో విధానసభ ఎన్నికల రణరంగంలో నోట్ల రవాణా జోరుగా సాగుతోంది. నిత్యం కోట్లాది రూపాయలు దొరికిపోవడం చూస్తుంటే, ఇక దొరకని సొమ్ము ఎంత ఉంటుందోనని హడలిపోవాలి. పకడ్బందీ తనిఖీల మధ్య కూడా నగదు పంపిణీ గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజధాని బెంగళూరు దక్షిణ నియోజకవర్గం పరిధిలో సోమవారం అర్ధరాత్రి అధికారులు సోదాలు చేశారు. ఈ దాడుల్లో రూ.7 కోట్లు నగదు లభించిందని తెలిసింది. అయితే ఈ నగదు లభించిన కొద్దిక్షణాల్లోనే అక్కడికి ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వచ్చినట్లు తెలిసింది. ఆ తరువాత రూ.7 కోట్లు నగదు అదృశ్యమైందని, ఆ నగదు ఏమైందో ఎవరికీ తెలియదని వార్తలు గుప్పుమన్నాయి. ఇంత జరిగినా నగదు గురించి స్థానిక పోలీసులు మాకు ఏమీ తెలియదంటున్నారు.

ఐటీ అధికారుల విచారణ

భారీ మొత్తం నగదు గురించి తెలుసుకున్న ఐటీ అధికారులు అక్కడకు చేరుకుని విచారించారు. దీనిపై ఢిల్లీలోని ఉన్నతాధికారులకు సమాచారం పంపారు. దొరికిన నగదు క్షణాల్లోనే చేజారడంపై ఐటీ అధికారులు తర్జనభర్జనలు పడ్డారు. ఎన్నికల సందడి మొదలయ్యాక రాష్ట్రంలో ఒకేసారి లభించిన అతిపెద్ద మొత్తం ఇదే. ఐటీ అధికారులు నగదు ఎవరిది, ఎక్కడికి వెళ్లిందనేది ఆరా తీస్తున్నారు.

మరోచోట రూ.1 కోటి సీజ్

మరోవైపు సోమవారం అర్ధరాత్రి నగరంలోని ఎస్‌జే పార్కు పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో రూ.1 కోటి నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.2 కోట్ల నగదు సీజ్

దొడ్డబళ్లాపురం: ఏటీఎం సెంటర్లలో నగదు తరలించే వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.2 కోట్ల నగదును హారోహళ్లి పోలీసులు సీజ్ చేసారు. హారోహళ్లి తాలూకా గంటకనదొడ్డి చెక్‌పోస్టులో సోమవారం రాత్రి ఎన్నికల అధికారులు, పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏటీఎం మెషిన్లకు నగదు నింపేందుకు నగదు తరలించే వాహనం అటుగా వచ్చింది. అయితే అది నగదు తరలించే సమయం కాకపోవడంతో, అదీకాకుండా గన్‌మ్యాన్ కూడా లేకుండా నగదు తరలిస్తుండడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా లెక్కలు లేని రూ.2 కోట్ల నగదు పట్టుబడింది. నగదు సీజ్ చేసుకున్న పోలీసులు వాహనం డ్రైవర్‌ను అరెస్టు చేసారు. హారోహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



నగదు కోసం ఐటీ ఆరా

4వ అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

బనశంకరి: అపార్టుమెంటు నాలుగో అంతస్తు పై నుంచి దూకి సోను పూజారి అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పుట్టేనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోను పూజారి(33) భర్త నిరంజన్ పనిమీద ముంబైకి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సోనుపూజారి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అపార్టుమెంట్ నాలుగో అంతస్తు పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో ఘటనాస్థలంలోనే మృతి చెందింది. పుట్టేనహళ్లి పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమై ఉంటాయని భావిస్తున్నారు.

కిచ్చ సుదీప్ ప్రచారం చేయరాదు

మైసూరు: కన్నడ నటుడు కిచ్చ సుదీప్ ఏ పార్టీకి చెందిన వ్యక్తి కాదు, ఆయన కన్నడ ప్రజల ఆస్తి. ఈ ఎన్నికల్లో ఎవరికీ మద్దతుగా ప్రచారం చేయకూడదని రాష్ట్ర నాయకర హితరక్షణ వేదిక రాష్ట్రాధ్యక్షుడు ద్యావప్ప నాయక డిమాండ్ చేశారు. మంగళవారం మైసూరులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీప్ నటనా కౌశల్యం ద్వారా దేశవ్యాప్తంగా కోట్ల మంది అభిమానులను సంపాదించారు, ఇలాంటి నటుడు ఒక పార్టీ కోసం , ఒక అభ్యర్థి కోసం ప్రచారం చేయడం మంచిది కాదని అన్నారు. ఆయన కన్నడనాడులో ఉన్న ఆరున్నర కోట్ల మంది ప్రజల ఆస్తి కనుక ఎవరో ఒకరి పక్షాన ప్రచారం చేయడం సబబు కాదని అన్నారు.

ముమ్మరంగా ఊరేగింపులు



బెళగావిలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ఊరేగింపులో జన సందోహం



తుమకూరులో బీజేపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీ

- ఉత్సాహంగా నామినేషన్ల పర్వం

యశవంతపుర: ఊరంతా కదిలిపోయేలా బ్యాండు బాజా, కళాకారుల ప్రదర్శనలు, అభిమానులు కేరింతలతో నామినేషన్ల ర్యాలీలు సాగాయి. విధానసభ ఎన్నికలలో అభ్యర్థుల నామినేషన్ పర్వం జోరుగా సాగుతోంది. వివిధ నియోజకవర్గాలలో మంగళవారం కూడా పెద్దసంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. తమ తాహతు మేరకు ఊరేగింపు జరిపి బల ప్రదర్శన చేశారు.

ప్రముఖులచే దాఖలు

మంత్రి ఆర్.అశోక్ (కనకపుర లో), మురుగేశ్ నిరాణి (బీళగి), బీఎ బసవరాజ (కేఆర్ పుర), గోవింద కారజోళ- (ముధోళ), సప్తగిరి గౌడ- (గాంధీనగర), మంజుళ లింబావళి- (మహదేవపుర), సీకే రామమూర్తి (జయనగర) నామినేషన్లు సమర్పించారు. బీళగి, ముధోళలో సీఎం బసవరాజ్ బొమ్మై అభ్యర్థులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. జేడీఎస్ పార్టీ తరపున బండెప్ప కాశెంపుర (బీదర్ దక్షిణ), ఆర్.మంజునాథ్ (దాసరహళ్లి), వైఎస్‌వీ దత్త (కడూరు), అరమనె శంకర్ (బసవనగుడి), ఎ.మంజునాథ్ (మాగడి), రవీంద్ర శ్రీకంఠయ్య (శ్రీరంగపట్టణ), సీఎస్ పుట్టరాజు (మేలుకోటె)లో నామినేషన్ వేశారు.



మంగళవారం బెళగావిలో కేంద్ర బలగాల గస్తీ



ధార్వాడలో కాషాయ పార్టీ అభ్యర్థి ర్యాలీలో తప్పెట్లు

మునిగిపోయే పడవలోకి వెళ్లారు: సీఎం

సాక్షి, బళ్లారి: దేశంలోను, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మునిగిపోతున్న నావలాంటిదని, ఆ పార్టీని నమ్ముకుని బీజేపీ వీడిన వారందరూ మళ్లీ పార్టీలోకి రావడం ఖాయమని సీఎం బొమ్మై అన్నారు. ఆయన మంగళవారం బాగలకోట జిల్లాలో విలేకరులతో మాట్లాడారు. వరుణ నుంచి ముధోళ వరకు బీజేపీ సునామి కనబడుతోందన్నారు. పార్టీ నేత బీఎల్ సంతోష్ వల్ల తమకు టికెట్ రాలేదని షెట్టర్, లక్ష్మణ సవది మాట్లాడడం సమంజసం కాదన్నారు. పార్టీ పెద్దలందరూ నిర్ణయం తీసుకుని టికెట్లు కేటాయించారని, బీజేపీ వీడకూడదని, మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పినా వారు వినకుండా మునిగిపోతున్న పడవలో చేరారని, ఎవరి ఖర్మ వారు అనుభవించాల్సిందేనని అన్నారు. నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత సినీనటుడు సుదీప్ అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తారన్నారు.



రాష్ట్రంలో పాడి రంగాన్ని కాపాడాలంటూ బెంగళూరు ఫ్రీడంపార్క్ వద్ద రైతుసంఘం ధర్నా

మాజీ మంత్రిపై కేసు నమోదుకు ఆదేశం

బనశంకరి: అక్రమ ఇనుప ఖనిజం విక్రయం కేసులో మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ కేసుపై మంగళవారం విచారణ చేపట్టిన కోర్టు.. గాలి జనార్దనరెడ్డి, బళ్లారి రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగేంద్రతో పాటు 16 మందిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 24వ తేదీకి వాయిదా వేసింది.

స్వతంత్ర అభ్యర్థిగా సొగడు

తుమకూరు: తుమకూరు నగర నియోజకవర్గం బీజేపీ టికెట్ దొరకకపోవడంతో బీజేపీ మాజీ మంత్రి సొగడు శివణ్ణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు. ఈ నెల 20వ తేదీన మద్దతుదారులతో కలిసి నామినేషన్ వేస్తానని మంగళవారం ఇక్కడ చెప్పారు. ఇప్పటివరకు ఉన్నది వేరు, ఈరోజు నుంచి కొత్త అధ్యాయం ప్రారంభం అవుతుందని అన్నారు. నేను స్వాభిమానంతో జీవిస్తాని, మద్దతుదారులు, కార్యకర్తల కోసం స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని తెలిపారు.

ఓటుహక్కుపై ట్రాన్స్‌జెండర్ల జాగృతి



శివాజీనగర: ఎన్నికల్లో ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు వినూత్న చర్యలు తీసుకుంటున్నారు. బెంగళూరు ఓటర్లను పోలింగ్ బూత్‌ల వైపు ఆకర్షించే మరో విశిష్ట ప్రయత్నం చేపట్టారు. ప్రతిభావంతులైన ట్రాన్స్‌జెండర్ కళాకారుల బృందం అరవాణి ఆర్ట్ ప్రాజెక్ట్ ద్వారా గోడలపై ఎన్నికల అవగాహన చిత్రాలు చిత్రించి ఓటర్లలో అవగాహన కలిగించే ప్రచారం ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్ కళాకారుల అరవాణి ఆర్ట్ ప్రాజెక్ట్ బృంద మొకటి శేషాద్రి రోడ్డులో ఉన్న ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆవరణంలో కొత్తగా నిర్మించిన మూడు అంతస్థుల భవనం గోడలపై ఆకట్టుకొనే రంగుల చిత్రాలను తీర్చిదిద్దారు. ఓటు హక్కు ప్రాధాన్యత, యువకులు, మహిళల చిత్రాలను ట్రాన్స్‌జెండర్ కళాకారులు చిత్రీకరించారు.

వినయ్ కులకర్ణికి నో ఎంట్రీ

- ప్రజా ప్రతినిధుల కోర్టు ఆదేశాలు
- వినయ్ ధారవాడ గ్రామీణ నియోజకవర్గం అభ్యర్థి



వినయ్ కులకర్ణి

శివాజీనగర: విధానసభ ఎన్నికల సమయంలో ధారవాడకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ మాజీ మంత్రి వినయ్ కులకర్ణి సమర్పించిన దరఖాస్తు సస్పెండ్ కావటంతో కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ధారవాడ బీజేపీ జిల్లా పంచాయతీ సభ్యుడు యోగీశ్ గౌడ హత్య కేసులో ఆయన నిందితుడు. ధారవాడ ప్రవేశానికి అనుమతి కోరుతూ బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల న్యాయస్థానంలో దరఖాస్తు సమర్పించారు. ఏప్రిల్ 15న వినయ్ కులకర్ణి దరఖాస్తు విచారణను పూర్తి చేసిన కోర్టు ఏప్రిల్ 18కి తీర్పు రిజర్వులో ఉంచింది.

సీబీఐ వాదన ఏమిటి?

యోగేశ్ గౌడ కేసులో 120 సాక్షుల్లో 90 మంది ధారవాడకు చెందినవారు. వినయ్ కులకర్ణికి నియోజకవర్గానికి వస్తే అక్రమాలకు పాల్పడవచ్చు. కేసు విచారణకు సమస్య కావచ్చు. సాక్షులను బెదిరించే అవకాశముంది. ఏ కారణానికి ప్రవేశానికి అనుమతి ఇవ్వరాదని సీబీఐ తరపు న్యాయవాది బలమైన వాదనను వినిపించారు.

సీటు మారుతుందా?

కాంగ్రెస్ తన అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేసి ధారవాడ గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రి వినయ్ కులకర్ణికి టికెట్ ఇచ్చారు. వినయ్ కులకర్ణి ప్రస్తుతం ధారవాడ ప్రవేశానికి అనుమతి ఇవ్వని కారణాన కాంగ్రెస్ ముందు ఏ నిర్ధారణ తీసుకొంటుందోనని కుతూహలం పెరిగింది. ధారవాడ ప్రవేశం కల్పించకపోతే వినయ్ కులకర్ణి శిగ్గాంవి నియోజకవర్గం ఉండి పోటీ చేసే అవకాశం ఉందని మాటలు ఇంతకు ముందు వినిపించాయి. అదే నిజమైతే సీఎం బొమ్మైపై పోటీ చేయాల్సి ఉంటుంది.

రాజధాని రోడ్లంటే భయం

- మూడునెలల్లో 1,197 యాక్సిడెంట్లు
- 205 మంది దుర్మరణం, 300 మందికి తీవ్రగాయాలు
- ఐటీ సిటీలో హెచ్చుమీరుతున్న ప్రమాదాలు.





నగరంలో జక్కూరు వద్ద జరిగిన బైక్ ప్రమాదం (ఫైల్) (కింద) కారు యాక్సిడెంట్



బనశంకరి: బెంగళూరులో వాహనం తీసుకుని బయల్దేరినవారు తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకుంటే చాలనే భావన నెలకొంది. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ పోలీసులు ఎంత జాగృతం చేసినప్పటికీ సిలికాన్ సిటీలో రోడ్డు ప్రమాదాలు సంఖ్య పెరుగుతూనే ఉంది. గత మూడునెలల్లో అలాంటి ప్రమాదాలతో 205 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది జనవరి ఆరంభం నుంచి మార్చి చివరినాటికి బెంగళూరులో మొత్తం 1,197 రోడ్డు ప్రమాదాలు సంభవించగా వీటిలో 1,051 మంది గాయపడ్డారు. ఇందులో 300 మంది తీవ్రంగా గాయపడినవారని ట్రాఫిక్ పోలీస్ డేటా విభాగం తెలిపింది.

గత నాలుగేళ్లలో ప్రమాదాలు

- సిలికాన్ సిటీలో 2019లో 4,684 ప్రమాదాల్లో 768 మంది మృత్యువాత పడ్డారు. 2020లో 3,233 ప్రమాదాల్లో 646 మంది, 2021లో 3213 ప్రమాదాల్లో 654 మంది మృతిచెందారు.
- 2022లో 3,479 కేసులు నమోదు కాగా 670 మంది మరణించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 205 మంది విగతజీవులు కావడం ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతోంది.
- మరోపక్క నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై గత మూడు నెలల్లో 660 కేసులు నమోదయ్యాయి. సిగ్నల్ జంప్, లేన్ ఉల్లంఘన కేసులు వేలాదిగా నమోదయ్యాయి.

గుంతల రోడ్లు, నిర్లక్ష్యపు డ్రైవింగ్

బెంగళూరులో రోడ్లపై ఏర్పడిన గుంతలు, అధిక రద్దీ, ఇరుకిరుకు రహదారులు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల యాక్సిడెంట్లు సంభవిస్తున్నాయి. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్ల తీవ్రత పెరుగుతోంది. కొంతమంది బైకిస్టులు హాఫ్ హెల్మెట్ ధరిస్తున్నారు. కానీ ప్రమాద సమయంలో ఇవి తలకు పూర్తిగా రక్షణ ఇవ్వవు. కాబట్టి ఐఎస్ఐ మార్క్ కలిగిన ఫుల్ హెల్మెట్ ధరించాలని పోలీసులు ప్రచారం చేపట్టారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలకు పూజ చేయించిన దృశ్యం

గౌరిబిదనూరు: స్థానిక ఎమ్మెల్యే, అభ్యర్థి శివశంకరరెడ్డి నామినేషన్ పత్రాలకు విదురాశ్వత్థం అశ్వత్థనారాయణస్వామి దేవాలయం, ఎల్లోడు ఆదినారాయణస్వామి, కుడుములకుంటె ఈశ్వర దేవాలయం, సాయిబాబా దేవాలయం తదితరాల్లో పూజలు చేశారు. తరువాత ఎన్నికల అధికారికి అందజేశారు. మళ్లీ 20వ తేదీన తమ కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి మరోసారి నామినేషన్ దాఖలు చేస్తానని ఆయన తెలిపారు.

బీజేపీ అభ్యర్థి ప్రచారం

బీజేపీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలే అందుకు సాక్ష్యమని బిజెపి అభ్యర్థి శశిధర్ అన్నారు. మంగళవారం రమాపుర మొదలైన గ్రామాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. మోదీ ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించారని, వారి పథకాలను విదేశీయులు సైతం మెచ్చుకొంటూ ఉన్నారని తెలిపారు. రమేష్ రావ్ శేల్కే పాల్గొన్నారు.

అపౌష్టిక పిల్లలకు చేయూత



జిల్లాధికారికి చెక్కును అందిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: అపౌష్టికతకు గురైన పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. మంగళవారం జెడ్పీ భవనంలో ఏర్పాటు చేసిన పిల్లలకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అపౌష్టికతకు గురైన ఆరేళ్ల లోపు వయస్సుగల 116 మంది పిల్లలకు మంచి ఆహారాన్ని అందించి వారి పెరుగుదలకు తోడ్పడాలన్నారు. కేంద్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు రూ.3.78 కోట్ల చెక్కును అందించి అపౌష్టికతతో కూడిన పిల్లల కోసం ఈ నిధులను వ్యయం చేయాలన్నారు. సమావేశంలో కేంద్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కెకె పండా, సోనాలీ గవాయి, జెడ్పీ సీఈఓ శశిధర్, డీ హెచ్ఓ సురేంద్రబాబు, మహిళా శిశు అభివృద్ధి అధికారిణి శరణమ్మ, యూసఫ్, నందితాలున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



ఎమ్మెల్యే నాగేంద్ర సమక్షంలో నినాదాలు చేస్తున్న పార్టీలో చేరిన యువకులు

బళ్లారిఅర్బన్: తాలూకాలోని శంకరబండ గ్రామంలో గ్రామీణ అభ్యర్థి, ఎమ్మెల్యే నాగేంద్ర, దేవినగర్ ఎంపీపీ మారెయ్యల సమక్షంలో సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన ప్రముఖుల నిర్ణయం మేరకు గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా హొన్నూరుస్వామి, నాగరాజు, దేవమ్మ, హులిగమ్మ, గాదిలింగమ్మ, హంపమ్మ పాల్గొన్నారు.

పురాతత్వ సంపదను కాపాడుకోవాలి

గంగావతి: విజయనగర సామ్రాజ్య స్థాపన దినోత్సవాన్ని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రముఖ చరిత్రకారుడు చెన్నబసప్ప కోల్కర్ నేతృత్వంలో హక్కబుక్కరాయులు శ్రీకృష్ణదేవరాయలు ఉన్న చిత్రపటాన్ని సర్కిల్‌లో ఉంచి పండ్లు, పూలతో పూజలు నిర్వహించారు. చరిత్రకారుడు కోల్కర్ మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్య చరిత్ర అంటే కేవలం గతం మాత్రమే కాదని, వర్ధమానానికి పునాది వంటిదన్నారు. చరిత్ర కట్టడాలు, స్మారక స్థూపాలు, ఆలయాలు, ఇతర నిర్మాణాలు దేశ సంస్కృతి, నాగరితకు సజీవ సాక్ష్యాలన్నారు. అలాంటి వాటిని కాపాడుకోవాలన్నారు. విజయనగర సామ్రాజ్య రాజధాని హంపీ రక్షణకు యునెస్కో వారసత్వ గుర్తింపు ఇవ్వడంతో పాటు నిధులు కూడా కేటాయిస్తున్నారని ఆయన అన్నారు.

గజ వాహనంపై శ్రీవారు



ఊరేగుతున్న స్వామివారు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామివారు గజ వాహనంపై పుర వీధుల్లో విహరించారు. ఉదయం నుంచి శ్రీవారికి వేద పండితులు ఆధ్వర్యంలో పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతి, అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం గజ వాహనంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిల్లో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పూజా కార్యక్రమంల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కోలాహలం..అట్టహాసం

- ఆయా పార్టీ అభ్యర్థుల నామినేషన్ పర్వం
- వేలాది మంది కార్యకర్తలతో ర్యాలీలు



బళ్లారిలో సతీమణితో కలిసి నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి శ్రీరాములు, చిత్రంలో ఎమ్మెల్యే సోమశేఖరరెడ్డి, మాజీ ఎంపీ సన్నపకీరప్ప, మహిపాల్



గంగావతిలో సతీమణితో కలిసి ఎన్నికల అధికారికి నామినేషన్‌ను అందిస్తున్న కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి జనార్దన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

సాక్షి,బళ్లారి: బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న మంత్రి శ్రీరాములు అట్టహాసంగా, వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి నగరంలో ఊరేగింపుగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన మంగళవారం నగరంలోని తన నివాస గృహం వద్ద నుంచి ముందుగా గోమాతకు, అనంతరం కోటమల్లేశ్వర ఆలయంలో పూజలు చేసి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో పెద్ద ఎత్తున రోడ్డు షోతో ర్యాలీగా తరలివచ్చారు. రోడ్డులో షోలో ఆయనకు జైకారాలు కొడుతూ కార్యకర్తలు ముందుకు సాగారు. పెద్ద సంఖ్యలో చేరిన జనంతో రోడ్లన్ని నిండిపోయాయి. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సంబంధిత ఎన్నికల అధికారికి కుటుంబ సభ్యులతో కలిసి ఒక సెట్, పార్టీ నేతలతో కలసి మరో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, లోక్‌సభ సభ్యుడు దేవేంద్రప్ప, సీనియర్ న్యాయవాది పాటిల్ సిద్దారెడ్డి, మాజీ ఎంపీలు జే.శాంత, సన్నపక్కీరప్ప, మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్.సురేష్‌బాబు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహరగౌడ, రాష్ట్ర జవళి నిగమ అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, బీజేపీ నాయకులు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌పీపీ అభ్యర్థిగా దివాకర్ నామినేషన్

సండూరు నియోజకవర్గం నుంచి కేఆర్‌పీపీ అభ్యర్థిగా కేఎస్ దివాకర్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన మంగళవారం సండూరులో భారీ జన సమూహంతో ర్యాలీగా బయలులేరి సంబంధిత ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు టికెట్ ఇస్తానని నమ్మబలికి మోసగించిన బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా సండూరు అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఈసారి తనను గెలిపించడానికి నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి నామినేషన్

నగరంలో కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి మంగళవారం భారీ జన సందడితో కోలాహలంగా నామినేషన్ దాఖలు చేశారు. వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో ఊరేగింపుగా వచ్చి నామినేషన్ పత్రాలను సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత ఎన్నికల అధికారికి అందజేశారు. అంతకు ముందు ఆయన కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విజయీభవ అనే వాహనంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ తరలి వచ్చారు. మాజీ జెడ్పీ మెంబర్ అల్లం ప్రశాంత్, మాజీ బుడా అధ్యక్షుడు జే.ఎస్.ఆంజనేయులు, రాజ్యసభ సభ్యులు నాసీర్ హుస్సేన్ తదితరులతో పాటు గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర తదితర నాయకులు ర్యాలీలో పాల్గొని పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, పార్టీ సీనియర్ నాయకులు ముండ్లూరు అనూప్ కుమార్, ముల్లంగి రవీంద్ర, మాజీ మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, నాయకులు సునీల్ కుమార్, ముండ్లూరు చిట్టి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ నామినేషన్

కంప్లి: క్షేత్ర కాంగ్రెస్ అభ్యర్థి జేఎన్ గణేష్ మంగళవారం నామినేషన్ వేశారు. తన ఇంటి నుంచి ఓపెన్ టాప్ వాహనంలో వందలాది కార్యకర్తలతో ఊరేగింపుగా బయలుదేరారు. ముందుగా ఉద్భవ గణపతి దేవస్థానం వద్ద పూజలు నిర్వహించి ఎడ్లబండిలో వివిధ వాయిద్యాలతో, కార్యకర్తల నినాదాలతో మున్సిపల్ కార్యాలయం చేరుకుని ఎన్నికల అధికారిణి డాక్టర్ నయనకు అభ్యర్థి గణేష్ నామినేషన్ అందించారు. కాగా ఎమ్మెల్యే గణేష్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే ఆయనను మళ్లీ గెలిపిస్తుందని మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప తెలిపారు. శ్రీనివాసరావు, కల్లుకంబ పంపాపతి, ముంద్రిగి నాగరాజ్, కౌన్సిలర్ భట్టా ప్రసాద్, కేఎస్ చాంద్‌బాష, లడ్డు హొన్నూర్‌వలీ, ఉస్మాన్, వీరాంజనేయులు, పీ.మౌలా పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా నామినేషన్ల పర్వం

రాయచూరు రూరల్: నగరంలో ఎస్‌యూసీఐ అభ్యర్థి వీరేష్ నామినేషన్ వేశారు. మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి రజనీకాంత్‌కు, దేవదుర్గలో కాంగ్రెస్ అభ్యర్థిని శ్రీదేవి నాయక్, దేవదుర్గలో జేడీఎస్ అభ్యర్థిని కరియమ్మ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి చేతన్ కుమార్‌కు, రాయచూరు గ్రామీణలో జేడీఎస్ అభ్యర్థి నర సింహనాయక్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి శశికాంత్‌కు నామినేషన్ పత్రాలను అందించారు.

కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి జనార్దన్‌రెడ్డి నామినేషన్

గంగావతి: కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి మంగళవారం భారీ జన సందోహంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఉదయాన్నే చెన్నబసవస్వామి, దుర్గా దేవి ఆలయాలు, కర్నూల్ తాత దర్గాకు వెళ్లి పూజలు నెరవేర్చారు. సుమారు 10 గంటల సమయంలో తన నివాసం వద్దకు చేరిన వేలాది మంది జన సందోహంతో ఇస్లాంపూర్ సర్కిల్, మహావీర్ సర్కిల్ మీదుగా గాంధీ చౌక్ వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మధ్యలో ఉన్న సర్కిళ్లలో జనార్దన్‌రెడ్డికి గజమాలలను క్రేన్‌తో వేశారు. పట్టణ చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఇంత పెద్ద స్థాయిలో జన సమీకరణ జరగలేదని నగర వ్యాప్తంగా పెద్ద చర్చకు తావిచ్చింది. దారి పొడవునా జనార్దన్‌రెడ్డి జిందాబాద్, ఫుట్‌బాల్ గుర్తుకే మీ ఓటు ఉన్న నినాదాలు మారుమోగాయి. నామినేషన్‌కు జనార్దన్‌రెడ్డి భార్య లక్ష్మీఅరుణ, కుమార్తె బ్రహ్మణి, అల్లుడు తదితరుల సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నగరంలో ఎక్కడ చూసినా జనం పెద్ద సంఖ్యలో గుమికూడి చేతిలో ఫుట్‌బాల్ గుర్తు కలిగిన జెండాలు, టోపీలు ధరించి కనిపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేడీఎస్ అభ్యర్థి చెన్నకేశవ నామినేషన్

నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా తనదైన శైలిలో వందలాది మందితో ఊరేగింపుగా బస్టాండ్ సర్కిల్‌కు చేరుకున్న జేడీఎస్ పార్టీ అభ్యర్థి హెచ్‌ఆర్ చెన్నకేశవ మంగళవారం తన వాహనంలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు షేక్ నబీ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరలో జోరుగా నామినేషన్లు

హొసపేటె: హొసపేటె(విజయనగర) నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌ఆర్ గవియప్ప తన సతీమణితో కలిసి సోమవారం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్‌కు ముందు అభ్యర్థి గవియప్ప పార్టీ కార్యకర్తలతో కలిసి గాంధీ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం నగర ప్రముఖ వీధులలో బృహత్ ఊరేగింపును నిర్వహించారు. అదే విధంగా విజయనగర జిల్లా కూడ్లిగిలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్ తన పత్నితో కలిసి నామినేషన్‌ను ఎన్నిలకు అధికారులకు అందజేశారు.



బళ్లారిలో నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి



సండూరులో కేఆర్‌పీపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న కేఎస్ దివాకర్



దేవదుర్గలో నామినేషన్ వేస్తున్న జేడీఎస్ అభ్యర్థిని కరియమ్మ



దేవదుర్గలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థిని శ్రీదేవి నాయక్



కంప్లిలో నామినేషన్‌ను దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జేఎన్.గణేష్



రాయచూరులో నామినేషన్ వేస్తున్న ఎస్‌యూసీఐ అభ్యర్థి వీరేష్



గంగావతిలో ఎన్నికల అధికారికి నామినేషన్‌ను దాఖలు చేస్తున్న హెచ్‌ఆర్ చెన్నకేశవ(జేడీఎస్)



హొసపేటలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌ఆర్.గవియప్ప



కూడ్లిగిలో నామినేషన్ పత్రాలను అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్

పేదలకు నవోదయ ఆరోగ్య కార్డులు

రాయచూరు రూరల్: నగరంలో 12,600 మంది పేదలకు నవోదయ ఆరోగ్య భాగ్య కార్డులను అందించామని నవోదయ వైద్య కళాశాల ట్రస్టీ ఎస్.రాజేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని 11 మురికి వాడలు, మలియాబాద్, మిట్టి మల్కాపూర్, దేవనపల్లి, బిజినగేర, సిద్రాంపురల్లో పేదలకు కార్డులను పంపిణీ చేశామన్నారు. ఉచితంగా మూడు వేల మందికి ఆపరేషన్లు, లక్ష మందికి ఓపీడీలో, 1500 మందికి ఇన్‌పేషెంట్లకు చికిత్సలు చేశామన్నారు. రూ.75 లక్షలతో ఆహార పదార్థాలను పంపిణీ చేస్తామన్నారు. కళాశాలలో ఈ ఏడాది మెడికల్ సీట్లు 150 నుండి 200కు పెంచామన్నారు. రూ.15 కోట్లతో అధ్యాపకుల గ్యాలరీ, రూ.16 కోట్లతో నూతనంగా 300 పడకల ఆస్పత్రిని రూపొందించామని, మొత్తం 1080 పడకలున్నాయన్నారు. రూ.1.5 కోట్లతో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, ఆస్పత్రిలో న్యూరాలజీ, యురాలజీ విభాగాల ప్రారంభం, వైద్య, దంత, ఇంజినీరింగ్‌ల్లో తమ కళాశాల విద్యార్థులు వంద ర్యాంకులు, బంగారు పతకాలను సాధించారన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రరెడ్డి

నేటి నుంచి రీగల్–2023 ఉత్సవాలు ప్రారంభం

నవోదయ వైద్య కళాశాలలో బుధవారం నుంచి రీగల్–2023 ఉత్సవాలు జరుగుతాయని కళాశాల ట్రస్టీ ఎస్.రాజేంద్రరెడ్డి తెలిపారు. సాయంత్రం జిల్లా జడ్జి మారుతి బగాదే, గురువారం గ్రాడ్యుయేషన్ డేను వివేక్ జావళ్, శుక్రవారం సంజయ్‌గాంధీ ఆస్పత్రి అధికారి నిరంజన్‌గౌడ ప్రారంభిస్తారన్నారు. గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను రాయచూరు వర్సిటీ వీసీ హరీష్ రామస్వామి ప్రారంభిస్తారని తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్, దేవానంద్, విజయచంద్రలున్నారు.

హుబ్లీలో జేపీ నడ్డాకు ఘనస్వాగతం

- వలసలతో నష్టనివారణకు వ్యూహరచన

హుబ్లీ: మారిన రాజకీయాలతో బెళగావిలో లక్ష్మణ సవది, హుబ్లీలో జగదీష్ శెట్టర్ తిరుగుబాటు చేసిన క్రమంలో జేపీపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం హుబ్లీ విచ్చేశారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఘన స్వాగతం పలికారు. బుధ, గురువారాల్లో ధార్వాడ, హావేరి జిల్లా పర్యటనలో కీలక చర్చలు జరపనున్నారు. లింగాయత్ నేతల వలసల వల్ల కలిగే నష్టం పూడ్చుకోడానికి చేయాల్సిన కీలక చర్యలపై ఆయన దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయన హుబ్లీ బీవీబీ కాలేజీలో చర్చాగోష్టి నిర్వహించారు. మేధావులతో చర్చించాక ప్రైవేట్ హోటల్‌లో బస చేశారు. అదే సమయంలో ఆయన శక్తి కేంద్రం, మహాశక్తి కేంద్రం, జిల్లా మండలి పదాధికారులతో కూడా చర్చలు జరిపారు. ముఖ్యంగా శెట్టర్ కాంగ్రెస్‌లో చేరిక వల్ల బీజేపీకి జరిగే నష్టాన్ని నివారించేందుకు ఆయన ప్రత్యేకంగా వ్యూహాలు రూపొందించారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ నళిన్‌కుమార్ కటీల్, హుబ్లీ సెంట్రల్ అభ్యర్థి మహేష్ టెంగినకాయి, కుందగోళ అభ్యర్థి ఎంఆర్ పాటిల్, పశ్చిమ అభ్యర్థి అరవింద బెల్లద, శెట్టర్ సోదరుడు, ఎమ్మెల్సీ ప్రదీప్ శెట్టర్ తదితరులు నడ్డా వెంట ఉన్నారు.



విమానాశ్రయంలో నడ్డాకు స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, నేతలు

ఆగిన రోడ్డు పనులతో ప్రజలకు పాట్లు



కంకర తేలిన రోడ్డులో దుమ్ము రేపుతూ వెళుతున్న ఆర్టీసీ బస్సు

కంప్లి: రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి అర్ధంతరంగా ఆపివేయడంతో వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు శాంతినగర్ వాసులు వాపోయారు. నెల్లుడి క్రాస్ నుండి శాంతినగర్ వరకు రోడ్డు పనులు ప్రారంభించి నిలిపి వేయడం వల్ల రోడ్డుపై వేసిన కంకర ఎగిరి పడి వాహనదారులు గాయపడినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందంటున్నారు. కనీసం నీరు కూడా చల్లక పోవడంతో వాహన రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి లేచి జనావాసాల్లో పడి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. కాంట్రాక్టర్ వెంటనే రోడ్డు పనులు ప్రారంభించకుంటే రాస్తారోకో చేస్తామని గ్రామవాసులు హెచ్చరించారు.

పార్టీపై నిష్ట వల్లే టికెట్ దక్కింది

హుబ్లీ: బీఎల్ సంతోష్‌కు మానస పుత్రుడినని తనకు టికెట్ ఇవ్వలేదు, పార్టీకి నిష్టగా ఉన్న కార్యకర్త అయినందుకే తనకు టికెట్ ఇచ్చారని హుబ్లీ–ధారవాడ సెంట్రల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మహేష్ టెంగినకాయి అన్నారు. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మానస పుత్రుడి కోసం బీఎల్ సంతోష్ తనకు టికెట్ రాకుండా చేశారన్న జగదీశ్ శెట్టర్ విమర్శలపై స్పందించారు. 30 ఏళ్లుగా జగదీష్ శెట్టర్ శిష్యుడిని, గురువు ఆశీర్వాదం ఇస్తారన్న విశ్వాసం ఉందన్నారు. పార్టీ పట్ల నిష్టగా ఉండటమే ముఖ్యమని, వ్యక్తి పూజ ఇక్కడ చెల్లదన్నారు. బీఎల్ సంతోష్ ఒక్కడే అన్ని నిర్ణయాలు తీసుకోలేదని, పార్లమెంట్ కమిటీ టికెట్ల తీర్మానం చేసిందన్నారు.

పార్టీల్లోకి జోరుగా వలసలు

రాయచూరు రూరల్: తాలూకాలోని యడ్లాపురలో మంగళవారం కాంగ్రెస్, జేడీఎస్ పార్టీల కార్యకర్తలు గ్రామీణ మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ సమక్షంలో బీజేపీలో చేరారు. రాష్ట్రంలో ఐదేళ్లలో పేదలకు కల్పించిన ప్రభుత్వ పథకాలను గుర్తుంచుకొని ఈసారి ఎన్నికల్లో పార్టీని మరోసారి గెలిపించాలన్నారు. అదే విధంగా బీజేపీ నేత శివప్ప నాయక్ ఆధ్వర్యంలో 250 మందికి పైగా యువకులు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శశికళ, అయ్యణ్ణ, ప్రేమ్ సింగ్, తిమ్మప్పలున్నారు.

కోలారు వార్తలు...


వ్యవస్థ పటిష్టానికి ప్రణాళికలు అవసరం



మాట్లాడుతున్న శాంతమ్మ

కోలారు: రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ప్రణాళికలను పొందుపరిచి అమలు చేయాలని జిల్లా ప్రగతిశీల సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు శాంతమ్మ తెలిపారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఆమె విలేకరులతో మాట్లాడా రు. గార్మెంట్స్, కట్టడ, బీడి తదితర రంగాల కార్మికుల ఆరోగ్య హక్కు కలను నిజం చేసే దిశగా సమాఖ్య పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య హక్కు చట్టం అమలుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మానసిక రోగుల ఆరో గ్య రక్షణకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు పౌష్టికాహారం, పలు సర్జరీలు, థెరపీలను ఉచితంగా అందించాలన్నారు. సమాఖ్య సభ్యుడు శశిరాజ్ హరతలె, కళా కారుడు వెంకటాచలపతి, నళిని పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



తనిఖీల్లో పట్టుబడిన ఆటో ఇదే

శ్రీనివాసపురం: తాలూకాలోని రాయల్పాడు హక్కిపిక్కి కాలనీ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రాయల్పాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మద్యాన్ని తరలిస్తుండగా సోమవారం రాత్రి ఆ బ్కారీ పోలీసులు రూ.9 వేల విలువ చేసే 17.28 లీటర్ల మద్యాన్ని, రూ.లక్ష విలువ చేసే ఆటోను, 7.8 లీటర్ల బీరు బాటిళ్లను, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనై అబ్కారీ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓటరు జాగృతికి బైక్ ర్యాలీ

కోలారు: వంద శాతం పోలింగ్ కోసం స్వీప్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో దివ్యాంగుల బైక్ ర్యాలీని జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఈఓ జిల్లాలో వంద శాతం పోలింగ్ జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎన్నికల రాయబారులు అనితా, నాగేష్‌లను సన్మానించారు.

బీజేపీ అభ్యర్థిని అశ్విని నామినేషన్



కేజీఎఫ్‌లో నామినేషన్ దాఖలు చేయడానికి వెళుతున్న బీజేపీ అభ్యర్థిని అశ్విని తదితరులు

కేజీఎఫ్: కేజీఎఫ్ బీజేపీ అభ్యర్థిని అశ్విని సంపంగి మంగళవారం పార్టీ నాయకులతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. దాదాపు 10 వేల మంది కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ అందజేశారు. ఉదయం నగరంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా వెళ్లారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడిన అశ్విని సంపంగి 2018 ఎన్నికల్లో ఓటర్లకు వడ్డీలేని రుణాలు ఇచ్చి వాటిని మాఫీ చేయిస్తామని తప్పుడు హామీ ఇవ్వడం వల్ల తాను ఓటమి పాలయ్యానన్నారు. ప్రస్తుతం ప్రజలకు కనువిప్పు కలిగిందని గత ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ వస్తున్నానన్నారు. ఎంపీ ఎస్ మునిస్వామి మాట్లాడుతూ పార్టీలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని, అందరం కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై సంపంగి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆప్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

శ్రీనివాసపురం: శ్రీనివాసపురం నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా డాక్టర్ వై వి వెంకటాచల నామినేషన్ పత్రాలను మంగళవారం దాఖలు చేశారు. ఉదయం పట్టణంలోని వినాయక ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రగా తాలూకా కార్యాలయానికి చేరుకుని ఆయన భార్య డాక్టర్ శుభతో కలిసి నామినేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆప్ కార్యకర్తలు డాక్టర్ వెంకటాచల పరంగా నినాదాలు చేశారు. నామినేషన్ అనంతరం మాట్లాడిన ఆయన అవినీతి నిర్మూలన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆప్ అభ్యర్థులను గెలిపించాలన్నారు.



శ్రీనివాసపురంలో నామినేషన్ దాఖలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి వెంకటాచల

తిగళర సముదాయంపై నిర్లక్ష్యం

కోలారు: రాజకీయ పార్టీలు తిగళర సముదాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని జిల్లా తిగళర జనాంగ సమన్వయ సమితి ప్రధాన కార్యదర్శి ఫల్గుణ అన్నారు. మంగళవారం నగరంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఎల్.ఎ.మంజునాథ్, మాలూరులో బీజేపీలో హూడి విజయకుమార్‌లు ఎన్నో యేళ్లుగా పార్టీలకు సేవ చేస్తున్నా వారికి ఆయా పార్టీల్లో టికెట్ దక్కలేదన్నారు. కోలారులో మాజీ సీఎం సిద్దరామయ్య పోటీ చేయకుంటే తిగళర సముదాయానికి ప్రాధాన్యతనివ్వాలని కోరినా తమ డిమాండ్‌ను పట్టించుకోలేదన్నారు. తమ సముదాయానికి మోసం చేసిన పార్టీలకు గుణపాఠం చెప్పడానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. అనంతకుమార్, నారాయణస్వామి, రఘునాథ్, ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫల్గుణ

సంక్షేమ పాలనలో విఫలం

శ్రీనివాసపురం: గత పదేళ్లలో ఎస్సీ, ఎస్టీ పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలం అయ్యారని మాజీ ఎమ్మెల్యే జి కె వెంకట శివారెడ్డి తెలిపారు. మంగళవారం తాలూకాలోని కోరిగేపల్లిలో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పేదల కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించకపోవడం వల్ల అవి వెనక్కుమళ్లాయన్నారు. తాను ఎన్నికల్లో గెలిచిన తరువాత సంక్షేమ పథకాలను పేదల ఇంటి ముంగిటకు తీసుకువెళ్లి అందిస్తానన్నారు. కార్యకర్తలు సిపాయిల్లా పని చేసి జేడీఎస్‌ని గెలిపించాలని కోరారు. జేడీఎస్ పంచరత్న పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇదే సమయంలో ముదిమడుగు గ్రామ పంచాయతీలోని 32 కుటుంబాలు కాంగ్రెస్‌ను వీడి జేడీఎస్‌లో చేరాయి.

క్లుప్తంగా

సర్వజ్ఞనగరలో కేజే జార్జ్ నామినేషన్



జార్జ్‌ను భారీమాలతో సన్మానిస్తున్న అభిమానులు

శివాజీనగర: రాజధాని బెంగళూరు నగరంలోని సర్వజ్ఞనగర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కే.జీ. జార్జ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. శివాజీనగర సెప్పింగ్ రోడ్డులో ఉన్న శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి వేలాది మంది కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ ఎన్నికల్లో సైతం ప్రజలు మరోసారి అవకాశం కల్పిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి కే.జే. జార్జ్‌ను కాంగ్రెస్ నాయకులు భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కే.జే.జార్జ్ తనయుడు రాణా జార్జ్, బ్లాక్ అధ్యక్షుడు రఘు, స్థానిక కాంగ్రెస్ నాయకులు జీ.రాజేంద్ర, శరవణ, ఎం.కే.ఫయాజ్, విల్ఫ్రేడ్.ఎస్. నెల్సన్ ఆర్.వేలు, మాజీ కార్పొరేటర్ రమేశ్ కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.62 లక్షలు సీజ్

తుమకూరు: సోమవారం రాత్రి 8 గంటల సమయంలో తుమకూరు నగరంలోని జాస్ టోల్ దగ్గర చెక్‌పోస్ట్‌లో అధికారుల తనిఖీలలో ఒక కారులో తరలిస్తున్న రూ. 2.62 లక్షల నగదు దొరికింది. సుధీర్ అనే వ్యక్తి తన కారులో నగదు తీసుకుని వస్తుండగా తనిఖీలలో దొరికింది. నగదుకు ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

దివ్యాంగుడి హత్య

దొడ్డబళ్లాపురం: దివ్యాంగుడిని కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన దొడ్డ తాలూకా దొడ్డబెళవంగల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దొడ్డ తాలూకా బొమ్మనహళ్లి నివాసి వెంకటప్ప (50) హతుడు. బైరాపుర తండా గేట్ వద్ద వెంకటప్పను దుండగులు కత్తితో పొడిచి హత్య చేసారు. వెంకటప్ప అనాథగా పోలీసులు తెలిపారు. ఇలాంటి వ్యక్తిని ఎందుకు హత్య చేసారో అంతుచిక్కడంలేదు. దొడ్డబెళవంగల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పుట్టస్వామిగౌడ



గౌరిబిదనూరు: తాలూకాలో కొన్నేళ్లుగా సమాజ సేవ చేస్తున్న పుట్టస్వామిగౌడ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 20న మరోసారి అభిమానులతో కలిసి నామినేషన్ వేస్తానని పుట్టస్వామి గౌడ తెలిపారు. నామినేషన్ కార్యక్రమంలో మాజీ జెడ్పీ అధ్యక్షుడు హోసూరు మంజునాథ్, మాజీ కొచిముల్ అధ్యక్షుడు కాంతరాజు, సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు దక్షిణలో ఆర్‌కే.రమేశ్ నామినేషన్



ప్రమాణ పత్రం చదువుతున్న ఆర్కే రమేశ్

బనశంకరి: బెంగళూరు దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్ వేలాది మంది కార్యకర్తలతో కలిసి మంగళవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం వసంతపుర వసంతవల్లభరాయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓపెన్‌టాప్ వాహనంలో ఊరేగింపుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌కే.రమేశ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని చెప్పారు. బెంగళూరు దక్షిణ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీటీఎం లేఔట్ నుంచి రామలింగా రెడ్డి



బొమ్మనహళ్లి: ఎమ్మెల్యే రామలింగా రెడ్డి మంగళవారం బీటీఎం లేఔట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు ఆయన కోరమంగళలో ఉన్న గణేష్ దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాది మంది మద్దతుదారులతో కలిసి కోరమంగళలోని ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఆయన వెంట భార్య చాముండేశ్వరి, మాజీ మేయర్ మంజునాథ్ రెడ్డి, హరీష్‌రెడ్డి, ప్యాట్రిక్ రాజులు ఉన్నారు.

ప్రియుడే హంతకుడు

- మహిళ హత్యకేసును ఛేదించిన పోలీసులు



అరెస్టయిన నిందితుడు శ్యామ్ ప్రసాద్, హతురాలు మంజుల

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడులో రెండు రోజుల క్రితం హత్యకు గురైన మహిళ కేసును నంజనగూడు పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మళవళ్లికి చెందిన శ్యామ్‌ప్రసాద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. హతురాలిని కనకపురకు చెందిన మంజుల (40)గా గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు... మంజుల మహాదేవచారి భార్య భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రైవేట్ పరిశ్రమలో పనిచేసే మంజులకు శ్యామ్ ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం నెలకొంది. విషయం తెలుసుకున్న మంజుల భర్త ఇద్దరిని తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో శ్యామ్ ప్రసాద్ తాను మంజులకు రూ. 3 లక్షలు అప్పు ఇచ్చానని, అప్పు తిరిగి ఇచ్చేస్తే వెళ్లిపోతానని చెప్పాడు.

ఆలయం వద్దకు పిలిచి హత్య :
ఈనెల 8న మంజుల ఆలయానికి వచ్చింది. అక్కడికి వచ్చిన శ్యామ్ ప్రసాద్ ఆమెతో గొడవకు దిగాడు. తీసుకున్న అప్పు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆవేశంతో మంజులను శ్యామ్ ప్రసాద్ హత్య చేసి పారిపోయాడు. భార్య రాకపోవడంతో ప్రియుడితో కలిసి వెళ్లిపోయిందని భర్త పట్టించుకోలేదు. ఈనెల 15న భార్య హత్యకు గురైన విషయం తెలుసుకుని, ప్రియుడే హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మైసూరు: మైసూరు నగరంలోని ఇర్విన్ రోడ్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముల విరాట్‌తో పాటు ఉత్సవ మూర్తికి ప్రధాన అర్చకులు విద్వాన్ కృష్ణమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

బీజేపీ అభ్యర్థి భారీ రోడ్‌షో



ర్యాలీగా వెళుతున్న దృశ్యం

చింతామణి: చింతామణి బీజేపీ అభ్యర్థిగా వేణుగోపాల్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆజాద్‌చౌక్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తాలూకా కార్యాలయం చేరుకుని అక్కడ నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి, వాణి కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శిగ్గాంవికి సుదీప్

యశవంతపుర: హావేరి జిల్లా శిగ్గాంవి నుంచి సీఎం బసవరాజ బొమ్మై బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. దీంతో శిగ్గాంవికి నటుడు కిచ్చ సుదీప్ సీఎంకు మద్దతుగా వెళ్లనున్నారు. నామినేషన్ పర్వం ముగిసిన తరువాత పార్టీ తరపున సుదీప్ ప్రచారం చేసే అవకాశం ఉంది.

లోకాయుక్త దాడి

బనశంకరి: శాంతినగరలోని దేవరాజ్ అరసు ట్రక్ టెర్మినల్స్ కార్యాలయంపై మంగళవారం లోకాయుక్త అధికారులు అకస్మికంగా దాడి చేశారు. సోదాలు చేపట్టిన అధికారులు ఫైళ్లను పరిశీలించారు. నకిలీ రికార్డులు సృష్టించి కోట్లా దిరూపాయలు బిల్లులు మంజూరు చేసిన ఆరోపణలతో లోకాయుక్త అధికారులు దాడి చేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

బనశంకరి: కుమారస్వామి లేఔట్ వసంతనగర సమీపంలో పూర్తిగా కాలిపోయిన స్థితిలో వ్యక్తి శవం లభ్యమైంది. మూడురోజుల క్రితం ఈ ఘటన చోటుచేసుకోగా మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

సోమణ్ణ ఎన్నికల ప్రచారం

మైసూరు: వరుణ నియోజకవర్గంలో మాజీ సీఎం సిద్ధరామయ్యపై పోటీకి దిగిన మంత్రి సోమణ్ణ ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతక ముందు ఆయన బసవన్న విగ్రహానికి పూజలు చేసి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. మరికొన్ని చోట్ల రోడ్ షో నిర్వహించారు. ఆయన వెంట ఎంపీ ప్రతాప్ సింహ ఉన్నారు. అభిమానులు భారీ యాపిల్ పూల దండ వేసి స్వాగతం పలికారు.

తుమకూరులో బీజేపీ అభ్యర్థుల జోరు



నగరంలో రోడ్ షో నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థులు

తుమకూరు: తుమకూరు నగర నియోజకవర్గంతో పాటు తుమకూరు గ్రామీణ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థులు ఒకేసారి నామినేషన్ దాఖలు చేశారు. తుమకూరు నగర నుంచి జ్యోతిగణేశ్, తుమకూరు గ్రామీణ నుంచి సురేశ్ గౌడ నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోని అశోక్ రోడ్డులో భారీ ఊరేగింపుగా తాలూకా కార్యాలయం చేరుకున్న ఇద్దరు అక్కడ వేర్వేరుగా నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ బసవరాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రవి శంకర్‌తో పాటు వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీ సహా పలువురు బదిలీ

శివాజీనగర: విధుల్లో నిర్లక్ష్యం కారణంగా డీఎస్పీతో పాటు ఆరుగురు అధికారులపై బదిలీ వేటు పడింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వీరిని బదిలీ చేశారు. సురపుర డీవైఎస్పీ మంజునాథ్, సీపీఐ ఆనంద్ వాగ్మోడ్, మరో నలుగు అధికారులను బదిలీ చేశారు. దేవదుర్గతో పాటుగా పలుచోట్ల అల్లర్లను నియంత్రించటంలో విఫలమైన నేపథ్యంలో బదిలీ చేసినట్లు తెలిసింది.

దాడికి యత్నించారు

యశవంతపుర: నామినేషన్‌కు వెళ్లిన సమయంలో తన కారుపై రాళ్ల దాడి జరిగినట్లు గదగ బీజేపీ అభ్యర్థి అనిల్ మెణసినకాయి ఆరోపించారు. మంగళవారం ఆయన గదగలో విలేకర్లతో మాట్లాడుతూ తాము నామినేషన్ వేసి వెనుతిరుగుతున్న సమయంలో కొందరు తన కారుపై ఉమ్మివేశారని, ప్రశ్నించిన కార్యకర్తలపై దాడి చేయటంతో పాటు కారుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడానికి యత్నించిన్నట్లు అనిల్ మెణిసినకాయ ఆరోపించారు.

హెబ్బాళ బీజేపీ టికెట్ దక్కించుకున్న కట్టా



బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో బీ ఫారమ్ అందుకొంటున్న కట్టా జగదీశ్

శివాజీనగర: బెంగళూరు హెబ్బాళ బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్యనాయుడు తనయుడు కట్టా జగదీశ్‌కు బీజేపీ హైకమాండ్ టికెట్ ఖరారు చేస్తూ సోమవారం రాత్రి బీజేపీ అభ్యర్థుల మూడో జాబితాలో ప్రకటించారు. బెంగళూరు నగరంలోని హెబ్బాళ్, గోవిందరాజనగర, మహాదేవపుర నియోజకవర్గాల అభ్యర్థుల టికెట్‌లు ప్రకటించకుండా రహస్యంగా ఉంచారు. అయితే రాజకీయ చాణిక్యుడు కట్టా సుబ్రమణ్య నాయుడు తన కుమారుడికి టికెట్ దక్కించుకోవటంలో విజయం సాధించారు. మంగళవారం స్థానిక బీజేపీ నాయకులతో కలసి పార్టీ కార్యాలయంలో బీ ఫారమ్ అందుకొన్న కట్టా జగదీశ్, నేరుగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ సీఎం బీ.ఎస్.యడియూరప్పను కలసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే భైరతి సురేశ్ ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

జై మహాభారత్ పార్టీ అభ్యర్థుల జాబితా

శివాజీనగర: రాష్ట్రంలో సార్వత్రిక విధానసభ ఎన్నికల్లో జై మహాభారత్ పార్టీ నుంచి పోటీచేసే 22 మంది అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అనంత విష్ణు ప్రకటించారు. మంగళవారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 22 మందితో కూడి తొలి జాబితాను ప్రకటించారు. ముళబాగిలు నియోజకవర్గం నుంచి పొన్నయ్య ఏ.కే. పద్మనాభనగర-ఆర్.నాగేశ్, చెన్నపట్టణ-లోకేశ్ కే.హెచ్, విజయనగర-విజయకుమార్ ఎస్., కే.ఆర్.పురం-ఎం.శోభ, దేవనహళ్లి-గంగమ్మ, పావగడ-నరసింహమప్ప, మధుగిరి-వెంకటేశ్, జయనగర-సునీల్ యాదవ్, బసవనగుడి-ప్రదీప్ జీ, బాదామి-ఎల్.సీ.పాటిల్, గుబ్బి-ఉమేశ్, రామదుర్గ-ఎస్.డీ.ముజావార్, శివమొగ్గ-ముమ్తాజ్ బేగం, మండ్య-హెచ్.కే.శశిరేఖ, మహాదేవపుర-మంజునాథ్.

శిడ్లఘట్టలో జోరుగా నామినేషన్లు

శిడ్లఘట్ట: చిక్కబళ్లాపురం జిల్లా శిడ్లఘట్ట నియోజకవర్గంలో మంగళవారం ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. శిడ్లఘట్టలో జేడీఎస్ పార్టీ నుంచి మేలూరు రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నుంచి రాజీవ్‌గౌడ, ఈయనకు పార్టీ బీఫారం ఇవ్వకపోయినా నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థిగా సీకల్ రామచంద్రగౌడ నామినేషన్ దాఖలు చేశారు.

బీజేపీపై సిద్దు విసుర్లు

మైసూరు: మైసూరు కేఆర్ నియోజకవర్గం టికెట్ రాని బీజేపీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రామదాసుకు కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య ఆహ్వానం పలికారు. మంగళవారం మైసూరు మండకళ్లి విమానాశ్రయంలో వద్ద మీడియాతో సిద్ధరామయ్య మాట్లాడుతూ బీజేపీలో సీనియర్‌లకు విలువ లేదని, తీవ్రంగా అవమానిస్తున్నారని అన్నారు. ఇదే వరుసలో ఉన్న రామదాసు కూడా కాంగ్రెస్‌లోకి రావాలని, ఆయనకు మంచి స్థానం కల్పిస్తామని అన్నారు. కాగా, తన నియోజకవర్గం వరుణలో పోటీ చేయడం మంత్రి సోమన్నకు ఏమాత్రం ఇష్టం లేదని, బీజేపీ హైకమాండ్‌ను కాదనలేక పోటీ చేస్తున్నారని, దీనికంతటికీ కారణం ఆ పార్టీ నేత బీఎల్ సంతోష్ అని అన్నారు.

నేరాలను అరికట్టాలి

అమరాపురం: మండలంలో అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చూడాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పోలీసులకు సూచించారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మాట్కా, గుట్కా, పేకాట, అక్రమ మద్యం తదితర వాటని పూర్తిగా నిర్మూలించాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా మండలం పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉందని దీంతో అధికంగా కర్ణాటక నుంచి అక్రమ మద్యం సరాఫరా కాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.

చివరి వరకు బీజేపీలోనే ఉంటా

మైసూరు: తనకు కేఆర్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఇవ్వకపోవడం బాధ కలిగించిందని కేఆర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎస్.ఎ. రామదాసు అన్నారు. మంగళవారం ఆయన తన మద్దతుదారులతో చర్చించి మాట్లాడుతూ... పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తామని, తన ప్రాణం ఉన్నంత వరకు బీజేపీలోనే కొనసాగుతాన్నారు. ప్రధాని మోదీ ఉన్న బాంధవ్యం ఎప్పటికి కొనసాగుతుందన్నారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం



మైసూరు: వ్యవసాయ రంగంలో రాణించిన ఎ.పి. చంద్రశేఖర్‌కు గదగ గ్రామీణ వి.వి. గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. మైసూరు నగరంలోని హెచ్.డి.కోటె రోడ్డులో ఉన్న కళలవాడి ఉన్న ఇంద్రప్రస్థ తోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గదగ గ్రామీణ వి.వి. ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌కు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో చాన్స్‌లర్ డాక్టర్. విష్ణుకాంత చటపల్లి, వి.వి అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి పూజలు

బొమ్మనహళ్లి: నగరంలో బొమ్మనహళ్లి అభ్యర్థి, బీజేపీ ఎమ్మెల్యే ఎం,.సతీష్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి ఆశ పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. సామసంద్రపాళ్యలో ఉన్న గురుమూర్తి స్వామి ఆలయంలో మాలా శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ప్రచారానికి నాంది పలికారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో శ్రీనివాస్‌రెడ్డి, మురళిధర్ రెడ్డి, నవీన్, సంతోష్, పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

మంజుల లింబావళి నామినేషన్



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే అరవింద లింబవళి భార్య మంజుల మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. టికెట్ కేటాయింపు ఎంతో ఉత్కంఠగా నిలిచి చివరికి ఎమ్మెల్యే అరవింద లింబావళి భార్యకు కేటాయించారు. దీంతో లింబావళి భార్య మంజులతో కలిసి తన మద్దతుదారులతో కలిసి బీఈఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

కేఆర్‌పురం నుంచి బైరతి బసవరాజు
నగరంలోని కృష్ణరాజపురం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే, మంత్రి బైరతి బసవరాజు తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ వేశారు. మంగళవారం ఉదయం ఆయన వేలాది మంది కార్యకర్తలతో బీబీఎంపీ కార్యాలయం చేరుకుని ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

హోసూరు వార్తలు..

ఆక్రమణల్ని తొలగించాలి

హోసూరు: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ప్రజలకు ఇబ్బంది కల్పిస్తున్నారని, ఆక్రమణలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని ఎర్రండపల్లి గ్రామం వద్ద కావేరిపట్టణం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకొని షాపులు పెట్టుకున్నారు, ప్రజలు అటు ఇటు తిరగడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఆ ప్రాంతంలో నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతున్నాయని, అధికారులు ఆక్రమణలను తొలగించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కబ్జా గోడను కూల్చిన ప్రజలు

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా నల్లగానకొత్తపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆలయ భూమిని ఆక్రమించుకొని ప్రహరీ ఏర్పాటు చేసుకోవడంతో ఆవేశానికి గురైన గ్రామస్థులు ప్రహరీ గోడను పడగొట్టారు. సూళగిరి సమీపంలోని నల్లగానకొత్తపల్లి గ్రామంలో ఆలయ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేయగా, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు క్రిష్ణగిరి కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆక్రమణదారుడు ప్రహరీ కట్టుకోగా, గ్రామస్థులు మూకుమ్మడిగా దాడి చేసి గోడను ధ్వంసం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

వలస కూలి దారుణహత్య

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో బిహార్ యువకుడు సోమవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. హతుడు వికాస్ కుమార్ (21), మరో ఇద్దరితో కలిసి పారిశ్రామికవాడ చిన్న యలసగిరిలో ఇద్దె గదిలో నివాసముంటూ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అతడు తీవ్ర గాయాలతో చనిపోయి ఉండడం స్థానికుల కంటపడింది. సిఫ్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా శవాన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతనితో పాటు నివసించే మరో ఇద్దరు వ్యక్తులు వికాస్‌కుమార్‌ను హత్య చేసి పరారైనట్లు విచారణలో తెలిసింది.

ఉల్లి ధర తీవ్రంగా పతనం

= దిక్కుతోచని రైతులు



ఓ పొలంలో పూతకొచ్చిన ఉల్లి పంట

కెలమంగలం: గత కొద్ది రోజులుగా ఉల్లి ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డెంకణీకోట తాలూకా కెలమంగలం పట్టణ పంచాయతీకి చెందిన రైతు మునియప్ప ఎకరా పొలంలో చామంతి సాగు చేస్తూ, అంతరపంటగా ఉల్లిగడ్డల పంట సాగు చేశాడు. గత ఏడాది కిలో ఉల్లి రూ. 100 వరకు ధర పలికింది. ప్రస్తుతం కిలో ఉల్లి రూ. 10 కి క్షీణించడంతో రైతులకు దిక్కు తోచడం లేదని వాపోయారు. పంట కోసి మార్కెట్‌కు తరలిస్తే రైతులకు కూలి డబ్బులు కూడా రావని, ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు.


ప్రైవేట్ ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన



డాక్టర్లతో గొడవపడుతున్న సవిత కుటుంబ సభ్యులు

హోసూరు: సంతోనోత్పత్తి కోసం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన మహిళ పిండాన్ని ఆస్పత్రి యంత్రాంగం విక్రయించారని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబం డాక్టర్లపై వాగ్వివాదానికి దిగారు. హోసూరు సమీపంలోని దిన్నూరు ప్రాంతానికి చెందిన సప్తగిరి భార్య సవిత. ఈ దంపతులకు సంతానం లేకపోవడంతో పట్టణంలోని ప్రైవేట్ సంతానోత్పత్తి కేంద్రాన్ని ఆశ్రయించారు. గత నవంబర్ నెల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రూ. 3.50 లక్షల వరకు ఖర్చు పెట్టారు. సంతానోత్పత్తి కోసం దంపతుల వద్ద ఆస్పత్రి డాక్టర్లు ఇరువురి వద్ద శుక్రకణాలను, అండాన్ని సేకరించి 13 పిండాలను ఉత్పత్తి చేశారు. వీటిలో మూడు గుడ్లు ఆరోగ్యకరంగా ఉన్నాయని, గత నెల 22వ తేదీ సవిత గర్భాశయంలోనికి ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం చికిత్సకెళ్లగా గర్భాశయంలోకి పంపిన పిండం ఉత్పత్తి కాలేదని తెలిసింది. దీంతో మిగిలిన పిండాన్ని ప్రవేశించాలని కుటుంబస్థులు కోరగా లేదని తెలుపడంతో ఇతరులకు విక్రయించారని ఆరోపిస్తూ డాక్టర్లపై గొడవలకు దిగారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో కొద్ది సేపు ఉద్రిక్తతకు దారి తీసింది.

క్రషర్ ఏర్పాటుపై గ్రామస్తుల వ్యతిరేకత



క్రషర్లలో పేలుళ్ల వల్ల భవనాల్లో వచ్చిన చీలికలు

హోసూరు: హోసూరు సమీపంలో గ్రామం పక్కనే ప్రైవేట్ క్రషర్ ఏర్పాటును గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు. హోసూరు సమీపంలోని కొత్తూరు, దిన్నూరు మధ్య ఇప్పటికే ఎక్కువ క్రషర్‌లు నిర్వహిస్తున్నారు. ఈ క్రషర్‌ల నిర్వహణ కోసం బండలను పగులగొట్టేందుకు ఎక్కువ సామమర్థ్యంతో పేలుడు పదార్థాలను ఉపయోగించి బాంబులు పేల్చడంతో గ్రామంలో కట్టడాలు కదలడంతో పాటు చీలికలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న క్రషర్‌లను మూసివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మరో క్రషర్ ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ద్వారా అనుమతి కోసం దరఖాస్తు అందజేశారని, బుక్కసాగరం ప్రాంతంలో నిర్వహిస్తున్న క్రషర్‌ల వల్ల సమీపంలోని కోళ్ల ఫాంలో పనిచేస్తున్న 40 మంది కూలీలు తీవ్ర ఇబ్బందులెదుర్కొనడంతో పాటు కోళ్ల ఫాంలో పెంచుతున్న కోళ్లు పేలుడు శబ్దాలకు చనిపోతున్నాయని, దీనివల్ల కోళ్ల ఫాం నిర్వాహకులకు నష్టపోతున్నారు. వీరితో పాటు ఆ ప్రాంతంలో నివాసముంటున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు దుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు కొత్తగా క్రషర్ ఏర్పాటుకు అనుమతివ్వరాదని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

28న రైతు సమస్యలపై స్పందన

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో ఏప్రిల్ 28వ తేదీ రైతుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకారం జరుగుతుందని, ఫిర్యాదులు అందజేసి పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ జేకప్ తెలిపారు. ప్రతి నెలా ఆఖరి శుక్రవారం రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు అందజేసే ఫిర్యాదులపై తక్షణమే పరిశీలించి పరిష్కరిస్తున్నామని, 28వ తేదీన అందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనువిందుగా జ్యోతుల వేడుక



జ్యోతులు ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో మంగళవారం సాయంత్రం అర్చకుల కుటుంబస్తులు వైభవంగా జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయాన్నే బియ్యపు పిండితో చేసిన జ్యోతులను ఎత్తుకుని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తరలివచ్చారు. కొల్హాపురి మహాలక్ష్మీ దేవి, కాళికాంబ కామటేశ్వరస్వామితో పాటు మారెమ్మదేవి ఆలయాలకు ప్రదక్షిణలు చేసి జ్యోతులు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తజనం తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

ఉత్సాహంగా నామినేషన్ల దాఖలు



అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సీకే.రామమూర్తి తదితరులు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సుధాకర్

తుమకూరు: తుమకూరు జిల్లా గుబ్బి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్ఆర్ శ్రీనివాస్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం వేలాది మంది కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. జేడీఎస్ ఎమ్మెల్యేగా ఉన్న ఈయన ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఇచ్చిన హామీ మేరకు బీఫారం ఇవ్వడంతో అట్టహాసంగా నామినేషన్ వేశారు.

తిపటూరులో డీకేశి: తుమకూరు జిల్లా తిపటూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న కే.షడక్షరి మంగళవారం తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ వేశారు. ఆయనకు మద్దతుగా కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్, మాజీ డీసీఎం పరమేశ్వర్ ఉన్నారు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్
బనశంకరి: గోవిందరాజనగర బీజేపీ అభ్యర్థి కే.ఉమేశ్‌శెట్టి అట్టహాసంగా నామినేషన్ వేశారు. మంగళవారం భారీ ఎత్తున బీజేపీ కార్యకర్తలతో బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వీసూర్య, అరుణ్‌సోమణ్ణ తదితరులతో ర్యాలీగా నాగరబావి పాలికె ఆఫీసులో నామినేషన్ పత్రాలను అందజేశారు. బీజేపీ నేతలు నెల నరేంద్రబాబు, విశ్వనాథ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక
పద్మనాభనగర నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత ఎంసీ.రాజణ్ణ మంగళవారం రెవెన్యూ మంత్రి ఆర్.అశోక్ సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ డిప్యూటీ మేయర్ ఎల్.శ్రీనివాస్, బీబీఎంపీ మాజీ విపక్షతనేత ఏహెచ్.బసవరాజ్, మాజీ కార్పొరేటర్ హెచ్.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జయనగర నుంచి రామమూర్తి
బనశంకరి: జయనగర బీజేపీ అభ్యర్థి సీకే.రామమూర్తి మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి బీడీఏ కాంప్లెక్స్‌లో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట మాజీమేయర్ ఎస్‌కే.నటరాజ్, మంత్రి ఎస్‌టీ.సోమశేఖర్, ఎంపీ తేజస్వీసూర్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా సుధాకర్ నామినేషన్
చింతామణి: చింతామణి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంసీ సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నామినేషన్ దాఖలు చేశారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల/తిరుపతి తుడా: తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,828 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.5.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు ఉన్నవారికి సకాలంలో, లేనివారికి 10 గంటల్లో, ఎస్‌ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధా నారాయణమూర్తి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

స్విమ్స్‌కు కరూర్ వైశ్యా బ్యాంక్ విరాళం



సదా భార్గవికి బ్యాటరీ వాహనం తాళాన్ని అందజేస్తున్న కరూర్ వైశ్య బ్యాంక్ సీఈవో

కరూర్ వైశ్యా బ్యాంక్ యాజమాన్యం స్విమ్స్ ఆసుపత్రికి భారీ విరాళాన్ని అందజేసింది. టీటీడీ జేఈవో సదా భార్గవి చేతుల మీదుగా మంగళవారం బ్యాటరీ వాహనాలు, నీటి శుద్ధి యంత్రాలు మొత్తం రూ.71 లక్షల విలువ గల వాటిని బ్యాంక్ సీఈవో రమేష్ బాబు మరో దాత మీనా హేమచంద్ర అందించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వైద్యాధికారులు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆహ్వానం' లక్ష్మి ఇకలేరు



తెనాలి: ప్రముఖ రచయిత, ఆహ్వానం మాసపత్రిక సంపాదకురాలు సమయం సామ్రాజ్యలక్ష్మి (74) హఠాన్మరణం చెందారు. ఆహ్వానం లక్ష్మిగా, ఎస్ఎస్ లక్ష్మిగా సాహితీ ప్రపంచానికి చిరపరిచితులైన లక్ష్మి, కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. కార్డియాక్ అరెస్టుతో సోమవారం మృతి చెందారు. దివంగత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామారావు ఆమె భర్త. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మెట్రిక్యులేషన్ మాత్రమే పూర్తిచేసిన లక్ష్మికి సాహిత్యంపై ఎనలేని అభిమానం. 'కళాతపస్వి' సంజీవదేవ్‌తో లేఖాసాహిత్యం చేశారు. సంజీవదేవ్‌పై అభిమానంతో తన కుమారుల్లో ఒకరికి ఆయన పేరు పెట్టారు. చలం సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. సాహిత్య కార్యక్రమాల్లో మునిగితేలుతూ 'భారతి' పత్రిక స్థాయిలో సాహిత్య పత్రికను తీసుకురావాలనే తలంపుతో విజయవాడ కేంద్రంగా 'ఆహ్వానం' మాసపత్రికను స్థాపించారు. విజయవాడలోని రుద్రభూమిలో మంగళవారం లక్ష్మి అంత్యక్రియలు పూర్తిచేసినట్లు సోదరుడు బీజేఆర్‌కే తెలియజేశారు.

శరవేగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి

నేడు రూ.4 వేల కోట్లతో నిర్మించే మూలపేట పోర్టుకు సీఎం శంకుస్థాపన

- ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇదొక చారిత్రాత్మక ఘట్టం
- 2025 కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టులో తొలి విమానం
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ప్రభుత్వం వ్యతిరేకం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలకు మేలు జరిగేలా శ్రీకాకుళంలో బుధవారం రూ.4 వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణంతో పాటు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, హిరమండలంలో వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రి మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో బుధవారం చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరగబోతోందని, పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న చర్యలు సఫలీకృతం కాబోతున్నాయని చెప్పారు. మూలపేట పోర్టు తొలిదశలో రూ.3000 కోట్లతో నాలుగు బెర్తులను నిర్మిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం భావనపాడు పోర్టు నిర్మిస్తామని మోసం చేసిందని, కానీ సీఎం జగన్ పోర్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీని వాస్తవ రూపంలోకి తెస్తున్నారని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తికావొస్తోందని, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రూ.170 కోట్లతో మరో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్నట్లు తెలిపారు. మూలపేట పోర్టు, సిక్స్ లేన్ల హైవే నిర్మాణం పూర్తయితే శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. బందరు, రామాయపట్నం పోర్టుల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రామాయపట్నం పోర్టుకు ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది జనవరిలో తొలి నౌక వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో వచ్చిన ఎంవోయూలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాలుస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే 99 సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వమే నడపాలి

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదన్నదే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు. ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మికులు చేపడుతున్న ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తుందన్నారు. నష్టాల్లో ఉన్న అనేక పరిశ్రమలను నడుపుతున్న కేంద్ర ప్రభుత్వం.. స్టీల్ ప్లాంట్‌ను నడపడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్రం, దాన్ని కొంటామంటూ తెలంగాణ ప్రభుత్వం విశాఖలో అలజడి సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

3న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన

రూ. 3,500 కోట్లతో నిర్మించే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వచ్చే నెల 3న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని మంత్రి చెప్పారు. 2025 సంవత్సరం నాటికి మొదటి విమానం భోగాపురం ఎయిర్‌పోర్టులో దిగాలన్నదే సీఎం ఆకాంక్ష అని చెప్పారు.

ఆక్వా రంగానికి ప్రభుత్వం అండ

అప్సడా వైస్ చైర్మన్ రఘురామ్



మాట్లాడుతున్న వడ్డి రఘురామ్

సాక్షి, భీమవరం: ఆక్వా రంగానికి ప్రభుత్వం అండగా నిలవడం వల్లే నేడు ఆక్వా రైతులు ఆనందంగా ఉన్నారని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అన్నారు. ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆక్వా రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్డి రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.65 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగుచేస్తుండగా, 64వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిలో 46 వేల కనెక్షన్లకు సబ్సిడీ వర్తిస్తోందని చెప్పారు. ప్రభుత్వంపై అధిక భారం పడుతున్నా రైతులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ సబ్సిడీని అమలు చేస్తున్నారని వివరించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అప్సడాను ఏర్పాటు చేసిందన్నారు. కరోనా సమయంలో సైతం సీఎం జగన్ ఆక్వా రైతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లే ఆక్వా రంగం నిలదొక్కుకుందన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదిరాజు వెంకటసుబ్బరాజు మాట్లాడుతూ ఆక్వా రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి తామంతా ఎంతగానో రుణపడి ఉంటామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నంబూరి గజపతిరాజు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా జాయింట్ సెక్రటరీ రుద్రరాజు యువరాజు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో వెళ్తున్న ట్రక్కును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

ఒకరి మృతి, 9 మందికి గాయాలు



వాగులోకి వెళ్లిపోయిన బొలేరో ట్రక్కు

కురిచేడు: కూలీలతో వెళుతోన్న ట్రక్కును వెనుకవైపు నుంచి ప్రైవేట్ ట్రావెట్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా 9 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ప్రకాశం జిల్లా కురిచేడు మండలం వెంగాయపాలెం వద్ద మంగళవారం జరిగింది. రాజమండ్రి, జడ్డంగి, ఏలేశ్వరం ఏబీ కాలనీకి చెందిన 15 కుటుంబాలకు చెందినవారు 5 నెలల క్రితం పొగాకు తోటల్లో కంకులు కోసేందుకు వచ్చారు. వీరు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం నరసాయపాలెం పోలేరమ్మ గుడివద్ద తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రోజులాగే మంగళవారం మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామ రైతులు తమ ట్రక్కులో కూలీలను తీసుకువెళుతున్నారు. మరికాసేపట్లో మెయిన్ రోడ్డులో దిగుతారనగా ట్రక్కును కే కావేరి బస్సు వెనుక వైపు నుంచి బలంగా ఢీకొంది. దీంతో ట్రక్కు వాగులోకి పడిపోయింది. ఈ ఘటనలో 10 మందికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వైద్యశాలకు తరలించగా లింగం నాగేశ్వరరావు (55) వినుకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాద సమయంలో బస్సులోని ప్రయాణికులు కిటికీల నుంచి బయటకు దూకారు. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ఎస్ఐ దేవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంతమంది కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- చంద్రబాబు శిఖండి, పవన్ హైదరాబాద్ వాసి
- హరీష్ వస్తే అభివృద్ధి చూపిస్తాం
- గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్




మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

ఏలూరు (మెట్రో): ఎన్ని కుయుక్తులు పన్నినా.. ఎంతమంది కలిసి వచ్చినా.. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ సమీక్షలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు శిఖండిలా వ్యవహరిస్తూ గృహ నిర్మాణాలు సాగకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. సెల్ఫీ పిచ్చితో చంద్రబాబు పిల్ల చేష్టలు చేస్తున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లకు దమ్ముా, ధైర్యం ఉంటే రాష్ట్రంలోని కోటీ 60 లక్షల ఇళ్లకు రాగలరా... అని మంత్రి ప్రశ్నించారు. అభివృద్ధిని చూసేందుకు రాష్ట్రమంతా తిరగకపోయినా... కనీసం కుప్పం వచ్చినా తాము చేసిన అభివృద్ధిని చూపిస్తామని ఆయన సవాల్ చేశారు. చంద్రబాబుకు పవన్‌కళ్యాణ్ దత్తపుత్రుడని, ఆయన హైదరాబాద్ వాసిగా ఉంటూ అప్పుడప్పుడు ఆంధ్రాకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడి తోక పట్టుకుని చంద్రబాబు వేలాడుతున్నారని, కనీసం 175 స్థానాల్లో సైకిల్ గుర్తుపై అభ్యర్థులను నిలిపే దమ్ము చంద్రబాబుకు లేదని ఆయన ఎద్దేవాచేశారు. పవన్ కల్యాణ్‌కు 40, సీపీఐకి కొన్ని, సీపీఎంకు కొన్ని సీట్లు పంచే పనిలో చంద్రబాబు నిమగ్నమయ్యారన్నారు. తెలంగాణ మంత్రి హరీష్‌రావు వస్తే ఆంధ్రాలో అభివృద్ధి ఏం జరిగిందనేది చూపిస్తామని జోగి రమేష్ చెప్పారు.

ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు

రాష్ట్రంలోని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లు ఊళ్లను తలపిస్తున్నాయని మంత్రి జోగి రమేష్ చెప్పారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 17,005 జగనన్న కాలనీల్లో 30 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలంతోపాటు ఇళ్లు నిర్మించే అతి పెద్ద సంక్షేమ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు చౌకబారు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంపై బురద చల్లుతూ ఇళ్ల స్థలాలపై కోర్టుల్లో కేసులు వేస్తున్నారన్నారు. ఎన్ని ఆటంకాలు కలిగించినా రాష్ట్రంలో జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని సీఎం జగన్ ఒక యజ్ఞంలా చేపట్టారని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో నిర్దేశించిన సమయంలోగా జగనన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు.

వేడికి వానరం విలవిల



భానుడి భగభగకు మనుషులతో పాటు జంతువులు కూడా ఠారెత్తిపోతున్నాయి. కర్నూలు జిల్లాలో మంగళవారం అత్యధికంగా 45.62 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో డోన్ పట్టణ శివారులోని వెంకటనాయునిపల్లె వద్ద ఎండ వేడికి తాళలేక ఓ వానరం ఇలా చెట్టు తొర్రలో తల దాచుకుంది.

– డోన్(నంద్యాల)

కన్నడ కాషాయం కోటపై తిరుగు బావుటా

బలహీనపడుతున్న అధికార పార్టీ..	ప్రతిపక్ష పార్టీల వైపు టికెట్లు దక్కని సీనియర్ల చూపు	డేంజర్‌బెల్స్ మోగిస్తున్న రెబల్స్ బెడద



సాక్షి బెంగళూరు: కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా మారింది రాష్ట్ర బీజేపీ పరిస్థితి.. ఎన్నికల ప్రకటనకు ముందు ఉత్తరప్రదేశ్, గుజరాత్ తరహా మోడల్‌ను టికెట్ల పంపిణీలో అవలంబిస్తామని చెప్పిన బీజేపీకి ప్రస్తుతం వరుస నాయకులంతా పార్టీని వీడుతుండడంతో గుబులు పుట్టిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్, ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ సవది, ఎమ్మెల్యేలు నెహ్రూ ఓలేకార్, రామదాస్ తదితర అనేకులు బీజేపీని వీడి ఇతర పార్టీల్లో చేరారు. సొంత పార్టీ బీజేపీపైనే యుద్ధానికి సమరశంఖం పూరిస్తున్నారు. మరోవైపు అంది వచ్చిన పరిస్థితులను ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు అందిపుచ్చుకుంటున్నాయి. బీజేపీ రెబల్ ఎమ్మెల్యేలను తమ పార్టీల్లోకి ఆహ్వానిస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. వరుసగా నాయకులు పార్టీని వీడుతుండడంతో రెబల్స్ నేతలపై బీజేపీ దృష్టి సారించింది. మిగిలిన రెబల్స్ పార్టీని వీడకుండా చర్యలు తీసుకుంటున్నారు. టికెట్ ఆశించి భంగపడిన నేతలే ఎక్కువగా రెబల్స్‌గా బీజేపీకి తలనొప్పిగా మారుతున్నారు. లక్ష్మణ సవది, జగదీశ్ శెట్టర్‌కు టికెట్ ఇవ్వరనే విషయం కొన్ని రోజుల క్రితమే అందరికీ తెలుసు. అయితే వారిని పార్టీలో నిలబెట్టుకునేలా ఎవరూ ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. జనసంఘ్ కాలం నుంచే జగదీశ్ శెట్టర్ కుటుంబం బీజేపీలో ఉంది. ఆయనకు బీజేపీలో ఎన్నో పదవులు వరించాయి. అలాంటి సీనియర్ నేత పార్టీని వీడరనే అతి విశ్వాసం వల్లే టికెట్ నిరాకరించింది. కానీ తీరా ఇప్పుడు ఎంతో ప్రభావవంతమైన ఉత్తర కర్ణాటకకు చెందిన నాయకుడు పార్టీని వీడడంతో బీజేపీకి సీట్లు తగ్గుతాయనే బెంగ పట్టుకుంది.

గతంలో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప పార్టీలో పట్టు ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. పార్టీని వీడుతారనే అనుమానం ఉన్న నేతలతో మాట్లాడి వారిని బుజ్జగించడంలో యడియూరప్ప సఫలీకృతుడయ్యారు. అయితే తాజాగా ఏ నిర్ణయమైనా ఢిల్లీ అధిష్టానం నుంచి వస్తుండడంతో యడియూరప్ప కూడా ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. ఇక బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్ తానొక పార్టీ అధ్యక్షుడనే విషయమే మరిచిపోయినట్లు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీని నాయకులు వీడుతుంటే సాధారణంగా పార్టీ రాష్ట్రాధ్యక్షుడు అడుగులు ముందుకు వేసి వారితో మాట్లాడి బుజ్జగించాలి. అయితే నళిన్ కుమార్ కటీల్ అలాంటి ప్రయత్నాలేవీ చేయలేదు. మరోసారి డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఏర్పాటు చేయాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీకి ప్రస్తుతం ఈ రెబెల్స్ బెడద ప్రమాదకరంగా మారింది. రాష్ట్ర బీజేపీ చరిత్రలో అభ్యర్థుల జాబితా విడుదల తర్వాత ఇంతటి భారీ స్థాయిలో ఆగ్రహావేశాలు నాయకుల నుంచి రావడం ఇదే తొలిసారి. ఏప్రిల్ 20 వరకు నామినేషన్ల సమర్పణకు గడువు ఉంది. ఇప్పటికే సుమారు 16 నియోజకవర్గాల్లో బీజేపీకి రెబెల్స్ బెడద ఎదురయింది.

బీజేపీలో ఈసారి సీనియర్లకు ఉద్వాసన పలికి రాజకీయాల నుంచి వారికి విశ్రాంతి కల్పించాలనే ప్రయోగాన్ని అధిష్టానం చేపడుతోంది. ఇందులో భాగంగా మాజీ డీసీఎం కేఎస్ ఈశ్వరప్పకు టికెట్ నిరాకరించారు. అలాగే ఇతర సీనియర్ ఎమ్మెల్యేలు ఎస్ఏ రవీంద్రనాథ్, హాలాడి శ్రీనివాస శెట్టి పోటీ నుంచి తప్పుకున్నారు. మొదటి జాబితాలో టికెట్ దక్కకపోవడంతో సీనియర్లు అంగార, రఘుపతి భట్ విచారం వ్యక్తం చేసినప్పటికీ అనంతరం పార్టీ నిర్ణయానికి లోబడిపోయారు. మిగిలిన చోట్ల అలా జరగలేదు. మూడిగెరె నుంచి ఎంపీ కుమారస్వామి పార్టీ పెద్దలపై బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేసి జేడీఎస్ పార్టీలో చేరారు. అరసికెరె టికెట్ దక్కకపోవడంతో యడియూరప్ప సన్నిహితుడిగా పేరొందిన ఎన్ఆర్ సంతోష్ కూడా జేడీఎస్ వైపు వెళ్లిపోయారు. మరో సీనియర్ ఎమ్మెల్యే నెహ్రూ ఓలెకార్ కూడా తిరుగుబావుటా ఎగరవేశారు. తాజాగా కేఆర్ నియోజకవర్గం టికెట్ దక్కకపోవడంతో రామదాస్ జేడీఎస్ వైపు చూస్తున్నారు.

కాగా, ఎన్నో ఏళ్లుగా బీజేపీలో పాతుకుపోయి సీనియర్లుగా ఎదిగి అనేక పదవులు అనుభవించిన నేతలు ప్రస్తుతం ఎమ్మెల్యే టికెట్ కోసం పాట్లు పడుతున్నారు. యువ నేతలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో బీజేపీ పలువురు సీనియర్లకు చెక్ పెట్టింది. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో ఈ సీనియర్ల తిరుగుబావుటా వల్ల బీజేపీకి ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం లేకపోలేదు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో తరహాలోనే పూర్తిగా ఈసారి కూడా ప్రధాని నరేంద్రమోదీ మేనియాపై రాష్ట్ర బీజేపీ ఆధారపడి ఉంది. మోదీ హవాతో ఈసారి కూడా గట్టెక్కుతామని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే సీనియర్ల ఉద్వాసన వల్ల సీట్ల సంఖ్య తగ్గిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

కౌండిన్య అటవీ ప్రాంతం దాటి గజరాజులు బయటకు వచ్చేస్తున్నాయి.. గతంలో ఏర్పాటు చేసిన నాసిరకం సోలార్ ఫెన్సింగ్‌ను తొక్కుకుంటూ దాటేస్తున్నాయి.. ఎలిఫెంట్ ట్రెంచ్‌లను పూడ్చుకుంటూ సమీప గ్రామాల్లోకి చొరబడుతున్నాయి.. పంట పొలాలను ధ్వంసం చేసేస్తున్నాయి.. పండ్ల తోటల్లో చెట్లను విరిచేస్తున్నాయి.. కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి.. దొరికినవారి ప్రాణాలను క్షణాల్లో తీసేస్తున్నాయి.. ఈ క్రమంలో భీ'కరి' ఘీంకారం వినిపిస్తే జనావాసాలు గజగజా వణుకుతున్నాయి.. అడవిలో ఆహారం.. నీటి కొరత వల్లే ఏనుగులు పల్లెల్లోకి ప్రవేశిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.. హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌తోనే కట్టడి సాధ్యమని తెలియజేస్తున్నారు.. ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడిస్తున్నారు.

భీ'కరి' భయం!

కౌండిన్య అటవీ సరిహద్దులు దాటుతున్న ఏనుగులు

- ఆహారం, నీటి కొరతతో బయటకు వచ్చేస్తున్న గజరాజులు
- కుప్పం నుంచి శేషాచలం వరకు సంచారం
- పంట పొలాలపై యథేచ్ఛగా దాడులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌తోనే కట్టడి సాధ్యమంటున్న ఫారెస్ట్ అధికారులు



పలమనేరు వద్ద ఏనుగుల గుంపు (ఫైల్)

సాక్షి, చిత్తూరు : కౌండిన్య అభయారణ్యం పరిధిలో సుమారు 110 ఏనుగులు సంచరిస్తున్నాయి. అలాగే తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా, కర్ణాటకలోని కోలారు జిల్లాలోని అడవుల నుంచి కూడా ఏనుగులు వస్తున్నాయి. వేసవి నేపథ్యంలో తీవ్రమైన ఆహారం, నీటి కొరత కారణంగా గజరాజులు అటవీ ప్రాంత సరిహద్దుల్లోని గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ప్రధానంగా పలమనేరు, కుప్పం, పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాల్లో వీటి రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురిస్తే ఏనుగులకు ఆహారం, తాగునీరు లభ్యత ఉంటుంది. ఆ సందర్భాల్లో జిల్లాలోకి వచ్చే ఏనుగుల సంఖ్య చాలా తక్కువే. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లోని ఆశించిన మేర వర్షపాతం లేకపోవడంతో ఏనుగులు గుంపులు గుంపులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లోకి వచ్చేస్తున్నాయి. సాధారణంగా ఏనుగులు ఆహారం, నీటి కోసం రోజుకు సుమారు 40 కిలోమీటర్ల వరకు నడక సాగిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో మదపుటేనుగులు చాలా క్రూరంగా ప్రవర్తిస్తాయి. అందులోనూ ఒంటరి ఏనుగులైతే మరింత ప్రమాదకరంగా ఉంటాయి. మనుషులు, పశువులు, కుక్కలను వెంటాడి మరీ హతమారుస్తుంటాయి.



పలమనేరు వద్ద విద్యుత్‌ఘాతంతో ఏనుగు మృత్యువాత

ఏనుగులకూ ప్రాణసంకటం

ఆహారం, నీటి కోసం ఏనుగులు అడవి దాటితే వాటి పరిస్థితి ప్రాణసంకటంగానే ఉంటోంది. వివిధ ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 19 ఏనుగులు మృత్యువాత పడినట్లు అటవీ అధికారులు వెల్లడిస్తున్నారు. గజరాజులు అభయారణ్యంలో ఉంటే సురక్షితంగా ఉంటాయని, వాటిని సరిహద్దులు దాటకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని వివరిస్తున్నారు.

15 మంది మృత్యువాత

ఏనుగుల దాడిలో 2009 నుంచి ఇప్పటి వరకు మొత్తం 15 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలోనే గాయపడ్డారు. అలాగే 47 పశువులు, ఇతర జంతువులు మృత్యువాత పడ్డాయి. గజదాడుల్లో మృతి చెందిన వారికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.69.50 లక్షల పరిహారం అందింది. గాయపడిన వారికి రూ.7.46 లక్షలు ముట్టింది. దాదాపు 4,926 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇందుకు గాను రూ.3.54 కోట్ల వరకు బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారంగా చెల్లించింది.



గత టీడీపీ ప్రభుత్వంలో కాల్వపల్లె వద్ద నిర్మించిన నాసిరకం ట్రెంచ్


రైతుల ఆందోళన

ఏనుగుల గుంపు పంట పొలాల్లోకి ప్రవేశిస్తే ఎకరాలకు ఎకరాలే నాశనమవుతాయి. ముఖ్యంగా వరి, చెరుకు, మామిడి, అరటి, కూరగాయల పంటలు కనిపిస్తే విడిచిపెట్టవు. ప్రస్తుతం ఏనుగు సంచారంతో అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల్లోని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. చేతికందే దశలోని మామిడి, అరటి తోటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్నారు. అటవీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి ఏనుగులను అడవుల్లోకి మళ్లించాలని కోరుతున్నారు.

బలహీనమైన ఫెన్సింగ్

కౌండిన్య అటవీ సరిహద్దులో సుమారు 66 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను గతంలో నిర్మించారు. చాలా ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్‌కు అమర్చిన డీసీ బ్యాటరీలు పనిచేయకపోవడంతో విద్యుత్ ప్రవహించక నిరుపయోగంగా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి పైపులను విరిచేసి ఏనుగులు వెలుపలికి వచ్చేస్తున్నాయి. సుమారు 74 కిలోమీటర్ల పరిధిలో 12 చోట్ల చేపట్టిన ఎలిఫెంట్ ట్రెంచెస్ పనులు వివిధ కారణాలతో అసంపూర్ణంగా ఉన్నాయి. దీంతో వాటిని ఏనుగులు సులువగా అధిగమిస్తున్నాయి.

హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌తో సత్ఫలితాలు



గతంలో నిర్మించిన ఫెన్సింగ్‌ను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. అందుకే హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ విధానం ప్రవేశపెట్టాం. ఇది సత్ఫలితాలిస్తోంది. పలమనేరులో 2, కుప్పంలో 4 కిలోమీటర్ల మేర రూ.38.42 లక్షలతో హ్యాంగింగ్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. మరో 25 కిలోమీటర్ల నిర్మాణం కోసం రూ.1.60 కోట్లకు ప్రతి పాదనలు పంపించాం. ఏనుగుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉంటున్నా.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, చిత్తూరు

ఎలిఫెంట్ కారిడార్‌తో శాశ్వత పరిష్కారం

ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక సంయుక్తంగా కేంద్రప్రభుత్వంతో కలిసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆ దిశగా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే సమస్య మరింత జటిలంగా మారుతుందే కానీ, పరిష్కారం దొరకదని స్పష్టం చేస్తున్నారు.



సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 19-4-2023



చేనేత సంతలో వీవర్స్ స్టాల్స్

చేనేతకు చేరువలో..

చేనేతకారులకు సాయం చేయాలనే ఆలోచనతో ఎగ్జిబిషన్స్ పెట్టి, ఆ పేరుతో పవర్‌లూమ్స్ అమ్ముతుంటారు. దీనివల్ల చేనేతకారులకు అన్యాయం జరుగుతుంటుంది. ఈ సమస్యల గురించి తెలిసి, ఆరేళ్ల నుంచి చేనేత సంత పేరుతో యాభై ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేసి, వీవర్స్‌కు సాయం చేస్తోంది హైదరాబాద్ విద్యానగర్‌లో ఉంటున్న సరస్వతి కవుల. వ్యవసాయం మీద ఉన్న ప్రేమతో యాచారం దగ్గర నందివనపర్తిలో రైతుగానూ తన సేవలను అందిస్తున్నారు. పర్యావరణ ఉద్యమకారిణిగానూ పనిచేసే సరస్వతి చేనేతకారుల సమస్యలు, వారికి అందించాల్సిన తోడ్పాటు గురించి వివరించారు.



సరస్వతి కవుల

''ప్రభుత్వాలు పవర్‌లూమ్‌నే ప్రమోట్ చేస్తున్నంత కాలం చేనేతకారుల వెతలు తీరవని ఇన్నాళ్లుగా వాళ్లతో నేను చేసిన ప్రయాణం వల్ల అర్థమైంది. దాదాపు పదిహేనేళ్లుగా వ్యవసాయం, చేనేతకారులకు సంబంధించిన విషయాలపై స్టడీ చేస్తూనే ఉన్నాను. మొదట్లో పర్యావరణానికి సంబంధించిన డాక్యుమెంటరీలు చేసేదాన్ని. అప్పట్లో రసాయన మందులతో వ్యవసాయం చేసే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టే చేనేతకారులు కూడా అదేబాట పట్టారు. కుటుంబం అంతా కలిసి చేసే హస్తకళల్లోకి చాపకింద నీరులాగ పెద్ద కంపెనీలు వచ్చి చేరుతున్నాయి. దీనివల్లే వీవర్స్‌కి సమస్యలు వచ్చాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌కు ఉన్న గ్యారంటీ చేనేతకారుల ఉత్పత్తులకు మార్కెట్ ఉండదు. ఇంకా హ్యాండ్లూమ్ బతికుంది అంటే మన చేనేతకారుల పట్టుదల వల్లనే. సమాజంలో బాధ్యతగలవారిగా మనమే వారికి సపోర్ట్‌గా నిలవాలి. ఇప్పటికే చేనేతకారులు వారి పిల్లలకు తమ వారసత్వ విద్యను నేర్పించడం లేదు. పెద్ద చదువులు, కంపెనీల్లో ఉద్యోగాలు అంటూ పంపిస్తున్నారు. దీంతో నేతపని రోజురోజుకూ కుంటుపడుతుంది. మనదేశంలో నైపుణ్యాలు కల కళాకారులు ఉన్నారు. కానీ, పెద్ద పెద్ద టెక్స్‌టైల్ పరిశ్రమలు వస్తాయి. వాటికి రాయితీలు పెద్దఎత్తున ఉంటాయి. కానీ, వీవర్స్‌కి ఇవ్వరు. పాలిస్టర్ దారానికి సబ్సిడీ ఉంటుంది, కాటన్‌కి టాక్స్ పెంచుతారు. కరోనా సమయంలో వీవర్స్ చాలా దెబ్బతిన్నారు. సేల్స్ తగ్గిపోయి, పూట గడవడమే కష్టపడిన సందర్భాలున్నాయి.

దిగులును చూశాను..

మొదట్లో రూరల్ ఇండియాకు సంబంధించి డాక్యుమెంటరీ ఫిల్మ్స్ చేస్తుండేదాన్ని. వ్యవసాయదారులతోనూ చేసేదాన్ని. ఎన్జీవోలతో కలిసి చేనేతకారులకు సపోర్ట్ చేసేదాన్ని. వాళ్లకు సపోర్ట్ చేసే సంస్థ మూతపడినప్పుడు ఏం చేయాలో తోచక దిగాలు పడటం చూశాను. డైరెక్ట్ మార్కెటింగ్ ఉంటే వారు తయారు చేసినదానికి సరైన ధర వస్తుంది.దాని వల్ల ఆ వస్తువు తయారీదారునికి, కొనుగోలు దారికీ నేరుగా లాభం కలుగుతుంది. ఈ ఆలోచన వచ్చినప్పుడు చేనేతకారులకు డైరెక్ట్ మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలనుకున్నాను. కానీ, కొన్నాళ్ల నేనది చేయలేకపోయాను. కొంతమంది చేనేతకారుల దగ్గరకు వచ్చి ఎలాంటి సాయం కావాలి అని అడిగేవారు. వాళ్లు 'మా సరుకును కొనండి చాలు, మాకేం చేయద్దు' అనేవారు. ఇవన్నీ చూశాక మా ఫ్రెండ్స్‌తో కలిసి చర్చించాను. వారు కొంత ఆర్థిక సహాయం చేస్తామన్నారు. అప్పుడు హైదరాబాద్‌లో కమ్యూనిటీ హాల్స్ లాంటి చోట్ల ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేశాం. 2015 నుంచి 2017 వరకు ఫ్రెండ్స్ సాయం చేశారు. ఆ తర్వాత సేల్స్ నుంచి 2 శాతం ఇవ్వాలని చేనేతకారులకు చెప్పాం. ఇప్పుడు వారికి వచ్చిన దాంట్లో 5 శాతం ఇస్తున్నారు. పెద్ద పెద్ద హాల్స్ తీసుకొని పెట్టాలంటే ఆ హాల్స్‌కి అమౌంట్ కట్టాలి. దానివల్ల మళ్లీ వీవర్ తన వస్తువుల ధర పెంచాలి. అది కూడా మళ్లీ ధర పెరిగినట్టే కదా! అందుకే, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే సంతలను ఏర్పాటు చేస్తున్నాం. స్వయంసమృద్ధిగా ఉంటే ఏ సమస్యలూ ఉండవు. ఇప్పుడైతే ప్రయాణ ఖర్చులూ పెరుగుతున్నాయి. మెటీరియల్ తీసుకొని, రైళ్లలో రావాల్సి ఉంటుంది. అలా వచ్చే ఖర్చు కూడా గతంలో వందల్లో ఉంటే, ఇప్పుడు వేలకు చేరింది. అందుకే, వసతి సదుపాయాలకు ఖర్చు పెట్టాల్సిన అవసరం రాకుండా చూస్తుంటాం. అందుకు ఇప్పటికీ సాయం చేసేవారున్నారు.

> **మద్దతు ముఖ్యం**
> క్రమం తప్పకుండా ఇలాంటి సంతలను ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు సులువుగా అర్థమైపోతుంది ఫలానాచోట హ్యాండ్లూమ్స్ లభిస్తాయి అని. దీనికి డిజిటల్ మీడియా వేదికగా ప్రమోట్ చేస్తున్నాం. ఈ నెల వరకు 50 చేనేత సంతలు ఏర్పాటుచేశాం. ఇక ముందు కూడా ఎన్ని వీలైతే అన్ని చేద్దామనుకుంటున్నాను. మనవంతు సాయంగా సపోర్ట్ చేయగలిగితే సరిపోతుంది. ఇది ఒక వాలంటీర్‌గా చేసే సాయం.

అన్ని చేనేతలు ఒక దగ్గర

ఆరేళ్ల క్రితం రెండు–మూడు స్టాల్స్‌తో ఎగ్జిబిషన్ మొదలుపెట్టాం. తర్వాత కొంతమందిని నేరుగా కలిసి చెబితే, కొంతమందికి నోటిమాట ద్వారా తెలిసి వచ్చారు. ఇప్పుడు 25 నుంచి 30 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్న వీవర్ ఎవరైతే ఉన్నారో ముఖ్యంగా వారు రావాలనుకుంటాం. అందుకు చాలా ప్రయత్నం చేశాం. మాస్టర్ వీవర్స్, కో ఆపరేటివ్ సొసైటీ, తూర్పుగోదావరి నుంచి మోరీ సొసైటీ, ఇంకొంతమంది ఇండివిడ్యువల్ వీవర్స్ ఉన్నారు. పొందూరు, పెన్‌కలంకారీ, కలంకారీ, గుంటూరు, చీరాల, మంగళగిరి, వెంకటగిరి, ఒరిస్సా నుంచి కూడా చేనేతకారులు తమ ఉత్పత్తులతో వస్తుంటారు. వరంగల్ నుంచి మ్యాట్స్, చందేరీ, కర్నాటక నుంచి ఇల్‌కల్ వీవింగ్, సిద్దిపేట్ గొల్లభామ, ముత్యంగడి చీరలు... మొత్తం దీనిమీద ఆసక్తి కొద్దీ, కళను బతికించాలని ఆలోచనతో చేస్తున్న వర్క్ ఉన్నవాళ్లు ఒక చోట చేరుతుంటారు. కొంతమంది చదువుకున్న వారు, ఉద్యోగాలు చేస్తూ ఆసక్తితో తిరిగి చేనేతలకు వస్తున్నారు. ఆంధ్ర తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా, గుజరాత్ నుంచి అజ్రక్, కలకత్తా, బెంగాల్ నుంచి చేనేతకారులు ఈ సంతకు వస్తున్నారు. అయితే, ఇక్కడకు వచ్చే కొంతమంది ధర పెట్టడానికి చాలాసేపు బేరం ఆడుతుంటారు. అది బాధనిపిస్తుంది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌కి వెళ్లి, అక్కడి వస్తువులకి ఎంత డబ్బయినా ఖర్చు పెడతారు. కానీ, మనవైన చేనేతల కష్టాన్ని మాత్రం విపరీతంగా బేరం ఆడుతుంటారు. మనలో ఆర్థిక మార్పు కాదు, సామాజిక మార్పు రావాలి.


రైతుగానూ..

మా అమ్మానాన్నలు నాకు మంచి సపోర్ట్. పర్యావరణ సంబంధిత ఉద్యమాలు చేస్తున్నప్పుడు కూడా తమవంతు తోడ్పాటును అందించారు. ఎన్నిరోజుల వీవర్స్ వారు తమ శక్తిని నమ్ముకుంటారో అంతవరకు ఇలాంటి సంతలు ఏర్పాటు చేస్తూనే ఉంటాను. ఇప్పటివరకు రెండు నెలలకు ఒకసారి ఈ ప్రోగ్రామ్ చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మూడు – ఆరు నెలలకు ఒకసారి చేయాలనుకుంటున్నాం. ఇందుకు కారణం కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా తగ్గిపోతుండటమే. ఫలితంగా చేనేతకారులు ఆశించినంత ఆదాయం వారికి రావడం లేదు. నేటి తరం మన హస్తకళల గొప్పతనాన్ని అర్థం చేసుకోవాలి, చేయూతనివ్వాలి. ప్రకృతితో మమేకం అవడం నాకు ఇష్టమైన పని. అందుకే, వ్యవసాయం చేస్తూ రైతులకు దగ్గరగా, చేనేతలకు చేరువలో ఉండటంలోని సంతోషాన్ని పొందుతుంటాను'' అని వివరించారు సరస్వతి.

– నిర్మలారెడ్డి

వేసవి సెలవుల్లో పిల్లలు కనీసం 3 గంటలు ఫోన్ లేదా కంప్యూటర్ స్క్రీన్‌తో గడుపుతున్నారని దేశంలో 85 శాతం మంది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్టు 'అమేజాన్' నిర్వహించిన తాజా సర్వే వెల్లడించింది. దీనివల్ల పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బ తింటుందని వారు భయపడుతున్నారు. పిల్లల్ని ఆరోగ్యకరమైన వ్యాపకాల్లో పెట్టాలని వారంతా కోరుకుంటున్నారు. కాకుంటే పిల్లల్ని స్క్రీన్ మీద నుంచి దృష్టి మళ్లించేలా చేయడమే అసలు సమస్య.

సర్వే/ పేరెంటింగ్



రోజుకు 3 గంటలు చూసేస్తున్నారు

మన దగ్గర సమయం లేక పిల్లల్ని ఎలా ఎంగేజ్ చేయాలో తెలియక వారి చేతుల్లో పెడుతున్న ఫోన్ ఇవాళ విశ్వరూపం చూపిస్తున్నదని అమేజాన్ సంస్థ తాజాగా కాంటార్ అనే ఏజెన్సీ ద్వారా నిర్వహించిన సర్వే చెబుతోంది. 10 మెట్రో, నాన్ మెట్రో నగరాల్లో 750 మంది తల్లిదండ్రులను సర్వే చేయగా 69 శాతం మంది ఇప్పుడు మొదలైన వేసవి సెలవుల్లో పిల్లలు మూడు గంటలకు మించి ఫోన్‌గాని కంప్యూటర్ స్క్రీన్‌గాని చూస్తున్నారని అంగీకరించారు. మొత్తం 85 శాతం మంది తమ పిల్లలు అవసరానికి మించి ఫోన్లు చూస్తున్నారని ఇందుకు తాము చాలా ఆందోళన చెందుతున్నామని తెలియచేశారు. అంతంత సేపు వాళ్లు ఫోన్ చూడటం వల్ల మజ్జుగా ఉండటమే కాదు సోమరులుగా తయారవుతున్నారు. నిద్ర లేమితో బాధపడుతున్నారు అని తెలియచేశారు.

రెక్కలు కత్తిరించి

అయితే ఈ తప్పు పిల్లలదా? వారు నిజంగా ఆడుకోరా? గెంతరా? అల్లరి చేయరా? అంటే చేస్తారు. కాని ఆటస్థలాలు లేకపోవడం, వీధుల్లో ఆడలేకపోవడం, అపార్ట్‌మెంట్‌లలో సెల్లార్లు ఉన్నా ఆడటానికి కమిటీలు అంగీకరించకపోవడం, పార్కులు నామమాత్రంగా ఉండటం... వీటన్నింటి వల్ల రోజువారి జీవితంలో బడి నుంచి వచ్చాక మాత్రమే వారు ఫోన్ చేతిలోకి తీసుకునేవారు. తల్లిదండ్రుల ఉద్యోగాల వల్లో, పని వొత్తిడి వల్లో, పిల్లలతో గడిపే సమయం వారు తమ ఫోన్‌కు ఇస్తున్నందు వల్లో పిల్లలు ఫోన్ చూస్తున్నా చూసి చూడనట్టు ఊరుకుంటున్నారు. ఇప్పుడు వేసవి సెలవుల్లో వారికి ఆ అలవాటు వ్యసనం స్థాయికి వెళ్లడం, నివారిస్తే అలగడం మనస్తాపం చేస్తుండటంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

ఇలా చేయాలని ఉంది

సర్వేలో ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులను 'మీ పిల్లలు ఈ సెలవుల్లో ఏం చేస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు' అనే ప్రశ్నకు ఇంగ్లిష్ నేర్చుకోవడం (50 శాతం), నైతిక విషయాలు సంఘ మర్యాదలు తెలుసుకోవాలి (45 శాతం), కళలు నేర్చుకోవాలి (36 శాతం), ఆడుకోవడం విహారాలు చేయడం (32 శాతం) సమాధానం చెప్పారు. అందరూ ఆశిస్తున్నది విజ్ఞానం వినోదం కలగలిసి ఉంటే బాగుంటుందని. 'పిల్లలు కొత్త విషయాలు నేర్చుకోవాలని కోరుకుంటారు. ఫోన్ చూసే సమయాన్ని తగ్గించి కొత్త విషయాలు నేర్పించడంలో వారిని ఉత్సాహపరచాలని ఉంది అని చాలామంది తల్లిదండ్రులు మాతో అన్నారు' అని సర్వే చేసిన కాంటార్ ఏజెన్సీ ప్రతినిధి తెలియచేశారు.

మెల్లగా మళ్లించాలి

స్క్రీన్ టైమ్‌ను తగ్గించాలంటే అది ఒక్కసారిగా బంద్ చేయకుండా మెల్లగా తగ్గించాలని నిపుణులు పేర్కొంటున్నారు. ఫోన్లు రీచార్జ్ చేయకుండా నిరుత్సాహ పరచడం, ఇంట్లో రౌటర్ ఉంటే దానిని తరచూ ఆఫ్ చేస్తూ ఉండటం, ఈ పుస్తకం చదివితే ఫోన్ ఇస్తాను, కాసేపు ఆడుకుంటే ఇస్తాను, ఫ్రెండ్స్‌ను కలిసి వచ్చాక ఇస్తాను అని వారిని దారి మళ్లించడం, విహారాలకు తీసుకెళ్లడం, ఆడుకునే సమయం– కథలు చదివే సమయం– ఫోన్ సమయం అని టైమ్ విభజించి ఆ టైమ్ పాటించడం... అలా మెల్లగా ఫోన్ టైమ్‌ను తగ్గించాలి.

పిల్లలు ఫోన్ చూడటం వల్ల వారి మానసిక, బౌతిక స్థితుల కంటే వారు చూస్తున్నది ఆరోగ్యకరమైనదో కాదో పరిశీలించే తీరికలో కూడా తల్లిదండ్రులు లేకపోతే అట్టి సర్వేలకు అందనంత తీవ్ర ఆందోళన చెందాల్సిందే.

రంజాన్ స్పెషల్ రెసిపీ



మటన్ షామీ కబాబ్

కావలసినవి: మటన్ ఖీమా– అర కేజీ; పచ్చిశనగపప్పు – అర కప్పు; నెయ్యి– 2 టేబుల్ స్పూన్లు; దాల్చిన చెక్క– అర అంగుళం ముక్క; జాపత్రి – 1; లవంగాలు – 3; బిర్యానీ ఆకు – 1; పచ్చ యాలకులు – 2; మిరియాలు – 10; నల్ల యాలకులు – 2; ఉప్పు – అర టీ స్పూన్; మిరప్పొడి – అర టీ స్పూన్; నీళ్లు – కప్పు; ఉల్లిపాయ – 1; పచ్చిమిర్చి – 1; నిమ్మకాయ – 1;

తయారీ: ● పచ్చి శనగపప్పు కడిగి, మునిగేటట్లు నీటిని పోసి అరగంట సేపు నానబెట్టాలి. మటన్ ఖీమాను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ● ప్రెషర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి దాల్చిన చెక్క, జాపత్రి, లవంగాలు, బిర్యానీ ఆకు, యాలకులు, మిరియాలు వేసి దోరగా వేయించాలి. ఇందులో మటన్ ఖీమా, ఉప్పు, మిరప్పొడి వేసి కలిపి ఒక నిమిషం పాటు మగ్గనివ్వాలి. ఇప్పుడు నానబెట్టిన శనగపప్పు వేసి వేదయ్యే వరకు గరిటెతో కలిపి, కప్పు నీళ్లు పోసి మరోసారి కలిపి కుక్కర్ మూత పెట్టి ఉడికించాలి. రెండు విజిల్స్ వచ్చిన తర్వాత స్టవ్ ఆపేసి ప్రెషర్ తగ్గిన తరవాత మూత తీసి కలిపి చూసుకోవాలి. నీరు ఇంకా ఉందనిపిస్తే స్టవ్ ఆన్ చేసి మూత లేకుండా ఉడికిస్తే నీరు ఆవిరైపోతుంది. ● ఖీమా, శనగపప్పు మిశ్రమం చల్లారిన తరవాత బిర్యానీ ఆకు తీసేసి మిగిలినవన్నీ మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి అరగంట పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● ఫ్రిజ్‌లో నుంచి తీసిన తరవాత అందులో ఉల్లిపాయ ముక్కలు, నిమ్మరసం, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత తీసుకుని వడల్లా వత్తాలి. మొత్తాన్ని ఇలా వత్తుకున్న తర్వాత వీటిని మరో పదినిమిషాల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● పెనం మీద నెయ్యి వేడి చేసి, వత్తి సిద్ధంగా ఉంచిన కబాబ్‌లను పెనం మీద పెట్టి మీడియం మంట మీద రెండు వైపులా బంగారు రంగులోకి వచ్చే వరకు కాల్చి వేడిగా తినాలి.

యూత్ పల్స్

సినిమాల్లో డైలాగులు ఏంచేస్తాయి? ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టిస్తాయి. ఉత్సాహం ఎక్కువైతే ఈలలు కొట్టిస్తాయి. అంతేనా?.. అంతకంటే ఎక్కువే! యువతరం వాటిని మదిలో స్టోర్ చేసుకుంటోంది. 'వెనకడుగు' ఫైల్స్‌ను డిలీట్ చేస్తోంది. 'స్టార్టప్ కల్చర్'ను ఇన్‌స్టాల్ చేసుకుంటుంది. ఇంతకంటే కావాల్సింది ఏముంది!

స్టార్టప్ కల్చర్ వారి...
అంకుర చిత్రం



మన దేశంలో అరవై వేలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయి. అమెరికా, చైనా తరువాత అత్యధికంగా అంకురాలు ఉన్న దేశం మనదే. అయితే అన్ని స్టార్టప్‌లు సక్సెస్ బాటలో పయనించడం లేదు. చాలా కంపెనీలు చతికిలపడుతున్నాయి. అయినప్పటికీ స్టార్టప్ కల్చర్‌లో భాగం కావడానికి యువతరం ఉత్సాహం చూపుతోంది.

అయితే అది శూన్యంలో నుంచి వచ్చిన ఉత్సాహం కాదు. చలన చిత్రాల్లో నుంచి స్ఫూర్తిగా వచ్చిన ఉత్సాహం. 2010లో 'ది సోషల్ నెట్‌వర్క్' అనే సినిమా విడుదలైంది. అద్భుత కథాసంవిధానంతో కూడిన ఈ చిత్రం మూడు అకాడమీ అవార్డులు గెలుచుకొంది.

సోషల్ మీడియా దిగ్గజం మార్క్ జుకర్‌బర్గ్ జీవితం ఆధారంగా వచ్చిన ఈ చిత్రం స్టార్టప్ కలల యువతరానికి గట్టి స్ఫూర్తిని ఇచ్చింది. మెగా సిటీల నుంచి మారు మూల పల్లె వరకు జుకర్‌బర్గ్ పేరు తెలియని వారు అతి తక్కువగా ఉంటారు.

ఫేస్‌బుక్ యాక్టివిటీని ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది జీవితాల్లో భాగం చేసిన జుకర్‌బర్గ్ విజయాల గురించి తప్ప ఒడుదుడుకుల గురించి తెలిసిన వారు అతి తక్కువగా ఉంటారు. 'ది సోషల్ నెట్‌వర్క్' జుకర్ బర్గ్ అవతలి కోణాన్ని చూపిస్తుంది. ఇక ఈ చిత్రంలో డైలాగుల విషయానికి వస్తే...

'సక్సెస్‌ఫుల్ పీపుల్ పెదాల మీద రెండు తప్పనిసరిగా ఉండాలి. ఒకటి... సైలెన్స్ రెండు స్మైల్'

'నువ్వు ఏం చెబుతున్నావు అనే దానికంటే ఏం చేశావు అనే దానికే ప్రజలు విలువ ఇస్తారు'... ఇలాంటి డైలాగులను యువతరం సొంతం చేసుకుంది.

స్టీవ్ జాబ్స్ బయోగ్రాఫికల్ డ్రామా ఫిల్మ్ 'స్టీవ్ జాబ్స్' యువతరంలో ఎంతోమందిని ప్రభావితం చేస్తూనే ఉంది. స్టీవ్ జాబ్స్ బిజినెస్ ఫిలాసఫీని పట్టించే ఈ చిత్రంలో ఆలోచింపజేసే డైలాగులు ఉన్నాయి...

'ఉన్నత విద్యను నేను తక్కువ చేయడం లేదు. అయితే అది అనుభవ సారం నుంచి వచ్చింది అయితే బాగుంటుంది'

'డోన్ట్ డూ థింగ్స్ బెటర్. డూ థింగ్స్ డిఫరెంట్'

'డోన్ట్ జస్ట్ మేక్ ఇట్. మేక్ ఇట్ గ్రేట్'

రిచర్డ్ హెండ్రిగ్స్ అనే ప్రోగ్రామర్ 'పైడ్ పైపర్' అనే స్టార్టప్ స్టార్ట్ చేస్తాడు. తన కంపెనీని బతికించుకోవడానికి అతను పడే రకరకాల తిప్పలను 'సిలికాన్ వ్యాలీ'లో చూడవచ్చు. 2014లో వచ్చిన అమెరికన్ కామెడీ టీవీ సిరీస్ 'సిలికాన్ వ్యాలీ'లో వాస్తవ సంఘటనలు, వ్యక్తులు లేకపోయినప్పటికీ యువతరాన్ని ఆకట్టుకుంది. నవ్విస్తూనే ఈ చిత్రం జీవన పాఠాలు చెబుతుంది....ఈ మూడు చిత్రాలు మాత్రమే కాదు ఎన్నో చిత్రాలలో ఎన్నో స్ఫూర్తిదాయకమైన డైలాగులు యువతకు కంఠో'పాఠాలు' అయ్యాయి. మచ్చుకు కొన్ని...

'గతం అనే గాయం నీకు ఉపయోగపడుతుంది. చెడు పరిస్థితులకు దూరంగా ఉండడానికి. కొత్త పాఠాలు నేర్చుకోవడానికి'

'జీవితంలో ఉన్న గొప్పతనం ఏమిటంటే, కష్టం ఉంటుంది. భయం ఉంటుంది. అయోమయం ఉంటుంది. అయినా సరే అద్భుతమైన అందం ఉంటుంది'

రంగస్థలం

సోషల్ మీడియా వేధింపులకు
దర్పణం



● రుజుత సోమన్ నట విశ్వరూపం

ఎక్కడ ఏ ప్రమాదం దాగుందో తెలియదు.

ఎప్పుడు ఎక్కడ ఏ ఫొటో ఏ రూపంలో ప్రత్యక్షం అవుతుందో తెలియదు.

మహిళల పట్ల సోషల్ మీడియా వేధింపులకు అద్దం పట్టిన నాటకం మాల్ ప్రాక్టీస్ అండ్ ది షో...

లవణీ డ్యాన్సర్ గౌతమి పాటిల్ ప్రైవేట్ వీడియో ఒకటి ఇంటర్నెట్‌లో లీక్ అయింది. ఫొటోలు, వీడియోల రూపంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. ప్రముఖ నాటక దర్శకుడు అతుల్ పేటే కూతురు ప్రముఖ నటి పర్ణ పేటేకు ఒక షాప్‌లోని గ్రీన్‌రూమ్‌లో రహస్య కెమెరా కనిపించింది.

గొడవ జరిగింది. ఆ కెమెరాను తొలగించారు. ఇలాంటి కొన్ని సంఘటనల ప్రభావంతో సోషల్‌మీడియా వేదికగా స్త్రీలపై జరుగుతున్న హింస, వేధింపులపై పేటేకు నాటకం రాయాలనిపించింది.

అలా రూపుదిద్దుకున్నదే 'మాల్‌ప్రాక్టీస్ అండ్ ది షో' నాటకం

ప్రముఖ నృత్యకారిణి రుజుత సోమన్ ఈ నాటకానికి తన నటన ద్వారా ప్రాణం పోసింది.

రామాయణ, మహాభారతాల లాంటి పౌరాణిక నాటకాలతో ప్రసిద్ధురాలైన సోమన్ ఒక ప్రయోగాత్మక నాటకంలో నటించాలనుకుంది. ఆ సమయంలోనే స్క్రిప్ట్ దశలో ఉన్న తన నాటకం గురించి చెప్పాడు పేటే.



● రుజుత సోమన్

ఇద్దరు కలిసి పుణెలోని ఎంతోమంది కళాకారులతో మాట్లాడి స్క్రిప్ట్‌ను మరింతగా మెరుగుపరిచారు. స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్న సమయంలో పేటే 'డాన్సర్' పాత్రలోకి, సోమన్ 'ప్లే డైరెక్టర్' పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు.

ఆరునెలల పాటు రిహార్సల్స్ చేసిన తరువాత తొలి ప్రదర్శన పుణెలో ఇచ్చారు.

ఇమేజ్‌లు, సింబల్స్, సంభాషణలతో ఈ నాటకం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

ప్రదర్శన ఒక సర్కిల్‌లో సాగుతుంది. ఈ సర్కిల్‌కు మూడు వైపుల ప్రేక్షకులు కూర్చుంటారు.

నాటకం పూర్తయిన తరువాత కూడా ప్రేక్షకులు హాల్ వీడకుండా 'సోషల్ మీడియా హింస' గురించి చర్చించుకున్నారు. తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.

'వేరే పని ఉండడంతో కొద్దిసేపు నాటకం చూసి వెళదామని వచ్చాను. తీరా నాటకంలో లీనమైపోయాక ఆ పని గురించే మరిచిపోయాను. సోషల్‌మీడియాలో నాకు, నా ఫ్రెండ్స్‌కి ఎదురైన చేదు అనుభవాలు ఒక్కటొక్కటిగా గుర్తుకొచ్చాయి' అంటుంది సౌమ్య అనే ప్రేక్షకురాలు.

''సాధారణంగా నాటకం పూర్తి కాగానే ప్రేక్షకులు, కళాకారులు ఎవరి ప్రపంచంలోకి వాళ్లు వెళ్లిపోతారు. కాని ఈ నాటకం పూర్తయిన కొన్ని వారాల తర్వాత కూడా ఎవరో ఒకరు ఫోన్ చేస్తూ సోషల్ మీడియాలో తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను పంచుకుంటూనే ఉన్నారు'' అంటుంది రుజుత సోమన్.

పుణేలోని 'ది బాక్స్' నాటక వేదికలో ఇప్పటివరకు 20కి పైగా ప్రదర్శనలు పూర్తి చేసుకున్న ఈ నాటకాన్ని చూడటానికి ముంబై తదితర పట్టణాల నుంచి కూడా ప్రేక్షకులు రావడం విశేషం.

బ్యూటిప్స్







● బాదం పప్పులను నానబెట్టి, పైన పొట్టు తీసి, మెత్తగా రుబ్బి, కొద్దిగా పచ్చి పాలను కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా వారానికి మూడు సార్లు చేస్తే చర్మం మృదువుగా అవుతుంది. కాంతి పెరుగుతుంది.

● పెరుగు, నారింజ రసం సమపాళ్లలో తీసుకొని, కొద్దిగా ఆలోవెరా జెల్ కలిపి ముఖానికి అప్లై చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

● బొప్పాయి గుజ్జులో తేనె కలిపి ముఖానికి మృదువుగా మర్దనా చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే చర్మం నిగారింపు పెరుగుతుంది.



కోహ్లి మ్యాచ్ ఫీజులో కోత

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ కోహ్లిపై జరిమానా విధించారు. సోమవారం చెన్నైతో జరిగిన పోరులో ప్రత్యర్థి బ్యాటర్ శివమ్ దూబే అవుటైనపుడు కోహ్లి సంబరం అతిగా అనిపించడంతో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం అతని మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. కోహ్లి తన తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ జరిమానాతో సరిపెట్టారు. నియమావళిలోని ఆర్టికల్ 2.2 లెవెల్ 1 అతిక్రమణలో రిఫరీదే తుది నిర్ణయం అవుతుంది.




శ్రీలంక ఇన్నింగ్స్ 280 పరుగుల తేడాతో విజయం

ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 280 పరుగుల తేడాతో నెగ్గి తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అతి పెద్ద విజయం నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 117/7తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 143 పరుగులకు ఆలౌటైంది. 448 పరుగులతో వెనుకబడి ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఐర్లాండ్ 168 పరుగులకే కుప్పకూలింది. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (3/56, 7/52) రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టాడు. రెండో టెస్టు ఈనెల 24న మొదలవుతుంది.

రైజర్స్ జోరుకు బ్రేక్....

- 14 పరుగులతో ఓడిన హైదరాబాద్
- ముంబైకి హ్యాట్రిక్ విజయం
- రాణించిన గ్రీన్

వరుసగా రెండు విజయాలతో జోరు పెంచిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సొంతగడ్డపై అడ్డుకట్ట పడింది. కొంత పోరాటపటిమ కనబర్చినా చివరకు విజయం మాత్రం దక్కలేదు. అన్ని రంగాల్లో సమష్టిగా రాణించిన ముంబై ఇండియన్స్ 'హ్యాట్రిక్' గెలుపుతో సత్తా చాటింది. కామెరాన్ గ్రీన్, తిలక్ వర్మ విజయంలో కీలకపాత్ర పోషించగా... ఒక్క బ్యాటర్ కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేకపోవడంతో రైజర్స్ ఉప్పల్‌లో చతికిలపడింది.


మయాంక్

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ఖాతాలో మరో ఓటమి చేరింది. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 14 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కామెరాన్ గ్రీన్ (40 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, ఇషాన్ కిషన్ (31 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (17 బంతుల్లో 37; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. అనంతరం హైదరాబాద్ 19.5 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ అగర్వాల్ (41 బంతుల్లో 48; 4 ఫోర్లు,1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (16 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

సూర్యకుమార్ విఫలం...

కెప్టెన్ రోహిత్ శర్మ (18 బంతుల్లో 28; 6 ఫోర్లు) ముంబై ఇన్నింగ్స్‌ను ధాటిగా మొదలు పెట్టాడు.


తిలక్

సుందర్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన అతను ఈ క్రమంలో ఐపీఎల్‌లో 6 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. నటరాజన్ ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టిన రోహిత్, అదే ఓవర్లో వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో ముంబై 53 పరుగులు చేసింది. అనంతరం రైజర్స్ బౌలింగ్ కట్టుదిట్టంగా సాగడంతో ముంబై స్కోరు వేగం మందగించింది. జాన్సెన్ ఒకే ఓవర్లో కిషన్, సూర్యకుమార్ (7)లను అవుట్ చేసి దెబ్బ కొట్టాడు. ఈ రెండు క్యాచ్‌లను మార్క్‌రమ్ అద్భుతంగా అందుకున్నాడు. 14 ఓవర్లలో ముంబై 109 పరుగులు చేసింది. అయితే చివరి 6 ఓవర్లలో చెలరేగిన ఆ జట్టు 83 పరుగులు రాబట్టింది. నటరాజన్ వేసిన 18వ ఓవర్లో వరుస బంతుల్లో గ్రీన్ 4, 4, 4, 6 తో చెలరేగడం విశేషం. ఈ క్రమంలో 33 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. భువీ తన చివరి 2 ఓవర్లలో 14 పరుగులే ఇచ్చినా, ఇతర బౌలర్లు విఫలమయ్యారు.


గ్రీన్

తిలక్ జోరు...

సొంతగడ్డపై ప్రత్యర్థి జట్టు హైదరాబాద్‌పై తిలక్ వర్మ సత్తా చాటాడు. తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజ్‌లో ఉన్న 24 నిమిషాల్లో ఫటాఫట్ బ్యాటింగ్ ప్రదర్శించాడు. జాన్సెన్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు కొట్టిన అతను... మర్కండే, భువీ బౌలింగ్‌లో ఒక్కో సిక్సర్ బాదాడు. భువీ బౌలింగ్‌లో మరో షాట్‌కు ప్రయత్నించి కవర్స్‌లో చిక్కడంతో అతని ఇన్నింగ్స్ ముగిసింది.

సమష్టి వైఫల్యం...

ఛేదనలో రైజర్స్‌కు సరైన ఆరంభం లభించలేదు. గత మ్యాచ్ హీరో బ్రూక్ (9), రాహుల్ త్రిపాఠి (7)లను బెహ్రన్‌డార్ఫ్ తన వరుస ఓవర్లో అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో మయాంక్ మాత్రం కొన్ని చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 6 ఓవర్లలో జట్టు స్కోరు 2 వికెట్లకు 42. మార్క్‌రమ్ (17 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోగా, అభిషేక్ (1) కూడా వెంటనే అవుటయ్యాడు. రైజర్స్ గెలుపు అవకాశాలు సన్నగిల్లుతున్న దశలో చావ్లా వేసిన 14వ ఓవర్ ఆశలు రేపింది. ఈ ఓవర్లో క్లాసెన్ వరుసగా 4, 6, 6, 4 బాదాడు. అయితే చివరి బంతికి అతను అవుట్ కావడంతో పరిస్థితి మళ్లీ మారిపోయింది. తర్వాతి ఓవర్లో మయాంక్ వెనుదిరిగాక జట్టు ఓటమి లాంఛనమే అయింది. అర్జున్ టెండూల్కర్ తన తొలి ఐపీఎల్ వికెట్‌తో హైదరాబాద్ ఇన్నింగ్స్ ముగించగానే ముంబై సంబరాల్లో మునిగిపోయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మార్క్‌రమ్ (బి) నటరాజన్ 28; ఇషాన్ కిషన్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 38; గ్రీన్ (నాటౌట్) 64; సూర్యకుమార్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 7; తిలక్ (సి) మయాంక్ (బి) భువనేశ్వర్ 37; డేవిడ్ (రనౌట్) 16; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 192. వికెట్ల పతనం:** 1-41, 2-87, 3-95, 4-151, 5-192. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-31-1, జాన్సెన్ 4-0-43-2, సుందర్ 4-0-33-0, నటరాజన్ 4-0-50-1, మర్కండే 4-0-35-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) సూర్యకుమార్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 9; మయాంక్ (సి) డేవిడ్ (బి) మెరిడిత్ 48; త్రిపాఠి (సి) ఇషాన్ కిషన్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 7; మార్క్‌రమ్ (సి) షోకీన్ (బి) గ్రీన్ 22; అభిషేక్ (సి) డేవిడ్ (బి) చావ్లా 1; క్లాసెన్ (సి) డేవిడ్ (బి) చావ్లా 36; సమద్ (రనౌట్) 9; జాన్సెన్ (సి) డేవిడ్ (బి) మెరిడిత్ 13; సుందర్ (రనౌట్) 10; భువనేశ్వర్ (సి) రోహిత్ (బి) అర్జున్ 2; మర్కండే (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 178. వికెట్ల పతనం:** 1-11, 2-25, 3-71, 4-72, 5-127, 6-132, 7-149, 8-165, 9-174, 10-178. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 2.5-0-18-1, బెహ్రన్‌డార్ఫ్ 4-0-37-2, మెరిడిత్ 4-0-33-2, షోకీన్ 1-0-12-0, చావ్లా 4-0-43-2, గ్రీన్ 4-0-29-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	1.354
లక్నో	5	3	2	6	0.761
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
ముంబై	5	3	2	6	-0.164
కోల్‌కతా	5	2	3	4	0.320
బెంగళూరు	5	2	3	4	-0.318
హైదరాబాద్	5	2	3	4	-0.798
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు

- 360 పాయింట్లకుగాను 360 పాయింట్లు స్కోరు చేసిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్
- ఓవరాల్‌గా 713 పాయింట్లతో ప్రపంచ రికార్డు సమం
- వరల్డ్‌కప్ స్టేజ్–1 టోర్నీ

అంటాల్యా (తుర్కియే): భారత అగ్రశ్రేణి ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో ఆమె క్వాలిఫయింగ్‌లో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పడంతోపాటు మరో ప్రపంచ రికార్డును సమం చేసింది. మంగళవారం జరిగిన మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ మొత్తం 713 పాయింట్లు స్కోరు చేసింది. 2015లో సారా లోపెజ్ (కొలంబియా) 713 పాయింట్లతో నమోదు చేసిన ప్రపంచ రికార్డును సురేఖ సమం చేసింది. అంతేకాకుండా కొత్త ఆసియా రికార్డును సృష్టించింది. 2017లో కొరియా ఆర్చర్ 709 పాయింట్లతో నమోదు చేసిన రికార్డును సురేఖ సవరించింది. క్వాలిఫయింగ్‌లో ఒక్కో ఆర్చర్ 72 బాణాలు సంధించాలి. తొలి రౌండ్‌లో 36, రెండో రౌండ్‌లో మరో 36 బాణాలు సంధిస్తారు. తొలి రౌండ్‌లో జ్యోతి సురేఖ 353 పాయింట్లు... రెండో రౌండ్‌లో 360 పాయింట్లు సాధించింది. రెండో రౌండ్‌లో జ్యోతి సురేఖ కొట్టిన 36 బాణాలు 10 పాయింట్ల సర్కిల్‌లోకి వెళ్లడం విశేషం. దాంతో ఆమె అందుబాటులో ఉన్న మొత్తం 360 పాయింట్లను తన ఖాతాలోకి వేసుకుంది. ఈ క్రమంలో జ్యోతి సురేఖ 360కి 360 పాయింట్లు స్కోరు చేసిన తొలి మహిళా ఆర్చర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ ప్రదర్శనతో 2015 నుంచి సారా లోపెజ్ (356 పాయింట్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును జ్యోతి సురేఖ బద్దలు కొట్టింది. 'ప్రపంచ రికార్డు సాధిస్తానని ఊహించలేదు. ఇదే నా అత్యుత్తమ ప్రదర్శన. టాప్ సీడ్‌తో మెయిన్ రౌండ్‌లో బరిలోకి దిగనుండటం సంతోషంగా ఉంది. ఎలిమినేషన్ రౌండ్లలోనూ పూర్తి ఏకాగ్రతతో పోటీపడతాను' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి సురేఖ వ్యాఖ్యానించింది. క్వాలిఫయింగ్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచిన సురేఖకు ఎలిమినేషన్ రౌండ్‌లలో టాప్ సీడ్ దక్కింది. భారత్‌కే చెందిన అదితి, అవ్‌నీత్ కౌర్ స్కోర్ల ఆధారంగా క్వాలిఫయింగ్ టీమ్ విభాగంలో భారత్ 2,112 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకొని నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. 2011 నుంచి భారత జట్టుకు ఆడుతున్న సురేఖ అంతర్జాతీయ టోర్నీలలో 30 కంటే ఎక్కువ పతకాలు సాధించింది.



హైదరాబాద్ మాజీ క్రికెటర్ అబ్దుల్ అజీమ్ మృతి



సాక్షి, హైదరాబాద్: దేశవాళీ క్రికెట్‌లో దూకుడైన ఓపెనర్‌గా పేరొందిన హైదరాబాద్ మాజీ క్రికెటర్ అబ్దుల్ అజీమ్ మంగళవారం కన్నుమూశారు. 62 ఏళ్ల అజీమ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. 80, 90 దశకాల్లో హైదరాబాద్ మేటి ఓపెనర్‌గా వెలుగొందారు. 1986లో తమిళనాడుతో జరిగిన రంజీ మ్యాచ్‌లో అజీమ్ ట్రిపుల్ సెంచరీ సాధించారు. 1980 నుంచి 1995 వరకు క్రికెట్ కెరీర్ కొనసాగించిన ఆయన 73 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 4644 పరుగులు చేశాడు. ఇందులో 12 శతకాలున్నాయి. అనంతరం హైదరాబాద్ జట్టుకు కోచ్‌గా, సెలక్టర్‌గా సేవలందించారు.

గట్టెక్కిన న్యూజిలాండ్

లాహోర్: పాకిస్తాన్‌తో మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ నాలుగు పరుగులతో గెలిచింది. ఆఖరి ఓవర్లో పాక్ విజయానికి 15 పరుగులు కావాల్సి ఉండగా, జోరు మీదున్న ఇఫ్తికార్ అహ్మద్ (24 బంతుల్లో 60; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) తొలి మూడు బంతుల్లో పది పరుగులు బాదాడు. ఇక మిగిలిన 3 బంతుల్లో 5 పరుగుల సులువైన సమీకరణం పాక్‌ను గెలుపు వాకిట నిలిపింది. అయితే బౌలర్ నీషమ్ (3/38) తర్వాతి మూడు బంతుల్లో ఒక్క పరుగైనా ఇవ్వకుండా, ఇఫ్తికార్‌తో పాటు రవూఫ్ (0)ను అవుట్ చేయడంతో పాకిస్తాన్ ఓడిపోయింది. అంతకుముందు న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది. తర్వాత పాక్ 20 ఓవర్లలో 159 పరుగుల వద్ద ఆలౌటైంది.

సినిమా


● ఇలియానా

తల్లి కానున్న ఇలియానా


ఇలియానా షేర్ చేసిన ఫొటోలు

''ఓ సాహసం ఆరంభం.. కమింగ్ సూన్. నా లిటిల్ డార్లింగ్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అని మంగళవారం సోషల్ మీడియాలో ఓ చిన్న బేబీ డ్రెస్ ఫొటో, మెడలో ఉన్న గొలుసుకి 'మమ్మా' (అమ్మ) అనే లాకెట్ ఉన్న ఫొటోని షేర్ చేశారు ఇలియానా. కాగా ఇలియానా తల్లి సమీరా ''మా ప్రపంచంలోకి త్వరగా రా.. నా గ్రాండ్ బేబీ'' అని కుమార్తె పెట్టిన పోస్ట్‌కి స్పందించారు. దీన్ని బట్టి ఇలియానా తల్లి కాబోతున్నారనే విషయం స్పష్టమవుతోంది. పలువురు బాలీవుడ్ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా ఆమెకు శుభాకాంక్షలు తెలుపగా.. కొందరు నెటిజన్లు మాత్రం 'పెళ్లెప్పుడు చేసుకున్నారు? ఫొటో పెట్టండి' అని పోస్ట్ చేశారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ఇలియానా నటించిన 'అన్‌ఫెయిర్ అండ్ లవ్లీ' చిత్రం రిలీజ్ కావాల్సి ఉంది. మరోవైపు 'సామ్ గజబ్' అనే మ్యూజిక్ వీడియోలో నటించారామె.

ఎన్టీఆర్‌తో సైఫ్ ఢీ


● కొరటాల శివ, సైఫ్ అలీఖాన్, ఎన్టీఆర్

ఎన్టీఆర్‌తో ఢీ కొనేందుకు సిద్ధమయ్యారు బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఎన్‌టీఆర్ 30' (వర్కింగ్ టైటిల్). ఈ మూవీతో శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ మూవీలో విలన్ పాత్రలో సైఫ్ అలీ ఖాన్ నటించనున్నారని వార్తలొచ్చాయి. ఈ విషయాన్ని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. 'జాతీయ అవార్డు గ్రహీత (సైఫ్ అలీఖాన్) హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా సెట్స్‌లో అడుగుపెట్టారు' అంటూ ఎన్టీఆర్, కొరటాల శివతో సైఫ్ అలీఖాన్ కలిసి ఉన్న ఫొటోలను యూనిట్ విడుదల చేసింది. 'ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2024 ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా ప్రభాస్ హీరోగా నటించిన 'ఆదిపురుష్' చిత్రంలో రావణుడి పాత్ర చేశారు సైఫ్ అలీఖాన్.

ఫలితం మన చేతుల్లో ఉండదు


● సమంత

''ఎందుకీ వేదాంతం... ఏంటా వైరాగ్యం?'' అంటూ మంగళవారం సమంత సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ పోస్ట్ గురించి నెటిజన్లు చర్చించుకోవడం మొదలుపెట్టారు. ఈ చర్చకు కారణం మహాభారతంలోని సమంత షేర్ చేసిన శ్లోకం.

'కర్మణ్యే వాధికారస్తే.. మా ఫలేషు కదాచన.. మా కర్మఫలహేతుర్భూః మాతే సంగోత్స్వ కర్మణి'

అనే శ్లోకంతో పాటు కారులో కూర్చుని ఎటో చూస్తున్న ఫొటోను షేర్ చేశారు సమంత. 'కర్మ చేయడానికి మాత్రమే గానీ ఆ కర్మఫలానికి అధికారివి కాదు.. ప్రతిఫలాపేక్షతో కర్మలను చేయకు.. అలాగని ఫలితాలకు భయపడి ప్రయత్నం చేయడం మానకు. ఏది ఏమైనా ముందుకు సాగిపో' అనేది ఈ గీతాశ్లోకానికి అర్థం. సమంత ఈ శ్లోకం పెట్టడానికి కారణం 'శాకుంతలం' అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఆ సినిమా ఆశించిన ఫలితం సాధించకపోవడంవల్లే 'ఫలితం మన చేతుల్లో ఉండదు.. ప్రయత్నాలు చేసుకుంటూ వెళ్లడమే' అని చెప్పడానికి సమంత ఈ శ్లోకాన్ని షేర్ చేశారన్నది నెటిజన్ల ఊహ.

కామెడీ చేయడం ఇష్టం

- సంయుక్తా మీనన్



''విరూపాక్ష' మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందింది. హారర్ మూవీ కాదు. కానీ ప్రేక్షకులు భయపడతారు. 1990ల నాటి కాలంలో ఈ మూవీ కథ జరుగుతుంది'' అన్నారు సంయుక్తా మీనన్. సాయిధరమ్ తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు .బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక సంయుక్తా మీనన్ మాట్లాడుతూ– ''బింబిసార' తర్వాత నేను సంతకం చేసిన రెండో చిత్రం 'విరూపాక్ష'. అయితే కరోనా లాక్‌డౌన్, తేజ్‌కి ప్రమాదం.. వంటి కారణాలతో ఈ సినిమా లేట్ అయింది. 'విరూపాక్ష' తర్వాత నేను ఒప్పుకున్న 'వకీల్ సాబ్, సార్' సినిమాలు ముందు రిలీజ్ అయ్యాయి. రుద్రవనం అనే గ్రామంలో జరిగే కథే 'విరూపాక్ష'. నేను నందిని అనే పల్లెటూరి అమ్మాయి పాత్ర చేశాను. నందినికి పొగరు, పట్టుదల ఎక్కువ ఉంటుంది. నందిని పాత్రకి, నిజ జీవితంలో నా క్యారెక్టర్‌కి పోలికే లేదు. బైక్ ప్రమాదం నుంచి కోలుకున్నాక తేజ్‌గారు ఎంతో ఎనర్జీతో ఈ మూవీ చేశారు. నాకు కామెడీ రోల్స్ ఇష్టం.. అవి చేయాలనుంది. ప్రస్తుతం కల్యాణ్ రామ్‌గారితో 'డెవిల్' చిత్రం చేస్తున్నా'' అన్నారు.

ఆ సినిమా వదులుకున్నందుకు బాధపడుతుంటా!

- ఖుష్బూ



''నా కెరీర్ ప్రారంభంలో రాఘవేంద్రరావు, పి. వాసు, భారతీరాజా, బాలచందర్, జంధ్యాల, గోపాల్ రెడ్డి వంటి ఎందరో గొప్ప దర్శకులతో పని చేశాను. నా పాత్ర బాగుందన్నా, బాగా లేదన్నా ఆ క్రెడిట్ దర్శకులదే. ఎందుకంటే వారు చెప్పినట్టే నేను చేస్తాను. ఇన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నానంటే కారణం నా పనిని ప్రేమిస్తాను.. అదే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది'' అని నటి ఖుష్బూ అన్నారు. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా శ్రీవాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన ఖుష్బూ చెప్పిన విశేషాలు.

- 'రామబాణం' ప్రధానంగా కుటుంబ బంధాల నేపథ్యంలో ఉంటుంది. మనం ఎంత డబ్బు సంపాదించినా, ఉన్నత స్థాయికి చేరినా కుటుంబ బంధం అనేది చాలా ముఖ్యం. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కుటుంబమంతా కలిసి ఉండాలని ఈ సినిమా చెబుతుంది. ప్రస్తుతం మనం తింటున్న ఫాస్ట్ ఫుడ్ వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ మూవీలో నేను చేసిన భువనేశ్వరి పాత్ర మనం మరిచిపోతున్న సంప్రదాయాలు, ఆహార వ్యవహారాలను గుర్తు చేసేలా ఉంటుంది.
- మొదట్లో తెలుగు సినీ పరిశ్రమ చెన్నైలోనే ఉండేది.. ఆ తర్వాత హైదరాబాద్‌కి తెలుగు ఇండస్ట్రీ వచ్చింది. అయితే నా కుటుంబం కోసం నేను అక్కడే ఉండిపోయాను. అప్పుడు తమిళ్‌లో ఎక్కువ చాన్సులు వచ్చాయి. డేట్స్ సర్దుబాటు కాక తెలుగులో 'చంటి' వంటి సినిమాని వదులుకోవాల్సి వచ్చింది. ఆ విషయంలో ఇప్పటికీ బాధ ఉంది.
- గోపీచంద్‌తో మొదటిసారి 'రామబాణం'లో నటించాను. జగపతిబాబుగారు నటుడు కాకముందు నుంచే నాకు తెలుసు. ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్‌గారు నిర్మించిన రెండు సినిమాల్లో నేను బాలనటిగా చేశాను. జగపతిగారు మంచి మనసున్న వ్యక్తి. నేను చౌ మామా అని పిలుస్తాను.
- ప్రస్తుత కాలంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి గొప్ప నిర్మాణ సంస్థను చూడటం చాలా కష్టం. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగారు సెట్స్‌కి పెద్దగా వచ్చేవారు కాదు. వారు వరుస హిట్స్ అందుకోవడం సంతోషంగా ఉంది. శ్రీవాస్‌తో మొదటిసారి పని చేస్తున్నట్లు అనిపించలేదు. తనతో పని చేయడం చాలా సౌకర్యంగా అనిపించింది.
- అప్పటికి, ఇప్పటికి మేకింగ్ పరంగా, నటన పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. నేనే ఇప్పటి తరం నుంచి కొన్ని నేర్చుకోవాలి. హీరోయిన్ డింపుల్ హయతి మేకప్, హెయిర్ స్టైల్ చేసుకునే విధానం నన్ను ఆకట్టుకుంది. నటనలోనూ మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు సెటిల్డ్‌గా పెర్ఫార్మ్ చేస్తున్నారు. అయితే అప్పట్లో లొకేషన్‌లో సరైన వసతులు లేకపోయినా ఎలా మేకప్ వేసుకోవాలి? ఎలా కాస్ట్యూమ్ మార్చుకోవాలి? అనే ట్రిక్స్ మాకు తెలిసేవి. ఈ తరానికి అలాంటివి తెలీదు.
- కెరీర్‌లో గ్లామర్ రోల్స్ చేశాను, డ్యాన్స్‌లు చేశా. ఇప్పుడు అవన్నీ అయిపోయాయి. ప్రేక్షకులు సినిమా చూసే కోణం కూడా మారింది. వారి మనసుల్లో స్థానం సంపాదించుకునే పాత్రలు చేయాలి. అలాంటి పాత్రనే 'రామబాణం'లో చేశాను. తెలుగులో ఇంకా మంచి పాత్రలు చేయాలని ఉంది. పాత్రకి ప్రాధాన్యత ఉంటే నిడివి తక్కువ అయినా చేస్తాను. ప్రస్తుతం మనసుకి నచ్చిన పాత్రలే ఎంచుకుంటున్నాను.. అందుకే తక్కువ సినిమాలు చేస్తున్నా. విజయ్ హీరోగా చేసిన 'వారసుడు'లో నాది 18 నిమిషాల పాత్ర.. అయితే సినిమా నిడివి ఎక్కువ కావడంతో నా పాత్ర సన్నివేశాలు తొలగించారు.
- అమితాబ్ బచ్చన్‌గారికి నేను చాలా పెద్ద అభిమానిని. నా బెడ్ రూమ్‌లో ఇప్పటికీ ఆయన పోస్టర్స్ ఉంటాయి. ఆయనతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేశాను. కానీ జోడీగా చేయలేదనే బాధ ఉంది. 'చీనీ కమ్' చిత్రంలో అమితాబ్‌గారితో టబు నటించింది. ఆ చాన్స్ నాకు రాలేదని బాధపడ్డాను. టబుకి ఫోన్ చేసి, అది నేను చేయాల్సిన పాత్ర.. నువ్వు ఎలా చేస్తావ్? అని అడిగాను (నవ్వుతూ). చిరంజీవి, బాలకృష్ణగార్లకి జోడీగా చేయలేదు.. అవకాశం వస్తే చేయాలని ఉంది.
- సినిమాల్లో డైరెక్టర్స్ సృష్టించిన పాత్రకి తగ్గట్లు చేయాలి. కానీ, టీవీ షోల్లో నాకు నచ్చినట్టు ఉండొచ్చు. ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నాను. గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి, ఓడిపోయాను. అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగానో, ఎమ్మెల్యేగానో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

థ్రిల్‌కి గురి చేసే మీరా


● కాకర్ల శ్రీనివాస్

ప్రముఖ దర్శకులు బాపు వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేసిన కాకర్ల శ్రీనివాస్ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం 'హలో మీరా'. గార్గేయి యల్లాప్రగడ లీడ్ రోల్ చేశారు. జీవన్ సమర్పణలో డా. లక్ష్మణరావు దిక్కల, వరప్రసాదరావు దుంపల, పద్మ కాకర్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. కాకర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఒకే ఒక్క పాత్రతో రూపొందిన చిత్రం 'హలో మీరా'. వైవిధ్యభరితమైన కథలో వచ్చే ఊహించని ట్విస్టులతో ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. తెరపై కనిపించేది మీరా (గార్గేయి పాత్ర పేరు) అయినా వినిపించే పాత్రలన్నీ సగటు ప్రేక్షకుడి మదిలో మెదిలేలా ఉంటాయి. ప్రేమ, స్నేహం, స్నేహితుల కోసం దెబ్బలు తినడం, రౌడీయిజమ్, బ్రేకింగ్ న్యూస్ వంటి అన్ని అంశాలు ప్రేక్షకుడి కళ్ల ముందు ఉండేలా జాగ్రత్త పడ్డాం. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది'' అన్నారు.

నటుడు అల్లు రమేశ్ మృతి



రంగస్థల నటుడు, హాస్య నటుడు అల్లు రమేశ్ విశాఖపట్నంలో గుండెపోటుతో మంగళవారం కన్నుమూశారు. వైజాగ్ దొండపర్తికి చెందిన రాముడు, దేముడమ్మ దంపతులకు జన్మించిన అల్లు రమేశ్ నాటక రంగం నుంచి చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. తరుణ్ హీరోగా నటించిన 'చిరుజల్లు' – 2001 సినిమాతో నటుడిగా ప్రయాణం ప్రారంభించారు అల్లు రమేశ్. ఆ చిత్రంలో తరుణ్ ఫ్రెండ్ పాత్ర చేశారు. 'బ్లేడ్ బాబ్జీ, తోలుబొమ్మలాట, మధుర వైన్స్, కేరింత, కెవ్వు కేక, దేశముదురు, నిజం, నెపోలియన్'.. ఇలా దాదాపు 50 సినిమాల్లో నటించారు. అల్లు రమేశ్ నటించిన చివరి చిత్రం 'అనుకోని ప్రయాణం'. అలాగే 'మావిడాకులు' అనే వెబ్ సిరీస్‌లోనూ నటించారు. ఆయనకి భార్య వరలక్ష్మి, కుమారులు వంశీ, రేవంత్ ఉన్నారు.



ముంబై యాపిల్ స్టోర్ ప్రారంభోత్సవంలో సీఈఓ టిమ్ కుక్

యాపిల్ స్టోర్ వచ్చేసింది..

ముంబైలో తొలి స్టోర్ ప్రారంభించిన సీఈవో టిమ్ కుక్ • వెల్లువెత్తిన అభిమానులు

ముంబై: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ భారత్‌లో తమ తొలి రిటైల్ స్టోర్‌ను మంగళవారం ఆవిష్కరించింది. ముంబై బీకేసీ ప్రాంతంలోని జియో వరల్డ్ డ్రైవ్ మాల్‌లో దీన్ని కంపెనీ సీఈవో టిమ్ కుక్ ప్రారంభించారు. 'భారత్‌లో మా తొలి స్టోర్ యాపిల్ బీకేసీని ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని ఆయన ట్వీట్ చేశారు. యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రిటైల్) డియెర్డ్రె ఓ'బ్రియెన్‌తో కలిసి కస్టమర్లను స్వయంగా ఆహ్వానించారు. స్టోర్‌ను సందర్శించేందుకు, కొనుగోళ్లు జరిపేందుకు అభిమానులు వెల్లువెత్తారు. యాపిల్ తమ రెండో స్టోర్‌ను గురువారం (ఏప్రిల్ 20) న్యూఢిల్లీలో ప్రారంభించనుంది. యాపిల్ దాదాపు పాతికేళ్లుగా భారత్‌లో వివిధ భాగస్వాముల ద్వారా తమ ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీకి భారత్‌లో 2,500 మంది సిబ్బంది ఉండగా, తమ యాప్ వ్యవస్థ ద్వారా పరోక్షంగా 10 లక్షల పైచిలుకు ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతున్నట్లు అంచనా. చైనా, కొరియా బ్రాండ్ల ఆధిపత్యం ఉన్న దేశీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో ప్రస్తుతం యాపిల్ వాటా సుమారు 3 శాతమే ఉన్నప్పటికీ ఇటీవల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై కంపెనీ ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.



రాత్రి నుంచే క్యూ..

దేశీయంగా తొలి యాపిల్ స్టోర్‌లో అందరి కన్నా ముందుగా ప్రవేశం పొందేందుకు అభిమానులు బారులు తీరారు. రాజస్తాన్ తదితర ప్రాంతాల నుంచి కూడా వచ్చిన కొందరు కస్టమర్లు క్రితం రోజు రాత్రి నుంచే క్యూ కట్టారు. టిమ్ కుక్‌తో కలిసి ఫొటోలు దిగేందుకు, ఆటోగ్రాఫ్‌లు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఓ కస్టమరు 40 ఏళ్ల నాటి యాపిల్ తొలి మ్యాక్ ఎస్‌ఈ కంప్యూటర్‌ను కూడా వెంట తీసుకొచ్చి తన అభిమానం చాటుకున్నారు. ముంబైలో తిరిగే నలుపు, పసుపు రంగు ట్యాక్సీల థీమ్‌తో, 20,000 చ.అ. విస్తీర్ణంలో యాపిల్ బీకేసీని తీర్చిదిద్దారు. ఇందులో 18 భారతీయ భాషల్లో మాట్లాడగలిగే 100 మంది సిబ్బంది ఉంటారు. వీరిలో దాదాపు సగం మంది మహిళలు. యాపిల్ ఉత్పత్తులతో పాటు గ్యాడ్జెట్ల రిపేరింగ్ వంటి సర్వీసులను కూడా ఇందులో పొందవచ్చు. యాపిల్ ఈ స్టోర్‌ను 11 ఏళ్ల పాటు నెలకు రూ. 42 లక్షల చొప్పున అద్దెకు తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

డిజిటల్ చెల్లింపుల జోరు

- 2.9 కోట్ల లావాదేవీలతో బెంగళూరు టాప్
- వరల్డ్‌లైన్ ఇండియా నివేదిక



చెన్నై: దేశీయంగా గతేడాది డిజిటల్ చెల్లింపు లావాదేవీల్లో బెంగళూరు నగరం అగ్రస్థానంలో నిల్చింది. 2022లో 65 బిలియన్ డాలర్ల విలువ చేసే 2.9 కోట్ల లావాదేవీలతో టాప్ ప్లేస్ దక్కించుకుంది. పేమెంట్ సర్వీసుల సంస్థ వరల్డ్‌లైన్ ఇండియా ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. నివేదిక ప్రకారం న్యూఢిల్లీ (1.96 కోట్ల లావాదేవీలు, 50 బిలియన్ డాలర్ల విలువ), ముంబై (1.87 కోట్ల లావాదేవీలు, 49.5 బిలియన్ డాలర్ల విలువ), చెన్నై (1.43 కోట్ల లావాదేవీలు, 35.5 బిలియన్ డాలర్ల విలువ), పుణే (1.5 కోట్ల లావాదేవీలు, 32.8 బిలియన్ డాలర్ల విలువ) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో అద్భుతమైన పురోగతి నమోదవుతోందని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు. దేశీయంగా నగదు చలామణీని తగ్గించే దిశగా చెల్లింపులకు సంబంధించి బహుళ సాధనాలు అందుబాటులోకి రావడం మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ

- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 184 పాయింట్లు
- 17,700 దిగువకు నిఫ్టీ

ముంబై: బ్యాంకింగ్, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ కొనసాగడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సెంటిమెంట్ మరింత బలహీనపడింది. ఉదయం ట్రేడింగ్ మొదలైన కొద్దిసేపటికే సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఇంట్రాడే కనిష్టానికి పతనమయ్యాయి. అయితే చివర్లో రియల్టీ, ఫార్మా షేర్లకు రాణించడంతో నష్టాలు కొంత మేరకే పరిమితం అయ్యాయి. సెన్సెక్స్ 80 పాయింట్ల లాభంతో 59,991 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 534 పాయింట్ల పరిధిలో 59,579 వద్ద కనిష్టాన్ని, 60,113 గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 184 పాయింట్లు నష్టపోయి 59,727 వద్ద నిలిచింది. నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 17,767 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 17,610-17,767 శ్రేణిలో కదలాడింది. చివరికి 47 పాయింట్ల పతనమై



17,660 వద్ద స్థిరపడింది. ఐటీ, మెటల్, ఫార్మా రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్ సూచీ అరశాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం చొప్పున లాభపడ్డాయి. "అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికం ఫలితాలు బలహీనంగా నమోదు కావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు. విదేశీ ఇన్వెస్టర్లు రూ.810 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.401 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ రిజర్వ్‌తో సహా ఇతర కేంద్ర బ్యాంకులు కఠినతర ద్రవ్య విధాన వైఖరిని అవలంభించవచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత మార్కెట్లోకి వచ్చిన తొలి ఐపీఓ అవెలాన్ టెక్నాలజీస్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.436)తో పోలిస్తే ఒకశాతం డిస్కౌంట్‌తో రూ.431 వద్ద లిస్టయింది. ఒక దశలో 11 శాతం క్షీణించి రూ.388 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 9% నష్టపోయి రూ.397 వద్ద నిలిచింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 3.17 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ వ్యాల్యుయేషన్ రూ.2,595 కోట్లుగా నమోదైంది.
- సోడా యాష్ ధరలు 3-4 శాతం తగ్గించడంతో టాటా కెమికల్స్ షేరు 6% నష్టపోయి రూ.932 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 6.50% క్షీణించి రూ.926 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

ఐసీఐసీఐ లాంబార్డ్ లాభం జూమ్

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ గతేడాది చివరి త్రైమాసికంలో (2022-23, క్యూ4) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ. 437 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,636 కోట్ల నుంచి రూ. 5,256 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 5.5 చొప్పున తుది డివిడెండ్‌ను ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 36 శాతం పుంజుకుని రూ. 1,729 కోట్లకు చేరింది. 2021-22లో రూ. 1,271 కోట్ల లాభం సాధించింది

టాటా కాఫీ లాభం అప్

క్యూ4లో రూ. 49 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజం టాటా కాఫీ గతేడాది(2022-23) చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లో రూ. 49 కోట్ల నికర లాభం ఆర్జించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలం(క్యూ4)లో ఆర్జించిన రూ. 41 కోట్లతో పోలిస్తే ఇది 20 శాతం వృద్ధి. మొత్తం ఆదాయం సైతం 11 శాతం పుంజుకుని రూ. 723 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 656 కోట్ల ఆదాయం సాధించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 78 శాతం జంప్‌చేసి రూ. 263 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 21 శాతం ఎగసి రూ. 2,850 కోట్లను దాటింది.



అన్‌లిమిటెడ్ ఫ్యాషన్ ఈద్ కలెక్షన్లు

హైదరాబాద్: అన్‌లిమిటెడ్ ఫ్యాషన్ రంజాన్ పండుగ కోసం 'సెలబ్రేషన్-ఫ్యాషన్' పేరుతో కొత్త కలెక్షన్‌ను తీసుకురానుంది. మహిళలు, పురుషులు, పిల్లలకు అద్భుతమైన డిజైన్లు కలిగిన వస్త్రాలెన్నో ఇందులో ఉన్నాయి. కొత్త కలెక్షన్ ప్రారంభ ధర రూ.149 నుంచి మొదలవుతుంది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఈ వస్త్రాలు ఈద్ పండుగకు మరింత శోభ తెస్తాయని కంపెనీ ప్రకటనలో తెలిపింది.

జాబ్ పాయింట్

ఏపీఎస్‌ఎఫ్‌సీ, విజయవాడలో వివిధ ఉద్యోగాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్(ఏపీఎస్ఎఫ్‌సీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** మేనేజర్-06, డిప్యూటీ మేనేజర్-03, అసిస్టెంట్ మేనేజర్-05.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.esfc.ap.gov.in

ఏపీసీపీడీసీఎల్, విజయవాడలో 100 అప్రెంటిస్‌లు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీసీపీడీసీఎల్).. ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఉంటుంది. అర్హులైన ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 100
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-30, టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్-70.
» **విభాగాలు:** ఇంజనీరింగ్ డిగ్రీ-ఈఈఈ, డిప్లొమా-డీఈఈఈ.
» **స్టయిపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ.8000 చెల్లిస్తారు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) 2021-2022 సంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. వయసు: 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **శిక్షణా కాలం:** ఒక సంవత్సరం.
» **ఎంపిక విధానం:** డిగ్రీ/డిప్లొమా కోర్సులో అభ్యర్థి పొందిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.apcpdcl.in

ఐఆర్‌డీఏఐ, హైదరాబాద్‌లో 45 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 45
» **విభాగాలు:** ఆక్చురియల్, ఫైనాన్స్, లా, ఐటీ, రీసెర్చ్, జనరలిస్ట్.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో గ్రాడ్యుయేషన్/బ్యాచిలర్స్ డిగ్రీ/ఇంజనీరింగ్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.44,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, డిస్క్రిప్టివ్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 60 నిమిషాలు సమయం ఉంటుంది. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 160 మార్కులకు గాను 160 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఈ డిస్క్రిప్టివ్ పరీక్షలో భాగంగా ఇంగ్లిష్, ఎకనామిక్, సోషల్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2023.
» **వెబ్‌సైట్:** www.irdai.gov.in

ఎన్‌ఎఫ్‌డీబీ, హైదరాబాద్‌లో కన్సల్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్(ఎన్ఎఫ్‌డీబీ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **విభాగాలు:** టెక్నికల్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,హిందీ,ఐటీ
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎన్ఎఫ్‌డీబీ, ఫిష్ బిల్డింగ్, పిల్లర్ నెం.235, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, ఎస్‌వీఎన్‌పీఏ పోస్టు, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.05.2023.
» **వెబ్‌సైట్:** www.nfdb.gov.in

యూవోహెచ్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్.. తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.20,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డీన్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.04.2023.
» **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

పాలిటెక్నిక్ డిప్లొమా.. భవితకు ధీమా

» తెలుగు రాష్ట్రాల్లో పాలీసెట్ 2023 నోటిఫికేషన్లు విడుదల
» పదితోనే టెక్నికల్ రంగంలో కెరీర్‌కు మార్గం

పదో తరగతి తర్వాత స్వల్ప వ్యవధిలోనే ఉద్యోగం, ఉపాధి పొందాలనుకునే వారికి అందుబాటులో ఉన్న చక్కటి మార్గం.. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం పాలీసెట్ -2023 ప్రకటనలు విడుదలయ్యాయి. పాలీసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడేళ్లు, మూడున్నరేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. టెక్నికల్ కోర్సులతోపాటు అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ వంటి ప్రత్యేక డిప్లొమా కోర్సుల్లోనూ చేరొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో పాలిటెక్నిక్ కోర్సులు, ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ పరీక్ష వివరాలు..



పదోతరగతి తర్వాత విద్యార్థి వేసే ప్రతి అడుగు ఎంతో కీలకమైంది. అదే భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుంది. టెన్త్ తర్వాత పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి పూర్తిచేసుకుంటే.. చిన్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్య అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. డిప్లొమాలో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులుంటాయి. వీటిని పూర్తిచేసిన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. వీరికి ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలు విస్తృతం. పలు పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు లభిస్తున్నాయి.

డిప్లొమా కోర్సులు

సంప్రదాయ డిప్లొమా కోర్సులతోపాటు ప్రస్తుతం డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ, వెబ్ డిజైనింగ్ తదితర కోర్సులను పలు పాలిటెక్నిక్ కాలేజీలు అందిస్తున్నాయి. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఇష్టమైన కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పాలీసెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

టెక్నికల్ కోర్సులు

- సివిల్, మెకానికల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, గార్మెంట్ టెక్నాలజీ, హోమ్‌సైన్స్, మెటలర్జికల్, కెమికల్, సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ రిఫ్రిజరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, పెట్రోలియం టెక్నాలజీ, ఫుట్‌వేర్, ప్యాకేజింగ్, ప్రింటింగ్, లెదర్ టెక్నాలజీ వంటివి ఉన్నాయి.
- **నాన్ టెక్నికల్:** తెలంగాణ రాష్ట్రంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరి కల్చర్ వంటి నాన్ టెక్నికల్ డిప్లొమా కోర్సుల్లో పాలీసెట్ ద్వారా ప్రవేశం పొందే వీలుంది.

కాలవ్యవధి

టెక్నికల్ కోర్సులు మూడేళ్లు లేదా మూడున్నరేళ్ల కాలవ్యవధితో అందిస్తారు. నాన్ టెక్నికల్ కోర్సులు మూడేళ్లు లేదా రెండేళ్ల కాలవ్యవధితో ఉంటాయి. సెమిస్టర్ విధానంలో బోధన ఉంటుంది. కోర్సులో భాగంగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కూడా ఉంటుంది.

అర్హతలు

పదోతరగతి లేదా తత్సమాన విద్యను మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా కనీసం 35 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఆయా రాష్ట్రాల పాలిసెట్‌లకు దరఖాస్తుకు అర్హులు.

పాలీసెట్ పరీక్షలు ఇలా

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పాలిసెట్ పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు.

ఏపీ పాలీసెట్

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షలో మొత్తం 120 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మ్యాథ్స్-50, ఫిజిక్స్-40, కెమిస్ట్రీ విభాగాల నుంచి 30 చొప్పున ప్రశ్నలుంటాయి.

తెలంగాణ పాలీసెట్

- తెలంగాణ పాలీసెట్ ద్వారా రెగ్యులర్ పాలిటెక్నిక్ కోర్సులతోపాటు అగ్రికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, హార్టికల్చర్ డిప్లొమాల్లో ప్రవేశాలు పొందవచ్చు. తెలంగాణ పాలీసెట్‌లో మ్యాథ్స్-60, ఫిజిక్స్-30, కెమిస్ట్రీ-30, బయాలజీకి-30 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2గంటలు. రెగ్యులర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే వారు బయాలజీ విభాగాన్ని రాయనవసరం లేదు. అన్ని కోర్సులు లేదా ప్రత్యేకమైన కోర్సుల్లో చేరాలనుకునే వారు మాత్రమే బయాలజీ విభాగాన్ని రాయాలి.
- తెలంగాణ పాలీసెట్ ప్రవేశాలకు సంబంధించి ప్రతి అభ్యర్థికి రెండు వేర్వేరు ర్యాంకులను జనరేట్ చేస్తారు. టెక్నికల్ పాలిటెక్నిక్, అగ్రికల్చర్ అండ్ వెటర్నరీ డిప్లొమాగా ర్యాంకులను జనరేట్ చేసి ప్రవేశాలను కల్పిస్తారు.
- టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే వారి మార్కుల విధానం 120గా ఉంటుంది. ఇందులో మ్యాథ్స్-60,ఫిజిక్స్-30,కెమిస్ట్రీ-30 గా ఉంటాయి.
- అగ్రికల్చర్ అండ్ వెటర్నరీ డిప్లొమా కోర్సుల మార్కుల విధానం కూడా 120గా ఉంటుంది. కాని ఇందులో మ్యాథ్స్ (60/2=30)-30, ఫిజిక్స్-30, కెమిస్ట్రీ-30, బయాలజీలో 30 మార్కులుగా ఉంటాయి.

ఉన్నత విద్య

డిప్లొమా పూర్తిచేసిన అనంతరం ఉన్నత విద్య మీద ఆసక్తి ఉంటే.. ఈసెట్ పరీక్ష రాసి లేటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బీటెక్/బీఈ రెండో సంవత్సరంలో చేరొచ్చు. ఈ విద్యార్హతతో ఎంసెట్, ఐఐటీ-జేఈఈ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు పోటీ పడొచ్చు.

ఉద్యోగావకాశాలు

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. రైల్వే, ఆర్మీ, గెయిల్, ఓఎన్‌జీసీ, డీఆర్‌డీఓ, బీహెచ్‌ఈఎల్ మహారత్న, నవరత్న, రైల్వేల్లో జేఈ పోస్టులు, సింగరేణి సంస్థలో అవకాశాలు లభిస్తాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయం తదితరశాఖల్లో డిప్లొమా విద్యార్హతతో ఉద్యోగావకాశాలున్నాయి.

ప్రైవేట్ రంగం

ఈ కోర్సులను పూర్తిచేసిన అభ్యర్థులు ప్రైవేట్ రంగంలో కన్‌స్ట్రక్షన్, ఆటోమొబైల్, పవర్‌ప్లాంట్స్, కమ్యూనికేషన్స్, మ్యానుఫాక్చరింగ్ తదితర విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్థులతో పోలిస్తే డిప్లొమా కోర్సులను పూర్తిచేసిన వారికి సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ముఖ్య తేదీలు

టీఎస్ పాలీసెట్

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 24, 2023
- టీఎస్ పాలీసెట్ పరీక్ష తేదీ: మే 17, 2023
- ఫలితాలు: పరీక్ష జరిగిన 12 రోజుల తర్వాత.
- వెబ్‌సైట్: www.polycet.sbtet.telangana.gov.in

ఏపీ పాలీసెట్

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 30, 2023
- ఏపీ పాలీసెట్ పరీక్ష తేదీ: మే 10, 2023
- ఫలితాలు: మే 25, 2023
- వెబ్‌సైట్: https://polycetap.nic.in

క్లుప్తంగా...

ప్రైవేటు స్కూళ్లలో 9,064 మందికి ఉచిత ప్రవేశాలు

విద్యా హక్కు చట్టం ప్రకారం సీట్లు కేటాయించినట్లు విద్యా శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూళ్లలోని 1వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికైన అర్హుల జాబితాను పాఠశాల విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హత పొందిన వారిలో నుంచి.. మొదటి లాటరీ విధానం, కిలోమీటర్ సచివాలయ పరిధి వారీగా 9,064 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులు, వారికి కేటాయించిన స్కూళ్ల వివరాలను జిల్లా విద్యా శాఖ అధికారులకు, అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్‌లకు, సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపించారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. జిల్లా విద్యా శాఖ అధికారులు, అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్లు ఈనెల 19 నుంచి 25వ తేదీ లోగా విద్యార్థులు జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలపై స్పందించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ వ్యాజ్యంపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యాజ్యంపై స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యా శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు, పాఠశాల విద్య, సాంఘిక సంక్షేమ శాఖల డైరెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ప్రభుత్వ హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు లేవంటూ కాకినాడ జిల్లా జయప్రకాశ్ నగర్‌కు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది గొర్రెముచ్చు అరుణ్‌శౌరి వాదనలు వినిపిస్తూ.. హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

పాథాలజీ రిపోర్టులపై తీర్పును అమలు చేస్తున్నారా?

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో చేసే వైద్య పరీక్షల రిపోర్టులపై పాథాలజీలో పీజీ చేసిన మెడికల్ ప్రాక్టీషనర్ సంతకం ఉండాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదని హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు తీర్పు అమలయ్యేలా ఆదేశాలివ్వాలని కృష్ణా జిల్లాకు చెందిన జనతా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు నారాయణరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది జి.నర్సింహారావు వాదనలు వినిపిస్తూ, పాథాలజీ రిపోర్టులపై అనర్హులు సంతకాలు చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల వాటి విశ్వసనీయతపై సందేహాలు కలుగుతున్నాయని చెప్పారు. పాథాలజీ రిపోర్టులపై పీజీ చేసిన మెడికల్ ప్రాక్టీషనర్ సంతకమే ఉండాలని సుప్రీంకోర్టు 2017లో తీర్పు వెలువరించిందని తెలిపారు. కానీ ఈ తీర్పు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది.

దేవాలయ భూముల్లో ఇటుక బట్టీల నిర్మాణంపై హైకోర్టు స్టే

సాక్షి, అమరావతి : కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం కవులూరులోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం భూముల్లో ఇటుకబట్టీల నిర్మాణంపై హైకోర్టు స్టే విధించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ తదితరులను ఆదేశించింది. వారికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంతాన వేణుగోపాల స్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానం భూములను కొందరు ఆక్రమించుకొని ఇటుక బట్టీలు నిర్మిస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదంటూ విజయవాడకు చెందిన గగ్గర కృష్ణారావు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రియాంక వాదనలు వినిపిస్తూ.. భూములను స్వాధీనం చేసుకునేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు.



తిరుపతి జిల్లా శేషం పేటలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



పార్వతీపురం మన్యం జిల్లా వజ్జాయిగూడలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే కళావతి



గ్రేటర్ విశాఖ వైఎస్సార్ నగర్‌లో స్టిక్కర్ అతికిస్తున్న విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు

ఊరూరా 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదం

- సీఎం పాలనకు మద్దతుగా 59 లక్షల మిస్డ్ కాల్స్
- 'జగనన్నే మా భవిష్యత్తు'కు అపూర్వ మద్దతు

సాక్షి,అమరావతి: ప్రజలే ప్రభుత్వంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాన్ని ప్రజల గడప వద్దకు చేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు అపూర్వ రీతిలో మద్దతుగా నిలిచారు. వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' మెగా పీపుల్స్ సర్వేకు రాష్ట్రవ్యాప్తంగా కనీవినీ ఎరుగని రీతిలో మద్దతు లభిస్తోంది. గ్రామాలు మొదలు పట్టణాల వరకు 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదం మార్మోగుతోంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తాడేపల్లిలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ మెగా సర్వేలో ఇప్పటివరకు 59 లక్షల కుటుంబాలు సీఎం జగనన్న పాలనకు మద్దతు పలికాయని తెలిపారు. ఏప్రిల్ 7న జగనన్నే మా భవిష్యత్తు పేరుతో చేపట్టిన కార్యక్రమం దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు నమోదు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో వైఎస్సార్‌సీపీ క్యాడర్ రెట్టింపు ఉత్సాహంతో 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోందని కొనియాడారు.

సీఎం పర్యటనల వాయిదాపై తప్పుడు కథనాలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు సంబంధించి కొన్ని పత్రికలు, మీడియాలో వచ్చిన కథనాల్లో నిజం లేదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిపాలనాపరమైన, ఆర్థిక పరమైన కారణాలతోనే సీఎం పర్యటనలు వాయిదా పడ్డాయని తెలిపారు. జగనన్న వసతి దీవెనకు సంబంధించి అనంతపురం జిల్లా పర్యటన వాయిదాకు తగినన్ని నిధులు లభ్యత లేకపోవడమే కారణమన్నారు. సీఎం జగన్ వ్యక్తిగత విదేశీ పర్యటన వాయిదాకు రాష్ట్ర ప్రయోజనాలే కారణమని చెప్పారు. 'ఏప్రిల్‌లో సహజంగానే కొంత ఆర్థిక సమస్యలుంటాయి. ఈ నేపథ్యంలో నిధులు సమకూర్చలేమని, సీఎం పర్యటన వాయిదా వేసుకోవాలని ఆర్థిక శాఖ కోరింది. దీంతో వసతి దీవెన కార్యక్రమం వాయిదా పడింది' అని పేర్కొన్నారు. సీఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ ఎస్.ఎస్.రావత్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలివీ..

కీలక దశకు చర్చలు..

రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రధానిని కలసి ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ వస్తున్నారు. 2022 జనవరిలో ముఖ్యమంత్రి జగన్ ప్రధాని మోదీని కలిసిన సందర్భంగా ప్రధానమైన పది అంశాలను ప్రస్తావించడమే కాకుండా వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో కార్యదర్శుల కమిటీని నియమించి సీఎం జగన్ ప్రస్తావించిన ప్రధాన అంశాలను అప్పగించారు. 2022 జనవరి 24న జరిగిన కమిటీ తొలి సమావేశంలో ప్రధానంగా రెవెన్యూ లోటు, ఓవర్ బారోయింగ్, పోలవరం సవరించిన అంచనాలకు ఆమోదం, తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలపై చర్చించాం. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్‌కు విద్యుత్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ జెన్‌కోను ఆదేశిస్తూ కేంద్ర ఇంధన శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై కోర్టు స్టే కూడా వెకేట్ అయింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మార్చి 17వ తేదీన మరోసారి ప్రధానిని కలసి రాష్ట్రానికి చెందిన కీలక అంశాలపై త్వరగా తేల్చాలని కోరారు. కేంద్ర కమిటీ సూచనల మేరకు నాతో పాటు ఆర్థిక, జలవనరుల శాఖ అధికారులు ఢిల్లీలోనే ఉంటూ పూర్తి స్థాయిలో చర్చలు జరిపాం. వీటిపై ప్రధానితో చర్చించేందుకు మార్చి 29న ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీ వచ్చారు. మూడు నాలుగు అంశాల్లో చర్చలు కీలక దశకు చేరుకున్నందున రాష్ట్ర అధికారుల బృందం బుధవారం ఢిల్లీలో కేంద్ర కమిటీతో సమావేశం కానుంది. ముఖ్యమంత్రి జగన్ చొరవ తీసుకుని జోక్యం చేసుకోవడంతో మరింత రెవెన్యూ లోటు భర్తీ అంశాన్ని కేంద్ర కమిటీ తిరిగి పరిగణలోకి తీసుకుంది. రెవెన్యూ లోటు భర్తీ కింద కేంద్రం రూ.4,000 కోట్లు మాత్రమే ఇచ్చింది. విభజనకు ముందే పెన్షన్లు పెంచామని కేంద్రం సందేహాలను నివృత్తి చేయడంతో మరింత లోటు భర్తీపై కేంద్ర కమిటీ తిరిగి పరిశీలన చేస్తోంది. రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చేలా ఢిల్లీలో అత్యున్నత స్థాయిలో కీలక నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ఈ నేపథ్యంలో ప్రధానితో మాట్లాడాల్సి వస్తే మీరు అందుబాటులో ఉంటే బాగుంటుందని ముఖ్యమంత్రి జగన్‌ను అభ్యర్థించాం. దీంతో ముఖ్యమంత్రి జగన్ తన వ్యక్తిగత పర్యటనను వాయిదా వేసుకున్నారు.

పోలవరంపై..

పోలవరం సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్ర జల సంఘం సాంకేతిక సలహా కమిటీ ఇప్పటికే ఆమోదించింది. ఇప్పుడు కేంద్ర కేబినెట్ ఆమోదించాల్సి ఉంది. అందువల్ల అవసరమైతే ఢిల్లీ పర్యటనకు రావాల్సి ఉంటుందని ముఖ్యమంత్రిని కోరాం. కేంద్ర ఆర్థిక, విద్యుత్, జలవనరుల శాఖల మంత్రులతో పాటు ప్రధాని షెడ్యూల్‌ను బట్టి సీఎం కలుసుకుంటారు. అందుకే వ్యక్తిగత విదేశీ పర్యటనను వాయిదా వేసుకున్నారు.

ఉద్యోగులకు ఈ ఏడాదీ మెడికల్ రీయింబర్స్‌మెంట్

ఉద్యోగులకు ఈ ఏడాది కూడా మెడికల్ రీయింబర్స్‌మెంట్ కొనసాగుతుంది. ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించాం. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నాం. మార్చి 7వ తేదీన చర్చల సందర్భంగా కార్యాచరణ ప్రకటించాం. దాని ప్రకారం ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ బకాయిలు, జీపీఎఫ్, జీఎల్ఐకు చెందిన బకాయిలు రూ.5,000 కోట్లు చెల్లించాం. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలోనే చెల్లిస్తున్నాం. ఉద్యోగులు ఎక్కువగా సర్వీసుకు సంబంధించిన 70 అంశాలను ప్రస్తావించారు. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

వెనుకబడ్డ జిల్లాలకు మరిన్ని నిధులు..

ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు జిల్లాకు రూ.50 కోట్లు చొప్పున ఏడు జిల్లాలకు రూ.350 కోట్లు ఇచ్చారు. ఆ జిల్లాల అభివృద్ధికి ఈ నిధులు సరిపోవని, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. ఇది నీతి ఆయోగ్ పరిశీలనలో ఉంది. విభజన అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు గట్టిగా కృషి చేస్తాం. విభజన అంశాలపై సుప్రీం లో దాఖలైన కేసు అఫిడవిట్‌లో పోలవరం, రెవెన్యూ లోటుతో పాటు అనేక అంశాలను ప్రస్తావించాం.

రహదారులకు ఇప్పుడే ఎక్కువ ఖర్చు: రావత్

రహదారుల మరమ్మతులు, నిర్మాణాలకు గతంలో కంటే ఇప్పుడే ఎక్కువగా ఖర్చు చేస్తున్నామని ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ ఎస్.ఎస్.రావత్ తెలిపారు. ఉద్యోగులకు సకాలంలోనే జీతాలు, పెన్షన్లు ఇచ్చామన్నారు.

చిత్రకారుడు బాలి కన్నుమూత



ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): 'బాలి' పేరుతో తెలుగు చిత్రకళా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న కళా ఋషి మేడిశెట్టి శంకరరావు (బాలి)(81) మంగళవారం మృతి చెందారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–10లో నివాసముంటున్న ఆయన కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. 1942లో మేడిశెట్టి అన్నపూర్ణ, లక్ష్మణరావు దంపతులకు విశాఖలో ఆయన జన్మించారు. హైస్కూల్ చదివే రోజుల్లో డ్రాయింగ్ మాస్టారు పెద్దపల్లి వెంకటరత్నం వద్ద చిత్ర కళపై మెలకువలు నేర్చుకున్నారు. అనంతరం ఆంధ్రపత్రిక వీక్లీలో 1958లో తన మొదటి చిత్రం ప్రచురితమైంది. వేలాది నవలలకు కవర్ డిజైన్‌లు, బొమ్మలు గీశారు. గుంటూరు కళాపీఠం ఆధ్వర్యంలో ఆయన్ని చిత్రకళా సామ్రాట్ బిరుదుతో సత్కరించారు. 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హంస అవార్డుతో సత్కరించింది. 'అమ్మో కావాలి' ఆయన రాసిన తొలి పుస్తకం కాగా, ఎనిమిది వరకు కార్టూన్ పుస్తకాలను రచించారు. ఆయన మరణంపై పలువురు కళారంగ ప్రముఖులు, జర్నలిస్టులు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

నైపుణ్యాల పెంపుతో మరింత మెరుగైన వైద్యం

- వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ వైద్యులు, సిబ్బంది తమ నైపుణ్యాలను పెంచుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సూచించారు. తద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలను అందించవచ్చన్నారు. ఎకో ఇండియా(న్యూఢిల్లీ) సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడలో కృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, మధుమేహం, రక్తపోటు, ఇతర ఎన్‌సీడీ–సీడీ బాధితులకు నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విజయనగరం మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ అనుమతులు వచ్చాయని తెలిపారు. ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, రాజమండ్రి కాలేజీల్లో ఎన్ఎంసీ తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కరోనా వ్యాప్తికి సంబంధించి ఆందోళనకర పరిస్థితులు లేవని కృష్ణబాబు చెప్పారు. ఉన్నతాధికారులు జె.నివాస్, వి.రామిరెడ్డి, ఎకో ఇండియా సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డా.సందీప్ భల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈహెచ్ఎస్‌లో శాశ్వతంగా 46 క్యాన్సర్ ప్రొసీజర్‌లు

ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్(ఈఎహెచ్ఎస్)లో 46 క్యాన్సర్ ప్రొసీజర్‌లను శాశ్వతంగా చేరుస్తూ వైద్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. రెండేళ్ల క్రితం 46 ప్రొసీజర్‌లను ఈహెచ్ఎస్ పరిధిలోకి చేర్చి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. అయితే ఏటా ఆ ఉత్తర్వులను రెన్యూవల్ చేయాల్సి ఉండేది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఇకపై ఏటా రెన్యూవల్‌తో పనిలేకుండా పోయింది.

వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ కవరేజ్ స్కీమ్ పొడిగింపు

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల కాంప్రహెన్సివ్ హెల్త్ కవరేజ్ స్కీమ్‌ను 2023–24 ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ప్రభుత్వం పొడిగించింది. ఇందుకనుగుణంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, సమాచార పౌర సంబంధాల శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

కేఎల్‌యూ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలగా ప్రారంభమై డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరుకుని వేలాది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ జాతీయ స్థాయిలో ప్రముఖ విద్యాసంస్థగా కేఎల్‌యూ గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. కేఎల్‌యూ ఉప కులపతి డాక్టర్ పార్థసారథివర్మ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మే 5వ తేదీ వరకు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి తీసుకునే చర్యలను పరిశీలిస్తాం

సాక్షి, అమరావతి : తెలుగు భాషాభివృద్ధి కోసం ఏర్పాటైన తెలుగు భాషాభివృద్ధి సంస్థ ఏం చర్యలు తీసుకుంటుందో పరిశీలిస్తామని హైకోర్టు తెలిపింది. ఇందుకోసం ఆ సంస్థను ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్‌ను ఆదేశించింది. సంస్థ తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా లేకపోతే తగిన ఆదేశాలు జారీ చేస్తామని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను జూన్ 22కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అధికార భాషా చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ప్రభుత్వ న్యాయవాది శ్రేయాస్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలుగు భాష అమలు కోసం తెలుగు భాషాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశామన్నారు. తెలుగు భాష అమలుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వివరించారు.

ఆలయ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- ఇప్పటికే రూ.700 కోట్ల విలువైన భూముల్ని కాపాడాం
- ఓ పత్రిక కథనం రాసి క్రెడిట్ తీసుకోవాలనుకుంది
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి:ఆలయ భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ చెప్పారు. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలు, మఠాలకు సంబంధించిన భూముల స్థితిగతులపై మంగళవారం దేవదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఆక్రమణలో ఉన్న భూములను ఆక్రమణదారుల చెరనుంచి విడిపించి దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక కసరత్తు చేస్తోందని, కిందిస్థాయి అధికారులకు సూచనలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే పెద్ద ఎత్తున అధికారులతో సమావేశం నిర్వహించాలని ముందే నిర్ణయించుకుంటే.. ఒక పత్రిక (ఈనాడును ఉద్దేశించి) ఓ కథనం రాసిందన్నారు. ఆ కథనం ఆధారంగా ఈ సమావేశం నిర్వహించినట్టుగా క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేసిందని ఎద్దేవా చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణతో పాటు అన్ని జిల్లాల దేవదాయశాఖ అధికారులు, దాదాపు 500 మంది ఈవోలు సమావేశంలో పాల్గొన్నారు.

రూ.700 కోట్ల భూముల్ని స్వాధీనం చేసుకున్నాం

సమావేశం అనంతరం కొట్టు సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. అనకాపల్లిలో అంబికా బాగ్‌కు సంబంధించి రూ.500 కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గుంటూరులోనూ రూ.200 కోట్ల విలువ చేసే ఆంజనేయస్వామి ఆలయ భూములను స్వాధీనం చేసుకుని దేవదాయ శాఖ అధీనంలోకి తీసుకున్నామన్నారు. ఆక్రమణలో ఉన్న భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులన్నింటికీ వెంటనే కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. భూములు కౌలుకు తీసుకున్న వ్యక్తులు ఏళ్ల తరబడి లీజులు పెంచకపోవడంపై సూచనలిచ్చామని చెప్పారు.

దేవుడి భూములు ఆన్‌లైన్

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న భూముల రీసర్వే ఆలయ భూముల్ని కాపాడుకోవడానికి మంచి అవకాశమని.. దేవుడి భూములకు సంబంధించి భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు. రానున్న రోజుల్లో అన్ని ఆలయాల వారీగా దేవుడి భూములను మొత్తం ఆన్‌లైన్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేశామని.. ఇందుకు సంబంధించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశామని వివరించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, మిగిలిన కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఒక్కొక్క జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. దేవదాయ శాఖకు సంబంధించిన భూములపై లీజుల ద్వారా ఆయా ఆలయాలకు ఏడాదికి రూ.150 కోట్ల ఆదాయం వస్తున్నట్టు ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

ప్రజా సంక్షేమం కోసం శ్రీలక్ష్మీ మహా యజ్ఞం

రాష్ట్రంలో నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గొప్ప సంక్షేమ పాలన సాగుతోందని.. ఈ సంక్షేమ రాజ్యం ఇలాగే కొనసాగాలని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సంక్షేమం కోసం మహాయజ్ఞాన్ని తలపెట్టినట్టు ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆగమ పండితుల సలహా మేరకు మే 12నుంచి 17వ తేదీ వరకు ఆరు రోజులపాటు మహాచండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ తరహా యజ్ఞం నిర్వహించడం ఇదే మొదటిసారి అని, ఇందుకు టీటీడీ కూడా సహకారం అందించనుందన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో తలపెట్టిన ఈ యజ్ఞంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.


భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు

మహా యజ్ఞాన్ని సాధారణ భక్తులు వీక్షించే వీలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. భక్తులకు యజ్ఞశాలలోకి అనుమతి ఉండదని.. యజ్ఞం జరిగే యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేసుకోవడానికి ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. రోజుకొక స్వామి వార్ల కల్యాణాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. చాగంటి కోటేశ్వరరావు వంటి ప్రముఖుల ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.


చిత్తూరులో ప్రేమోన్మాదం ?

రక్తపు మడుగులో యువతీ యువకుడు

- తన బ్యూటీపార్లర్‌లోనే బ్యూటీషియన్ మృతి
- ఆమె పక్కనే కొన ఊపిరితో పడి ఉన్న యువకుడు
- యువతిని చంపి.. యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించాడనే అనుమానం



దుర్గా ప్రశాంతి (ఫైల్)



రక్తపు మడుగులో పడున్న దుర్గా ప్రశాంతి, చక్రవర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మంగళవారం ఓ బ్యూటీషియన్ చనిపోవడం... పక్కనే ఆమె స్నేహితుడు రక్తపుమడుగులో పడి ఉండటం సంచలనం సృష్టించింది. ఇద్దరూ రక్తపుమడుగులో పడి ఉండటంతో యువతి గొంతు కోసి చంపి... ఆ తర్వాత ఆమె స్నేహితుడు గొంతు, ఛాతి, చేతులు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించి ఉంటాడని తొలుత భావించారు. అయితే, పోలీసులు వచ్చి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మృతురాలి శరీరంపై ఎక్కడా చిన్న గాయం కూడా కనిపించలేదు. యువతిని ఆమె స్నేహితుడు గొంతు నులిమి చంపేసి, అనంతరం అతను బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగరాజు, ఇందిర దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. కుమారుడు 15 ఏళ్ల క్రితం విద్యుత్ షాక్‌తో చనిపోయాడు. పెద్ద కుమార్తెకు ఏడాది క్రితం పెళ్లి చేశారు. రెండో కుమార్తె దుర్గాప్రశాంతి(23) ఎం.ఫార్మసీ పూర్తిచేసి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కొంతకాలం పనిచేసింది. ఆమె ఏడాది క్రితం హైదరాబాద్‌కు వెళ్లి బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంది. నాలుగు నెలల క్రితం చిత్తూరులోని కొండమిట్ట ప్రాంతంలో సొంతగా బ్యూటీపార్లర్ ప్రారంభించింది.

ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై...

దుర్గాప్రశాంతికి రెండేళ్ల క్రితం ఫేస్‌బుక్‌లో చక్రవర్తి (27) అనే యువకుడు పరిచయమయ్యాడు. అతనిది తెలంగాణలోని భద్రాచలం జిల్లా కొత్తగూడెం కాగా, రెండేళ్లు దుబాయ్‌లో వంట మాస్టర్‌గా పనిచేశాడు. ఆ సమయంలోనే చక్రవర్తికి, దుర్గాప్రశాంతికి ఫేస్‌బుక్ ద్వారా స్నేహం కుదిరింది. రెండు నెలల క్రితం దుబాయ్ నుంచి వచ్చిన చక్రవర్తి... తన తల్లిని తీసుకుని చిత్తూరు వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. నగరంలోని దర్గా కూడలిలో బ్రెడ్ ఆమ్లెట్ దుకాణం పెట్టి జీవనం సాగిస్తున్నాడు. ఇతని తల్లి, దుర్గాప్రశాంతి తల్లి ఇందిర కూడా స్నేహితులుగా మారారు. రెండు రోజుల క్రితం ఇద్దరూ కలిసి కాణిపాకం వినాయకస్వామి ఆలయానికి కూడా వెళ్లి వచ్చారు. దుర్గాప్రశాంతి బ్యూటీపార్లర్ వద్దకు మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చక్రవర్తి వచ్చాడు. ఇద్దరూ లోపలికి వెళ్లి తలుపులు వేసుకున్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇందిర వచ్చి బ్యూటీపార్లర్ తలుపు తీసి చూడగా... దుర్గాప్రశాంతి రక్తపు మడుగులో అచేతనంగా పడి ఉంది. చక్రవర్తి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ నరసింహరాజు ఘటనాస్థలానికి చేరుకుని చక్రవర్తిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దుర్గాప్రశాంతి అప్పటికే చనిపోయి ఉంది. చక్రవర్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రిమ్స్‌కు తరలించారు. ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద దుర్గాప్రశాంతి మృతదేహాన్ని ఎస్పీ రిషాంత్‌రెడ్డి పరిశీలించి ఘటనపై ఆరా తీశారు.

ఇప్పుడే పెళ్లి వద్దంటూ...

దుర్గాప్రశాంతికి పెళ్లి చేసేందుకు ఆమె తల్లిదండ్రులు ఇటీవల ఒక సంబంధం చూశారు. అబ్బాయి వైద్యుడు అని, పెళ్లి చేసుకోవాలని కోరారు. అయితే, ఏడాది తర్వాత పెళ్లి గురించి చూద్దామని దుర్గాప్రశాంతి చెప్పింది. ఈ నేపథ్యంలో చక్రవర్తి, దుర్గాప్రశాంతికి మధ్య ఏదైనా గొడవ జరిగి... ఆమె గొంతు నులిమి చంపేసి, అతను బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడా..? అని పోలీసులు అనుమానిస్తున్నారు. దుర్గాప్రశాంతి ఆత్మహత్య చేసుకుందనడానికి ఘటనాస్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదు. చక్రవర్తి స్పృహలోకి వస్తేనే అసలు విషయం తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943